

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




శ్రీసిటీలో బాయిలర్ పేలుడు ఘటనలో...

## బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం

ఒక్కొక్కరికీ రూ.50 లక్షల పరిహారం

మంత్రి వాసంశెట్టి సుభాష్

- వివరాలు 8 లో..

# ఆంధ్రప్రదేశ్‌కు ఐఐటీయన్ల మేధస్సు

- వరల్డ్ పాన్ ఐఐటీ కౌన్సిల్‌కు వేదికగా అమరావతి
- డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్లతో పాన్ ఐఐటీ వెంచర్ ఫండ్
- 100 మందితో గ్లోబల్ ఐఐటీ మెంటర్ల నెట్‌వర్క్
- ఏపీకి టెక్నాలజీని ట్రాన్స్‌ఫర్ చేసేందుకు 23 ఐఐటీల అంగీకారం
- పాన్ ఐఐటీ సమ్మిట్-2026లో సీఎం సమక్షంలో డిక్లరేషన్ విడుదల
- 'క్యు-శివ' పేరుతో ఐదు క్వాంటం కంప్యూటర్లను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

2




ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ నాలెడ్జ్, డీప్‌టెక్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సాంకేతిక రంగానికి చెందిన అంతర్జాతీయ మేధోశక్తితో ప్రభుత్వం సరికొత్త భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టింది. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళా వేదికలో శనివారం వైభవంగా జరిగిన "పాన్ ఐఐటీ ఏపీ సమ్మిట్-2026" ముగింపు వేడుకలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్ర-2047' లక్ష్యాల సాధనలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐఐటీయన్ల మేధస్సును, ఆవిష్కరణలను రాష్ట్ర అభివృద్ధికి అనుసంధానించాలని ఆయన పిలుపునిచ్చారు. అమరావతి కేంద్రంగా 'పాన్ ఐఐటీ వరల్డ్ కౌన్సిల్' ఏర్పాటును ఆమోదించడంతో పాటు డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు ఊతమిచ్చేందుకు రూ.500 కోట్లతో 'పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్' ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. '

మేడ్ ఇన్ అమరావతి' బ్రాండ్‌తో క్యూబిట్ ఫోర్స్ రూపొందించిన 5 'క్యూ-శివ' క్వాంటమ్ కంప్యూటర్లు, 4 కెల్విన్ ప్రాసెసర్‌ను సీఎం ఆవిష్కరించారు. రాష్ట్రం నుంచి 50 లక్షల మంది ఏఐ నిపుణులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పాఠశాల స్థాయి నుంచే స్టార్టప్ సంస్కృతిని, ఐఐటీ స్థాయి ల్యాబ్‌లను ప్రోత్సహిస్తామని ఆయన స్పష్టం చేశారు.



## పరిశ్రమదారులే జాతి నిర్మాణకర్తలు

- ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చడమే మా లక్ష్యం
- చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్‌వేర్ టీమ్ అండగా ఉంది
- పాన్ ఐఐటీ సమ్మిట్-2026లో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్

4

పరిశ్రమదారులే జాతి నిర్మాణకర్తలు... వారితో కలిసి పని చేయాలి, ప్రతి పాలసీని వారితో కలిసి రూపొందించాలి అన్నదే తమ ధ్యేయమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. తద్వారా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చడమే తమ లక్ష్యమన్నారు. విజయవాడలో ని శనివారం జరిగిన 'పాన్ ఐఐటీ ఏపీ సమ్మిట్-2026'లో ఆయన ముఖ్య వక్తగా మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి దూరదృష్టితో 'స్వర్ణాంధ్ర' సాధనకు తమ టీమ్ అంకితభావంతో పనిచేస్తోందని తెలిపారు. అనుభవజ్ఞుడైన సీఎం చంద్రబాబునాయుడనే 'సాఫ్ట్‌వేర్'కు... యువత, నవతతో కూడిన క్యాబినెట్, ఎమ్మెల్యేల 'హార్డ్‌వేర్' జతకావడంతో ఆంధ్రప్రదేశ్ సరికొత్త పంథాలో పయనిస్తోందన్నారు. దేశాభివృద్ధికి రాబోయే దశాబ్ద కాలం (గోల్డెన్ డికేడ్) ఎంతో కీలకమని, స్పీడ్ (వేగం), సర్వీస్ (సేవ), స్టెబిలిటీ (పాలసీ స్థిరత్వం) అనే '3ఎస్ మంత్రం'తో రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్తామని లోకేష్ ప్రకటించారు.



## పేదల గృహ నిర్మాణంలో మరో కీలక అడుగు

మూడు లక్షల ఇళ్లకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి నేడు భూమి పూజ చేయనున్న సీఎం చంద్రబాబు

తెనాలిలో 3డి కాంక్రీట్ ప్రింటింగ్ పైలట్ ప్రాజెక్టు పనులకు శ్రీకారం

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. పీఎంఏవై-జి 2.0 కింద రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా మంజూరైన 3లక్షల ఇళ్ల నిర్మాణానికి కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదివారం తెనాలి మండలం బుర్రిపాలెంలో భూమి పూజ చేస్తారు.

5

కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఏపీ ప్రభుత్వం, సీఎస్ఐఆర్, సీబీఆర్ఐ (రూర్కీ) సంయుక్త భాగస్వామ్యంతో 3డి కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో రూ.14 కోట్లతో బుర్రిపాలెం, ఓబులనాయుడుపాలెం గ్రామాల్లో 177 మోడల్ ఇళ్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేస్తారు. లబ్ధిదారుల తో ముఖాముఖి అనంతరం తెనాలి బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు.

## స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి



7

ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కోనసీమ జిల్లా కూటమి ఎమ్మెల్యేలు, ప్రధాన నాయకులతో సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు



వివేకా హత్య కేసులో ఈడీ తలుపులు కొడుతున్నా

## గొడ్డలి పార్టీ అధినేత ఎందుకు నోరు విప్పడు?

- ఆధారాలన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే
- జగన్ జవాబు చెప్పాల్సిందే
- హంతకులు తప్పించుకోలేరు, చిప్పకూడు తప్పదు
- ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్

- వివరాలు 10 లో..

కళాకారుల సంక్షేమం, సంస్కృతి

## పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ గోదావరి పుష్కరాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శనలకు పెద్దపీట వేస్తామని వెల్లడి



9



చైతన్యరథం

# ఆంధ్రప్రదేశ్‌కు ఐఐటీయన్ల మేధస్సు

- వరల్డ్ పాన్ ఐఐటీ కౌన్సిల్‌కు వేదికగా అమరావతి
- డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్లతో పాన్ ఐఐటీ వెంచర్ ఫండ్
- 100 మందితో గ్లోబల్ ఐఐటీ మెంటర్ల నెట్‌వర్క్
- ఏపీకి టెక్నాలజీని ట్రాన్స్‌ఫర్ చేసేందుకు 23 ఐఐటీల అంగీకారం
- పాన్ ఐఐటీ ఏపీ 2026 సదస్సులో సీఎం సమక్షంలో డిక్లరేషన్ విడుదల
- 'క్యూ-శివ' పేరుతో ఐదు క్వాంటం కంప్యూటర్లను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు
- 2027 ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్లు




విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఐఐటీయన్ల మేధస్సు ఉపయోగపడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలతోపాటు దేశాభివృద్ధి కోసం వారంతా అనుసంధానమై నెట్వర్క్‌గా ఏర్పడాలని ఆయన సూచించారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళా వేదికలో శనివారం జరిగిన పాన్ ఐఐటీ ఏపీ సమ్మిట్-2026లో పాల్గొన్న ముఖ్యమంత్రి అమరావతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ నాలెడ్జ్, డీప్‌టెక్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కీలక అడుగులు పడ్డాయని వ్యాఖ్యానించారు. అమరావతిలో పాన్ ఐఐటీ వరల్డ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో పాటు డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులకు ఊతమిచ్చేలా రూ.500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు క్యూ-శివ పేరుతో రూపొందించిన ఐదు క్వాంటం కంప్యూటర్లను ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్ రూపొందించిన ఈ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం కంప్యూటర్ ల్యాబ్‌లుగా ఉపయోగపడనున్నాయి. 4 కెల్విన్ ప్రాసెసర్ సృష్టిని కూడా సీఎం ఆవిష్కరించారు. మేడిన్ అమరావతి బ్రాండ్ సృష్టించేలా క్వాంటం కంప్యూటర్ల తయారీకి శ్రీకారం చుట్టడం రాష్ట్రంలో డీప్‌టెక్ ఉత్పత్తుల తయారీ సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచిందని ముఖ్యమంత్రి అన్నారు. క్యూ-శివ కంప్యూటర్ల తయారీలో కీలకంగా వ్యవహరించిన చండీగఢ్ యూనివర్సిటీ, క్యూబిట్ ఫోర్స్ ప్రతినిధులను సీఎం అభినందించారు. క్యు-శివ క్వాంటం కంప్యూటర్లను తయారు చేయడానికి అసరమైన కాంపోనెంట్లు మచిలీపట్నంలోనే లభ్యమవుతున్నాయని క్యూబిట్ సంస్థ సీఈవో వివరించారు.

## అమరావతిలో క్వాంటం ఎకో సిస్టం అభివృద్ధి

దేశంలోని 23 ఐఐటీలు ప్రపంచానికి అత్యుత్తమ మేధస్సును అందించాయని, జాతి నిర్మాణంలో ఐఐటీయన్ల పాత్ర కీలకమని సీఎం చంద్రబాబు అన్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలను చేరుకునేలా ఐఐటియన్లు తమ మేధస్సును వినియోగించాలని కోరారు. సిలికాన్ వ్యాలీ గురించి మాట్లాడినట్లే ఇకపై అమరావతి క్వాంటం వ్యాలీ గురించి కూడా ప్రపంచం మాట్లాడుతుందన్నారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించి ఇప్పటికే టెస్ట్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయని సీఎం తెలిపారు. ఐబీఎం-టీసీఎస్, ఎల్‌అండ్‌టీ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న క్వాంటం కంప్యూటర్ అమరావతి నుంచి ఆపరేట్ కానుందని, వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ ప్రారంభమవుతాయని సీఎం వెల్లడించారు. 156 క్యూబిట్ క్వాంటం సిస్టమ్ అందుబాటులోకి వచ్చేలోగానే అమరావతిలో క్వాంటం టెక్నాలజీకి అవసరమైన మౌలిక వసతులు సిద్ధమవుతున్నాయని చెప్పారు. భవిష్యత్తులో క్వాంటం కంప్యూటర్లను మాత్రమే కాకుండా వాటికి అవసరమైన పరికరాలను కూడా తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఏపీ ఎదగాలని సీఎం ఆకాంక్షించారు. భారత్, ఆంధ్రప్రదేశ్ కేవలం టెక్నాలజీ వినియోగదారులుగా కాకుండా ఉత్పత్తిదారులుగా ఎదగాలని సీఎం పిలుపునిచ్చారు. వచ్చే రెండేళ్లలో కమర్షియల్ క్వాంటం కంప్యూటర్ల ఉత్పత్తికి అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రాష్ట్రంలో నైపుణ్యాలు, పరిశోధన, తయారీ సామర్థ్యాలను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో ఐఐటీ స్థాయి ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని, ఆరో తరగతి నుంచే విద్యార్థుల్లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాలను పెంపొందించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దీనికి సహకారం అందించేందుకు ఐఐటీలు ముందుకు వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు.

## మంచి ఆలోచనను ఆచరణలో పెడితే విప్లవం

వినూత్న ఆలోచనలకు తాను ఎప్పుడూ ప్రాధాన్యమిస్తానని సీఎం చెప్పారు. రాళ్ల సీమగా ఉన్న రాయలసీమను రతనాల సీమగా మార్చాలనే ఆలోచన నుంచే గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటైందని తెలిపారు. ఇప్పుడు ఈ హబ్ ద్వారా రాయలసీమలో విప్లవాత్మకమైన అభివృద్ధి వస్తుందన్నారు. 20 రకాల ఫలాలు ఉత్పత్తి అవుతున్న రాయలసీమను సమర్థవంతమైన నీటి నిర్వహణ, ఆధునిక సాంకేతికతతో వచ్చే పదేళ్లలో ప్రపంచ ఉద్యానవన హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేస్తున్నామని, దీనికి సహకారం అందించేందుకు రిలయన్స్ సంస్థ ముందుకొచ్చిందని తెలిపారు. దేశంలో కోటి మంది ఏఐ నిపుణులను తయారు చేయాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఏపీ నుంచి 50 లక్షల మంది ఏఐ నిపుణులను అందించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని సీఎం వెల్లడించారు. టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకుంటే అభివృద్ధి లక్ష్యాలను మరింత వేగంగా చేరుకోవచ్చని ముఖ్యమంత్రి అన్నారు.

## పాన్ ఐఐటీ ఏపీ సమ్మిట్ డిక్లరేషన్

సమ్మిట్‌లో జరిగిన సుదీర్ఘ మేథోమథనం అనంతరం పాన్ ఐఐటీ ప్రతినిధులు, ఏపీ ప్రభుత్వం ఉమ్మడిగా డిక్లరేషన్ విడుదల చేశాయి. అమరావతిలో పాన్ ఐఐటీ వరల్డ్ కౌన్సిల్ ఏర్పాటు కానుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐఐటీ పూర్వ విద్యార్థులు, విద్యావేత్తలు, పరిశ్రమలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలను అనుసంధానం చేసే వేదికగా ఈ కౌన్సిల్ పని చేయనుంది. దేశంలోని 23 ఐఐటీల నుంచి వచ్చిన సుమారు 5 లక్షల మంది ఐఐటీయన్ల మేధస్సును ఏపీ అభివృద్ధికి వినియోగించుకునేలా ఈ నెట్‌వర్క్‌ను తీర్చిదిద్దనున్నారు. డీప్‌టెక్ అభివృద్ధికి పాన్ ఐఐటీ అమరావతి కౌన్సిల్ నోడల్ సంస్థగా పనిచేయనుంది. 23 ఐఐటీలు, 25 ఇన్నోవేషన్ హబ్‌ల నుంచి సాంకేతికతలను గుర్తించి వాటిని ఆంధ్రప్రదేశ్‌లోని పరిశ్రమలు, స్టార్టప్‌లు, ఉత్పత్తుల అభివృద్ధికి అందుబాటులోకి తీసుకురానున్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను పాన్ ఐఐటీ ఎకో సిస్టంతో అనుసంధానం చేసి పరిశోధన, ఫ్యాకల్టీ, విద్యార్థులకు కొత్త అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు 10 ఇండస్ట్రీ చాప్టర్లను ఏర్పాటు చేసి పరిశోధన, నైపుణ్యాలను బలోపేతం చేయాలని నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 100 మంది ఐఐటీ మెంటర్ల నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసి ఏపీ స్టార్టప్‌లు, ఔత్సాహికులకు మార్గనిర్దేశం చేయనున్నారు. 2030 నాటికి రాష్ట్రంలో కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేసేలా ప్రణాళిక రూపొందించారు. క్వాంటమ్-ఏఐ, సెమీ కండక్టర్లు, స్పేస్-డిఫెన్స్, హెల్త్, అగ్రిటెక్, బ్లూ వాటర్ ఎకానమీ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేలా డీప్‌టెక్ పాలసీ ప్యాకేజీ కింద చర్యలు చేపట్టనున్నారు. రూ.500 కోట్ల వెంచర్ ఫండ్‌ను డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, కొత్త టెక్నాలజీలకు పెట్టుబడులుగా వినియోగించనున్నారు.




## వివిధ రంగాలపై ప్యానెల్ డిస్కషన్లు

రెండు రోజుల పాటు జరిగిన పాన్ ఐఐటీ సదస్సులో ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ తిరుపతి, ఐఐటీ జమ్మూ, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ ధన్‌బాద్, ఐఐటీ వారణాసి, ఐఐటీ భువనేశ్వర్ తదితర సంస్థల డైరెక్టర్లు పాల్గొన్నారు. ఐఐటీల సీఈవోలు, వెంచర్ క్యాపిటలిస్టులతో రెండు రోజు సదస్సులో సీఎం సమావేశమై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు, టెక్నాలజీ బదిలీ, పట్టణీకరణలో డీప్‌టెక్ వినియోగం, స్టార్టప్‌లు, పెట్టుబడులు తదితర అంశాలపై చర్చించారు. ప్రతిఏటా పాన్ ఐఐటీ సమ్మిట్ నిర్వహించి వివిధ అంశాలపై చర్చించాలని సీఎం ప్రతిపాదించారు. అంతకు ముందు ఇంధనం, స్వచ్ఛాంధ్ర, నిత్య జీవితంలో డీప్‌టెక్, స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, అందరికీ ఆరోగ్య సంరక్షణ సేవలు, అగ్రిటెక్-రైతులు, నీటి భద్రత తదితర అంశాలపై చర్చలు జరిగాయి.





# ఆవిష్కరణలు అద్భుతం

విజయవాడ (చైతన్యరథం): విజయవాడలోని అంబేద్కర్ కళా వేదికలో శనివారం జరిగిన పాన్‌ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సమ్మిట్ 2026లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. వివిధ స్టార్టప్‌లతోపాటు ఐఐటీయన్ల నూతన ఆవిష్కరణలను ఆయన చంద్రబాబు పరిశీలించారు. వాటిని ఆసక్తిగా చూసి చాలా అద్భుతంగా ఉన్నాయంటూ ప్రశంసించారు.























# పరిశ్రమదారులే జాతి నిర్మాణకర్తలు

- ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చడమే మా లక్ష్యం
- చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్‌వేర్ టీమ్ అండగా ఉంది
- పాలసీలు కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకునేలా ఉండాలి
- పాన్ ఐఐటీ సమ్మిట్-2026లో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్




అమరావతి (చైతన్యరథం): భారతదేశం ఇప్పటి వరకు చూడని మార్పు, అభివృద్ధి, సుపరిపాలనని తీసుకు రావడానికి మేము తపన పడుతున్నాం. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చేందుకు మా టీం ఉమ్మడి లక్ష్యంతో పని చేస్తోందని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. పాన్ ఐఐటీ సమ్మిట్-2026లో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... మేము అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఎదగాలి... మోదీజీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి మా వంతు సహకారం అందించాలన్నదే మా ధ్యేయం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రస్తుతం 4.0 ఆపరేటింగ్ సిస్టమ్‌తో మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు. ఆయనకు ఇప్పుడు ఒక యంగ్ హార్డ్‌వేర్ టీమ్ అండగా ఉంది. 50% శాసనసభ్యులు మొదటి సారి గెలిచినవారే, 25 మంది మంత్రుల్లో 17 మంది మొదటిసారి మంత్రులైనవారు. అనుభవజ్ఞమైన సాఫ్ట్ వేర్‌కు యువ, డైనమిక్ హార్డ్‌వేర్ కలయికే నేటి ఆంధ్ర ప్రదేశ్‌ను ప్రత్యేకంగా,విభిన్నంగా నిలబెడుతోంది. మా టీమ్‌కు ఒక స్పష్టమైన విజన్ ఉంది.ఏరంగమైె నా ఆంధ్రప్రదేశ్ నెం.1గా ఉండాలి. నా దృష్టిలో పాన్ ఐఐటీ అంటే కంపెనీలు, టెక్నాలజీలు, పరిశోధనా సంస్థలు... మొత్తం పరిశ్రమలను నిర్మించిన వ్యక్తులు. పాన్ ఐఐటీ 23ఐఐటీల పూర్వ విద్యార్థులందరినీ ఒక చోట చేర్చుతుంది. భారతదేశం అంతటా, ప్రపంచ ప్రధాన టెక్నాలజీ హబ్‌లలో 5లక్షలకు పైగా ఐఐటీ గ్రాడ్యుయేట్లను కలుపుతుంది. ఈ కమ్యూనిటీ మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో సమావేశం కావడం ఆనందంగా ఉంది.

## భారత్ అభివృద్ధికి దశాబ్దం చాలు

అమెరికా, యూరప్ దేశాలు అభివృద్ధి చెందిన దేశాలుగా మారడానికి దాదాపు 100 సంవత్సరాలు పట్టింది. దుబాయ్ దాదాపు 30 సంవత్సరాల్లో, సింగపూర్ సుమారు 25 సంవత్సరాల్లో ఆ స్థాయికి చేరుకున్నాయి. భారత్ ఇప్పుడు ఒక కీలక దశలో ఉంది. అభివృద్ధి సాధించడానికి ఒక దశాబ్దం సరిపోతుందని నేను నమ్ముతున్నాను. ఆ 'గోల్డెన్ డికేడ్' మనదే కావాలి. దీనికి త్రీ "ఎస్" మంత్రమే ఆధారం. మొదటిది-స్పీడ్, రెండవది-సర్వీస్, మూడవది-స్టెబిలిటీ. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వేగాన్ని చూస్తే స్పీడ్‌కు అర్థం తెలుస్తుంది. మా టీమ్ ఇప్పుడు ఆతృతతో ఉంది. ప్రజలు మాకు ఇచ్చింది ఐదు సంవత్సరాల సమయం. ఆ సమయంలోనే ఫలితాలు చూపించాలి.

కేవలం ఎంవోయూలు కుదుర్చుకుని వాటిని మర్చిపోయే పని మాది కాదు. ప్రాజెక్టులకు వాస్తవ రూపమిచ్చి, వాటి ద్వారా ఉద్యోగాలు సృష్టించాలన్న తపన మాది. రెండోది సర్వీస్. పరిశ్రమల అభివృద్ధిలో ప్రభుత్వానికి ఎంతో కీలకమైన పాత్ర ఉందని మేము నమ్ముతున్నాం. వ్యవస్థాపకులు, పరిశ్రమలను మేము 'జాతి నిర్మాణకర్తలు'గా భావిస్తున్నాం. మీతో కలిసి పనిచేయాలి, ప్రతిపాలసీని మీతో కలిసి రూపొందించాలి. ప్రపంచస్థాయి పాలనను అందించాలి. అదే మా సేవా దృక్పథం. నిజానికి, రాష్ట్రంలోని టాప్ ప్రాజెక్టులపై వ్యక్తిగతంగా నేను శ్రద్ధవహిస్తాను. ప్రతి శనివారం సాయంత్రం లేదా ఆదివారం ఉదయం ప్రమోటర్లకు వారి ప్రాజెక్టులపై వ్యక్తిగత అప్‌డేట్ పంపుతాను. ఆ సమయంలో వారు తమ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్ట్ గురించి చదివే సమయం ఉంటుంది. ఇదే ప్రస్తుతం రాష్ట్రంలో వివిధ పెట్టుబడిదారులకు మేము అందిస్తున్న సేవ. మూడవది స్టెబిలిటీ. పాలసీ స్థిరత్వం, పాలసీ ఫ్రేమ్‌వర్క్ చాలా ముఖ్యమైనవి. పాలసీలు కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకునేలా ఉండాలి.





## ఏఐ ద్వారా అధికారులకు దిశానిర్దేశం

ఇప్పుడు ఐఏఎస్ అధికారులకు సహాయం చేయడానికి ఏఐని కూడా ఉపయోగిస్తున్నాం. వారు రూపొందించే పాలసీలు, ప్రభుత్వ ఉత్తర్వులు గత అనుభవాల ఆధారంగా రూపొందించ బడుతూ, చట్టపరమైన, రాజకీయ మార్పులను తట్టుకునేలా ఉండాలి. దీనికి ఒక మంచి ఉదాహరణ టీచర్ రిక్రూట్‌మెంట్. మేము 16వేల మంది ఉపాధ్యాయులను నియమించుకున్నాం. ఈ ప్రక్రియ చట్టపరమైన పరిశీలనను తట్టుకునేలా ఉండాలని నేను మా కమిషనర్‌కు ఆదేశాలిచ్చాను. ఆయన గతంలో వచ్చిన అన్ని కేసులను ఏఐ ఇంజిన్‌లో విశ్లేషించి, గత ఉత్తర్వులు ఎందుకు నిలిచిపోయాయో అర్థం చేసుకున్నారు. దాని ఆధారంగా అత్యుత్తమ రిక్రూట్‌మెంట్ పాలసీల్లో ఒకదాన్ని, చట్టపరమైన పరిశీలనను తట్టుకునేలా ఉత్తమమైన ప్రభుత్వ ఉత్తర్వును రూపొందించాం. మనమంతా కలిసి ఆలోచిస్తే స్థిరత్వాన్ని అందించగలం. మాకు క్వాంటం ఎంత ముఖ్యమో... అగ్రికల్చర్, హార్టికల్చర్ కూడా అంతే ముఖ్యం. మా ప్రభుత్వం మీ ప్రయాణంలో ఒక ఉత్ప్రేరకంగా పనిచేయగలదు.

## ఎంవోయూలపై కాదు... అమలుపైనే దృష్టి

నేను ఇప్పుడు చెప్పబోయే ఉదాహరణలు కేవలం ఎంవోయూలు లేదా కాగితాలపై ఉన్న హామీలు కాదు. వాస్తవంగా అమలు జరుగుతున్న ప్రాజెక్టుల గురించి మాట్లాడుతున్నాను. మా ముఖ్యమంత్రికి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ హార్టికల్చర్ హబ్‌గా మార్చాలనే విజన్ ఉంది. ఆయన ముఖేష్ అంబానీని ఒప్పించి రాయలసీమలోని మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఏ) ఏర్పాటు చేయించారు. నిన్న దానికి శంకుస్థాపన చేశాం. ఇది హార్టికల్చర్ ఎకో సిస్టమ్‌లో దాదాపు రూ.లక్ష కోట్ల పెట్టుబడులను సాధిస్తుంది. పరిశోధన నుంచి ప్రాసెసింగ్ వరకు, మెకనైజేషన్ నుంచి వినియోగదారుడికి నాణ్యమైన ఉత్పత్తి అందించడం వరకు, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం వరకు... మొత్తం వ్యవస్థను నిర్మించడమే లక్ష్యం. రెండోది స్టీల్ రంగం. గతంలో మనకు కేవలం రెండు స్టీల్ ప్లాంట్లు మాత్రమే ఉండేవి. ఇటీవల ఆర్సెలర్ మిట్టల్ 17 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంటుకు పునాది వేశాం. ఇతర రాష్ట్రాల్లో దాదాపు ఒక దశాబ్దం పాటు నిలిచిపోయిన ప్రాజెక్ట్ ఇది. నేను ఆదిత్య మిట్టల్‌తో మొదటి జూమ్ కాల్ చేసినప్పటి నుంచి పునాది వేసే దశకు పర్యావరణ అనుమతులతో సహా చేరుకోవడానికి కేవలం 17 నెలలు పట్టింది. ఇదే మా వేగానికి నిదర్శనం.

## ఏపీని ప్రపంచ పటంలో నిలిపిన గూగుల్

మూడోది డేటా సెంటర్ ఎకో సిస్టమ్. విశాఖపట్నంలో 'G' అంటే గూగుల్ లోగో గుర్తొచ్చే స్థాయిలో అది విశాఖను ప్రపంచ పటంలో నిలబెట్టింది. గూగుల్‌తో మొదటిసారి మాట్లాడినప్పుడు రెగ్యులేటరీ క్లారిటీ, పర్మినెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్, ట్యాక్సేషన్ వంటి అంశాలపై వారికి కొన్ని ప్రత్యేక విధానాలు అవసరమయ్యాయి. మేము కేంద్ర ప్రభుత్వం, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌లతో మాట్లాడి స్పష్టత తీసుకువచ్చాం. అలా కేవలం 13నెలల్లో గూగుల్ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్‌లో పునాది పడింది. మీరంతా నమో అంటే నరేంద్ర మోదీ అని అనుకుంటారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో నమో అంటే నాయుడు జీ, మోదీజీ జోడీ. ఎందుకంటే ఇక్కడ డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉంది.అందుకే ఇక్కడ పనులు వేగంగా జరుగుతున్నాయి.

## ప్రపంచానికి దిశానిర్దేశం స్థాయిలో ఎకో సిస్టమ్

ఈరోజు మనం స్కైరూట్ గురించి మాట్లాడుతున్నాం. కానీ ఒక సంవత్సరం క్రితం చాలా మందికి ఆ ప్రాజెక్టు గురించి తెలియదు. మేం ఒక సంవత్సరం క్రితం వారిని సంప్రదించాం.

- (మిగతా వివరాలు 5లో)





# పేదల గృహ నిర్మాణంలో మరో కీలక అడుగు

- మూడు లక్షల ఇళ్లకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి నేడు భూమి పూజ చేయనున్న సీఎం చంద్రబాబు
- తెనాలిలో 3డి కాంక్రీట్ ప్రింటింగ్ పైలట్ ప్రాజెక్టు పనులకు శ్రీకారం

అమరావతి (చైతన్యరథం): పేదల సొంతింటి కలను నిజం చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేస్తోంది. మరింత మందికి లబ్ధి కలిగేలా మూడు లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం బుర్రిపాలెంలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలిసి భూమి పూజ చేస్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 28 నెలల కాలంలో 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది. గతేడాది నవంబరులో 3లక్షల ఇళ్లకు.. ఈ ఏడాది మార్చిలో 2.50లక్షల ఇళ్లకు రెండు విడత లుగా సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించింది. ఇవే కాకుండా వచ్చే మార్చి నాటికి మరో 4.20 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు ఇచ్చేలా పనులు చేపడుతోంది. ఓ పక్కన రాష్ట్రంలో పేదలకు ఇళ్ల నిర్మాణం చేపడుతూనే... ప్రధానమంత్రి ఆవాస్ యోజన్-గ్రామీణ్ 2.0 పథకం కింద వీలైనన్ని ఇళ్లను కేటాయించేలా కేంద్రంతో సంప్రదింపులు జరిపింది. దీంట్లో భాగంగా ఇటీవలే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 3లక్షల ఇళ్లను కేటాయించింది. దీంతో మరింత జాప్యం చేయకుండా ఆ 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన చేసి నిర్మాణ పనుల ప్రక్రియను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లనుంది.

### ఇళ్ల నిర్మాణానికి కొత్త టెక్నాలజీ

గృహ నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, సీఎస్ఐఆర్-సీబీఆర్ఐ (రూర్కీ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా 3డి కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణాల ప్రక్రియ చేపట్టేలా పైలట్ ప్రాజెక్టు చేపడుతోంది. దీనికి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయ నున్నారు. దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెడుతున్న ఈ పైలట్ ప్రాజెక్టు కింద తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం, ఓబులనాయుడుపాలెం గ్రామాల్లో రూ.14కోట్ల అంచనాతో 177ఇళ్లు నిర్మించనున్నారు. అత్యంత వేగవంతమైన నిర్మాణం, శ్రమ, నిర్మాణ వ్యర్థాల తగ్గుదల, నాణ్యత, ధృఢత్వంతో ఉండేలా ఈ అత్యాధునిక టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణం ఉంటుంది.

### సీఎం పర్యటన వివరాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఉదయం 10.15 గంటలకు క్యాంపు కార్యాలయం నుంచి బయల్దేరి 10.35 గంటలకు తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామానికి చేరుకుంటారు. 10.40 గంటలకు 3డి ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశమవుతారు. 11.10 గంటలకు బహిరంగ సభలో పాల్గొంటారు. తెనాలి పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 1.35గంటలకు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

# పరిశ్రమదారులే జాతి నిర్మాణకర్తలు

(4వ పేజీ తరువాయి)

కేబినెట్ ద్వారా వారికి 300 ఎకరాల భూమి కేటాయించాం. దేశంలో ఎవరూ ఊహించని ధరకు భూమిని అందించాం. ఈ స్టార్టప్‌పై పెట్టుబడి పెట్టాల్సిన అవసరాన్ని నా కేబినెట్ సహచరులను ఒప్పించడానికి నాకు 30 నిమిషాలు పట్టింది. ఇలాంటి ధైర్యమైన నిర్ణయాలు తీసుకోవడానికి మేము సిద్ధంగా ఉన్నాం. క్వాంటం విషయంలో కూడా ఇదే విధమైన కృషి జరుగుతోంది. కామకోటి నాయకత్వంలో మేము అద్భుతమైన పురోగతి సాధిస్తున్నాం. క్వాంటం రంగంలో భారత్‌కే కాదు, ప్రపంచానికి దిశానిర్దేశం చేసే స్థాయిలో ఎకో సిస్టమ్‌ను నిర్మించబోతున్నాం.



### మా నిబద్ధతక నిదర్శనం సాగర్ డిఫెన్స్

టెక్స్‌టైల్, షిప్ బిల్డింగ్, డిఫెన్స్ వంటి రంగాల్లో కూడా భారీ అవకాశాలు ఉన్నాయి. మజగాన్ డాక్, గోవా షిప్ యార్డ్ వంటి సంస్థలు ఇక్కడ షిప్ బిల్డింగ్ కార్యకలాపాలను ప్రారంభిస్తున్నాయి. సాగర్ డిఫెన్స్ అనే ఆసక్తికరమైన సంస్థ ఉంది. వారు మారిటైమ్ డ్రోన్స్ తయారు చేస్తున్నారు. వారికి నీటికి అనుసంధానమైన స్థలం కావాలి. ఒక ఫిషింగ్ హార్బర్‌లో 150 మీటర్ల ప్రాంతాన్ని వారికి కేటాయించాం. వారు మా దగ్గరకు వచ్చినప్పుడు వారి విలువ దాదాపు రూ.3వేల కోట్లు. ఈరోజు ఆ సంస్థ విలువ రూ.23వేల కోట్లకు చేరుకుంది. ఇదంతా కేవలం 18 నెలల్లో జరిగింది. ఇదే మీ ప్రయాణంలో ప్రభుత్వం తీసుకురాగల మార్పు. ఇదే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిబద్ధత. మేము మీ ప్రయాణంలో సంధానకర్తగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం.

### అభివృద్ధి ప్రయాణానికి ఏపీ సంసిద్ధం

మీ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వామి కావడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉంది. ప్రస్తుతం మేము 23 క్లస్టర్లను నిర్మిస్తున్నాం. ఇవి హార్టికల్చర్ నుంచి క్వాంటం వరకు విస్తరించాయి. అగ్రికల్చర్, మెడికల్ డివైస్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫార్మా, ఆటోమోటివ్, సిమెంట్, సోలార్, ఇంగోట్, వాఫర్ మ్యానుఫ్యాక్చరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ వంటి రంగాల్లో క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం. ఒక్క ఏడాదిలోనే 4.8 గిగావాట్ల రెన్యువబుల్ సామర్థ్యాన్ని పెంచగలిగాం. 2019 నుంచి 2024 వరకు చూస్తే ఐదేళ్లలో కేవలం 6 మెగావాట్లు మాత్రమే పెరిగింది. ఐదేళ్లలో 6 మెగావాట్ల నుంచి ఒకే ఏడాదిలో 4.8 గిగావాట్ల సామర్థ్యానికి చేరుకున్నాం. అయితే దాంతో నేను సంతృప్తి చెందట్లేదు. మేం ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్నాం. ఏపీ నెం.1 కావాలి. అందుకోసం ప్రతిఏటా దాదాపు 20 గిగావాట్ల సామర్థ్యాన్ని జోడించాల్సి ఉంటుంది. ఇదే మేము నిర్మిస్తున్న క్లస్టర్ ఎకో సిస్టమ్. ఇలా మొత్తం 23 క్లస్టర్లు ఉన్నాయి. స్పేస్, డ్రోన్స్, గ్లాస్ ఎకో సిస్టమ్ వంటి రంగాల్లో కూడా క్లస్టర్లు నిర్మిస్తున్నాం.

### వర్టికల్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్‌కు ప్రాధాన్యత

మేం వర్టికల్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నాం. వర్టికల్ అంటే ఒక క్లస్టర్‌లోని మొత్తం కంపెనీలను ఒకే ఎకో సిస్టమ్‌లోకి తీసుకురావడం. మొబైల్ ఫోన్‌లో కెమెరా తయారు చేసే కంపెనీ నుంచి గ్లాస్, కేసింగ్, బ్యాటరీ, యాక్సెసరీస్ వరకు మొత్తం సరఫరా వ్యవస్థ ఒకే క్లస్టర్‌లో ఉండాలి. హారిజాంటల్‌లో నా మంత్రిత్వ శాఖ కీలక పాత్ర పోషిస్తుంది. అది కేవలం ఐటీ మాత్రమే కాదు. హెచ్ఆర్‌డీ కూడా నా దగ్గర ఉంది. హెచ్ఆర్‌డీ శాఖ ద్వారా పరిశ్రమలతో కలిసి పనిచేస్తూ... కరిక్యులమ్ చేంజెస్, టెస్టింగ్ ఎకో సిస్టమ్, రీసెర్చ్‌పై దృష్టి పెడుతున్నాం. ఐఐటీ తిరుపతి ద్వారా యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్‌వేల్స్‌తో కలిసి ర్యాపిడ్ ప్రోటోటైపింగ్ సెంటర్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని నేను కోరుతున్నాను. యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్‌వేల్స్ సౌరశక్తి రంగంలో దాదాపు 90శాతం పేటెంట్లకు సంబంధించి కీలక పాత్ర పోషించింది. ఐఐటీ తిరుపతిలో మొత్తం రీసెర్చ్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చేస్తున్నాం. ప్రైవేట్ రంగాన్ని, ఐఐటీ తిరుపతిని ఒకచోటికి తీసుకువచ్చి రీసెర్చ్‌పై దృష్టి పెడుతున్నాం. ఇలాంటి విధానాన్ని 23 క్లస్టర్లలోనూ అమలు చేస్తాం. అందుకే మీరు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవాలి. విద్యుత్ వినియోగం విషయంలో కూడా మాకు భారీ సవాళ్లు ఉన్నాయి. అన్ని కంపెనీలు వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించక ముందే మన విద్యుత్ వినియోగ వృద్ధి రేటు సంవత్సరానికి 30శాతానికి పైగా ఉంది. అందువల్ల గ్రిడ్‌ను నిర్వహించడం చాలా సవాలుగా మారుతోంది. అన్ని కంపెనీలు కమర్షియల్ ప్రొడక్షన్‌కు వెళ్లబోతున్నందున మేము మరింత కష్టపడి పనిచేయాలి. ఆంధ్రప్రదేశ్ తనదైన ప్రయాణంలో ముందుకు సాగుతోంది. ఈ ప్రయాణంలో ఐఐటీల నుంచి మార్గదర్శకత్వం పొందడం మాకు ఎంతో ఆనందంగా ఉంది.

### క్లస్టర్ల అభివృద్ధిలో మార్గదర్శకత్వం వహించండి

నాకు రెండు ప్రత్యేక అభ్యర్థనలు ఉన్నాయి. వాటిని ఇప్పటికే వేదికపై ఉన్న నాయకత్వంతో కూడా పంచుకున్నాను. మొదటిది- ప్రపంచాన్ని జయించిన మీ గ్రాడ్యుయేట్లు. విద్య నుంచి వ్యవసాయం, హార్టికల్చర్ నుంచి క్వాంటం వరకు అనేక రంగాల్లో వారు అద్భుతమైన విజయాలు సాధించారు. ఈ 23 క్లస్టర్ల కోసం వారితో కలిసి లోతైన, అర్థవంతమైన పరిజ్ఞానాన్ని, మార్గదర్శకత్వాన్ని పొందాలని కోరుకుంటున్నాను. మీ పరిచయాలను మరింత విస్తృతంగా ఉపయోగించండి. ముఖ్యమైన వ్యక్తుల సంప్రదింపు వివరాలను మాతో పంచుకోండి. నేను వ్యక్తిగతంగా కూడా వారిని సంప్రదించి 23 క్లస్టర్లు దిశానిర్దేశం చేసేలా కృషి చేస్తాను. రెండోది విజిబుల్ గవర్నెన్స్, ఇన్విజిబుల్ గవర్నమెంట్. ఏఐ యుగంలో ఎంతో చేయగలం. గత రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ ప్రయాణాన్ని చూస్తే, మొదట స్పీడ్‌ను మా మంత్రంగా తీసుకున్నాం. తర్వాత జుగాడ్ మోడల్‌కు వెళ్లాం. కానీ ఇప్పుడు ప్రతి అంశాన్నీ వ్యవస్థీకృతం చేయాలని నేను భావిస్తున్నాను. ప్రతి వ్యవస్థ కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకునేలా ఉండాలి. ఈ విషయంలో మీతో కలిసి పనిచేయాలని కోరుకుంటున్నాం. జుగాడ్ నుంచి ఇనిస్టిట్యూషన్ ఆఫ్ స్పీడ్ వైపు మన ప్రయాణాన్ని కొనసాగిద్దాం. భారతదేశాన్ని గర్వపడేలా చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం. ఇక్కడ మనం చేసే ప్రతి మంచి పనీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఐలాండ్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను నిర్మించగలిగితే, మిగతా భారతదేశం కూడా దాన్ని స్వీకరిస్తుందని నేను నమ్ముతున్నాను. అదే మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యం కూడా.

### కలిసి ప్రయాణిద్దాం... చరిత్ర సృష్టిద్దాం!

మనమంతా కలిసి చరిత్ర సృష్టిద్దాం. మన పనితీరును పునర్నిర్వచిద్దాం. నిజం చెప్పాలంటే, ఒక యువ భారతీయుడిగా నేను ఇతర దేశాల మోడల్ల గురించి మాట్లాడటం వల్ల విసిగి పోయాను. భారత్ చేయగలదని ప్రపంచానికి చూపించాలనుకుం టున్నాను. అందుకు ఒక మోడల్ ఇక్కడే ఉంది... అమరావతిలో, ఆంధ్రప్రదేశ్‌లో. నిన్న కొంతమంది ప్రముఖులతో నేను అమరావతిని సందర్శించాలని చెప్పాను. మీరు కూడా సమయం కేటాయించి అక్కడ జరుగుతున్న పనులను చూడండి. మీకు నిర్మాణంలో ఉన్న ఒక ఆధునిక నగరం కనిపిస్తుంది. భారతదేశం ఇంతకు ముందు చూడని ఒక నగరాన్ని నిర్మిస్తున్నాం. మనకు అత్యుత్తమ ప్లానర్లు, అత్యుత్తమ ఆర్కిటెక్టులు ఉన్నారు. మన అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు వంటి భవనాలను ప్రపంచ ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ నార్మన్ ఫాస్టర్ రూపొందిస్తున్నారు. వారి నుంచి నేర్చుకుంటూనే భారతీయ కంపెనీలతో భాగస్వామ్యం చేయిస్తున్నాం. దీంతో నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్ ఇక్కడే జరుగుతోంది. మన స్వంత ప్రమాణాలను, మన సొంత పరిశ్రమలను నిర్మించుకునేలా ఇది సహాయపడుతుంది. మీకు సమయం దొరికినప్పుడు అమరావతిని తప్పకుండా సందర్శించండి. ప్రతి 100 రోజులకు ఒకసారి మీరు అమరావతిలో జరుగుతున్న మార్పును చూడగలుగుతారు. జరుగుతున్న వేగం నిజంగా అద్భుతంగా ఉంది. మీ సీఆర్‌డీఏ కమిషనరు నిన్న నాకు ఒక మెసేజ్ పంపారు. "సార్, గత నెలలో మేము కొత్త రికార్డు సృష్టించాం" అని చెప్పారు. వచ్చే నెలలో ఆ రికార్డును కూడా అధిగమిద్దాం. ఇదే ఉత్సాహంతో మేమంతా పనిచేస్తున్నాం. భారతదేశం గర్వపడే స్థాయిలో ప్రమాణాలను ఏర్పాటు చేయాలనుకుంటున్నాం.

### అమరావతిలో 5వేల ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు

అభివృద్ధి ప్రయాణంలో ఎయిర్‌పోర్టులు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని మేము నమ్ముతున్నాం. అమరావతిలో మీరు చూడబోయేది 5వేల ఎకరాల్లో నిర్మించబోయే గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్ట్. హైదరాబాద్ అభివృద్ధిలో హైదరాబాద్ విమానాశ్రయం పోషించిన పాత్రలాగే ఇది కూడా అమరావతి అభివృద్ధిలో కీలకంగా ఉంటుంది. ప్రపంచ స్థాయి విమానాశ్రయాన్ని నిర్మించాలనుకుంటున్నాం. చంద్రబాబుని విజనరీ అని పిలవడానికి ఒక కారణం ఉంది. హైదరాబాద్ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నప్పుడు 5వేల ఎకరాలు ఎందుకు కావాలని ప్రజలు ప్రశ్నించారు. ఈరోజు హైదరాబాద్ విమానాశ్రయాన్ని సందర్శించినవారికి ఆయన అప్పట్లో తీసుకున్న నిర్ణయం ప్రాధాన్యత అర్థమవుతుంది. తెలంగాణ, హైదరాబాద్‌లకు ఆయన అందించిన ఆ దూరదృష్టి ఇదే. అదే తరహా మేజిక్‌ను విశాఖపట్నంలోని భోగాపురం విమానాశ్రయంలో కూడా మేము చేస్తున్నాం. ఇటీవల నిర్మితమవుతున్న అత్యంత అందమైన విమానాశ్రయాల్లో ఇది ఒకటి. అమరావతిలో అంతకంటే మెరుగైనదాన్ని నిర్మిస్తాం. మాకు మార్గదర్శకత్వం అందించండి. మేము నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. మమ్మల్ని మెరుగుపరుచుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. అమరావతిని ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కూడా మేము ముందుకు వెళ్తున్నాం. ఇప్పటికే ఇక్కడ 'బిట్స్' సహా ఆరు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. క్వాంటమ్ చుట్టూ కూడా మొత్తం ఎకో సిస్టమ్ నిర్మిస్తున్నాం. విద్య, పరిశోధన రంగాల్లో మనం చేస్తున్న పని చాలా ఆసక్తికరంగా ఉంది. ఇక్కడ ఉన్న భాగస్వాములందరితో మాట్లాడేందుకు నేను ఎదురుచూస్తున్నాను. వేదికపై ఉన్న ప్రతి ఆలోచనాపరుడి సహాయం నాకు అవసరం. వచ్చే దశాబ్దంలో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని సాధించడానికి మీ మార్గదర్శకత్వం అవసరమని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

చైతన్యరథం

## వైసీపీ 'డైవర్షన్'కు..

# టీడీపీ స్ట్రాంగ్ కౌంటర్!

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై విజయసాయిరెడ్డి చేసిన అనుచిత 'డైవర్షన్' వ్యాఖ్యలకు టీడీపీ ఘాటుగా బదులిచ్చింది. వైసీపీ హయాంలో ప్రాజెక్టుల టెండర్ల రద్దు, పరిమిత ఖర్చు, కృష్ణా జలాల వినియోగంపై తీసుకున్న నిర్ణయాలను ప్రస్తావిస్తూ.. సీమకు సాగునీటి భద్రత కల్పించడంలో ఎన్టీఆర్, చంద్రబాబు ప్రభుత్వాల పాత్రను వివరించింది. లోకేష్ యువగళం పాదయాత్రలోనే 'మిషన్ రాయలసీమ'కు, హార్టీకల్చర్ హబ్ ఆలోచనకు పునాది పడిందని స్పష్టం చేసింది.

"హార్టీ కల్చర్ హబ్" డైవర్షన్ కార్యక్రమమని విజయసాయిరెడ్డి తన ట్వీట్‌లో అబద్ధాలు చెప్పారు. తన పాత మిత్రుని అవలక్షణాల్ని చంద్రబాబుకు అంటకట్టే కుతంత్రం చేశారు.

- జలయజ్ఞాన్ని ధనయజ్ఞం చేసి ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదు.
- కృష్ణా మిగులు జలాల్లో హక్కు కోరబోమని బ్రిజేష్ ట్రిబ్యునల్‌కు లేఖ ఇచ్చి సీమ గొంతు కోశారు.
- 2019-24 మధ్య 102 సీమ సాగునీటి ప్రాజెక్టుల టెండర్లు రద్దు చేశారు.
- ఇసుక మాఫియాకు అన్నమయ్య డ్యాం గల్లంతు చేసి 39 ప్రాణాలు పోగొట్టారు.
- 2019-24 మధ్య సీమ ప్రాజెక్టులకు జగన్ ఖర్చు చేసింది రూ.2 వేల కోట్లు మాత్రమే. 2024-26 రెండేళ్లలోనే చంద్రబాబు సీమ ప్రాజెక్టులకు రూ.13 వేల కోట్లు ఖర్చు చేశారు.
- సీమలో వున్న రిజర్వాయర్లలో సింహభాగం నిర్మించింది ఎన్టీఆర్, చంద్రబాబే.
- 2000 సంవత్సరంలో చంద్రబాబు నాయుడు డ్రిప్ పెట్టడం వల్లే 14 లక్షల హెక్టార్లకు వరప్రసాదమైంది.
- 2022-23లో పోతిరెడ్డిపాడు ద్వారా జగన్ డ్రా చేసింది 49.7 టీయంసీలే.
- ఎలినొలో కూడా పోతిరెడ్డిపాడు ద్వారా బాబు డ్రా చేసింది 84 టీయంసీలు. పట్టిసీమ వల్లే ఇది సాధ్యమైంది.
- అనంతపూర్‌ను ఎడారి కాకుండా నివారించింది డ్రిప్, హంద్రీ-నీవా జలాలే... అవి బాబు, ఎన్టీఆర్ పుణ్యం కాదా?
- రాయలసీమలో మీ మిత్రులు రక్తం పారిస్తే... చంద్రబాబు సాగునీరు పారించారు.
- లోకేష్ యువగళం పాదయాత్ర ద్వారా మిషన్ రాయలసీమ నుంచి హార్టీకల్చర్ హబ్‌కు పునాది పడింది.
- జగన్ పాదయాత్రలో చూసిన భూములు కబ్జాకు గురయ్యాయి.

# వికసిత్ బందరు సాకారం నా లక్ష్యం

- మచిలీపట్నం పూర్వ వైభవానికి కృషి
- పర్యాటకం, పారిశ్రామికంగా అవకాశాలన్నీ సద్వినియోగం చేసుకుంటాం
- వార్డుల పర్యటనలో మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్యరథం): మచిలీపట్నానికి మంచి జరగాలనే సత్సంకల్పంతో అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని పలు వార్డుల్లో శనివారం మంత్రి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఎన్నో దశాబ్దాలుగా కోరుకుంటున్న బందరు పోర్టును త్వరలోనే పూర్తి చేసుకోబోతున్నామన్నారు. 1864లో వచ్చిన ఉప్పెన తర్వాత ఈ ప్రాంతం నిర్లక్ష్యానికి గురైంది. మచిలీపట్నం జనాభా 60వేలు ఉన్నప్పుడు విజయవాడ జనాభా కేవలం 5వేలు. గుంటూరు జనాభా 16 వేలు మాత్రమే. అలాంటి మహా నగరం తర్వాతి కాలంలో వెనుకబడిపోయింది. 2007లో బందరు పోర్టును గోగిలేరుకు తరలించాలని ప్రయత్నించారు. అప్పుడు మొదట సంతకం చేసిన వ్యక్తి పేర్ని నాని. బందరులో అసలు పోర్టే అవసరం లేదని సంతకాలు చేశారని మంత్రి రవీంద్ర గుర్తుచేశారు.

**పోరాటాలతో పోర్టు సాకారం**

ఎన్నో పోరాటాలు చేసి బందరు పోర్టును సాకారం చేసుకున్నాం. బందరుకి జరిగిన అన్యాయాన్ని సహించబోమని ఉద్యమించాం. కేంద్ర ప్రభుత్వం సైతం తలొగ్గే స్థాయిలో బందరులోని ప్రజలంతా ఏకమై పోరాటం చేశారు. అలాంటి సమయంలో అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న పేర్ని నాని మన ఉద్యమాన్ని కృత్రిమ ఉద్యమం అంటూ అవమానించారు. డబ్బులిచ్చి జనాల్ని తీసుకొచ్చారని అవహేళన చేశారు. చివరికి బందరు పోర్టు పూర్తి చేయకుంటే ముక్కు నేలకు రాస్తానని చెప్పారు. కానీ.. తర్వాత కనీసం పట్టించుకోలేదు. కానీ మేము బందరు పోర్టుకు 2018లో శంకుస్థాపన చేస్తే.. రైతుల్ని రెచ్చగొట్టి పోర్టు పనుల్ని అడ్డుకోవాలని ప్రయత్నించారు. తర్వాత అధికారంలోకి వచ్చాక బందరు పోర్టును గాలికి వదిలేసి.. ఎన్నికల ముందు డ్రామాలాడారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోర్టు పనుల్ని పరుగులు పెట్టించాం. బెర్తులన్నీ పూర్తయ్యాయి. మిగతా నిర్మాణ పనులన్నీ పూర్తి చేస్తున్నాం. డ్రెడ్జింగ్ పనులకు ఉన్న ఆటంకాలు కూడా తొలగించాం. మార్చి నెలలో బందరు పోర్టుకు ఓడలు తీసుకొస్తామని మంత్రి చెప్పారు.

**పరిశ్రమలు, పర్యాటకం..**

అదే సమయంలో బందరుకి మరిన్ని పరిశ్రమలు తీసుకురావాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. ఈ మధ్యనే గోవా షిప్ యార్డ్ సంస్థ బందరులో రూ.8000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైంది. రాష్ట్ర కేబినెట్ కూడా ఆమోదం తెలిపింది. ఈ పరిశ్రమ రావడంతో ఈ ప్రాంతంలో సుమారు 10 వేల మందికి ఉద్యోగాలు రాబోతున్నాయి. మరో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు కూడా రానున్నాయి. ఈ సంస్థలో ఉద్యోగస్తులుగా స్థానికులకే అవకాశాలిస్తాం. అందుకు అవసరమైన స్కిల్స్ యువతకు నేర్పిస్తాం. ఈ ప్రాంతంలో స్పెషల్ ఎకనమిక్ జోన్ ఏర్పాటు చేయబోతున్నాం. అదే జరిగితే వందలాది పరిశ్రమలు వస్తాయి. వేలాది ఉద్యోగాలొస్తాయి. పరిశ్రమలు పెట్టేందుకు ఎవరు వచ్చినా వారికి సానుకూల వాతావరణం కల్పిస్తున్నాం.

పరిశ్రమలతో పాటుగా పర్యాటక రంగాన్ని కూడా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మంగినపూడి తీరాన్ని అభివృద్ధి చేస్తున్నాం. బందరు పోర్టు వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలనే లక్ష్యంతో గతేడాది మసులా బీచ్ ఫెస్టివల్ నిర్వహించాం. ఆ ఫెస్టివల్ కేంద్ర ప్రభుత్వం కూడా గుర్తించింది. తర్వాత ఈ ఏడాది మహాగణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నాం. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న స్వదేశీ దర్శన్ పథకం ద్వారా మంగినపూడి తీరంలో రూ.100 కోట్లతో అభివృద్ధి చేయబోతున్నాం. టెంపుల్ టూరిజం కూడా అభివృద్ధి చేసే అవకాశం దక్కింది. కుల మతాలకు అతీతంగా మహాగణపతి ఉత్సవాలు నిర్వహించాం. భవిష్యత్తులో ఈ ప్రాంతానికి రిసార్టులు వస్తాయి. కొన్ని దేశాలు టూరిజంతోనే అభివృద్ధి చెందాయి. అదే స్ఫూర్తితో మంగినపూడిని అభివృద్ధి చేస్తాం. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కలిసికట్టుగా అమలు చేస్తున్నాం. మచిలీపట్నంలో హామ్ పథకం ద్వారా అభివృద్ధి పనులు చేస్తున్నాం. మనం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని కొంత మంది ప్రయత్నిస్తున్నారు. బందరు అభివృద్ధిని అడ్డుకోవాలని ప్రయత్నించడం ఎవరికీ సాధ్యం కాదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారం తీసుకుని ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలోనే అగ్రగామి నగరంగా తీర్చిదిద్దుతాను. ఈ కార్యక్రమంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలి. కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజా మద్దతు తోడైతే సాధించలేనిది ఏదీ లేదు. వికసిత్ బందరుగా అభివృద్ధి చేస్తున్నాం. ఆ మహాయజ్ఞంలో ప్రతి ఒక్కరూ చేయి కలపాలని మనస్ఫూర్తిగా కోరుతున్నానని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఉండండి

**శ్రీసిటీలో ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**

అమరావతి (చైతన్యరథం): తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ప్రైవేట్ పరిశ్రమలో వాటర్ బాయిలర్ పేలి నలుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాయిలర్ పేలిన సమయంలో ఘటనా స్థలంలోనే ఇద్దరు చనిపోయారని, మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని తెలిపారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తికి చికిత్స కొనసాగుతోందని అధికారులు వివరించారు. మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతి తెలిపి బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

## తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది

**మంత్రి నారా లోకేష్**

అమరావతి (చైతన్యరథం): శ్రీసిటీలోని ప్రైవేటు ఫ్యాక్టరీలో ప్రమాదం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బాయిలర్ పేలి కార్మికులు మృతి చెందడం, మరికొందరు గాయపడటం తీరని విషాదమన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని చెప్పారు.

### తీవ్రంగా గాయపడ్డ వారికి

## మెరుగైన వైద్యం అందించాలి

**టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**

అమరావతి (చైతన్యరథం): శ్రీసిటీలోని టిల్ హెల్త్‌కేర్ పరిశ్రమలో బాయిలర్ పేలి ఇద్దరు మృతి చెందడం, పలువురు గాయపడటం తనను తీవ్రంగా కలచివేసిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించి, వారు త్వరగా కోలుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. ప్రమాదానికి గల కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, బాధితులకు అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## గిరిజనుల సంక్షేమమే లక్ష్యం

- ఏ.కొండూరు మండలం పెద్దతండాలో కమ్యూనిటీ హాల్‌కు రూ.కోటి
- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడి



అమరావతి (చైతన్యరథం): గిరిజనుల మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత.. ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించామన్నారు. గిరిజనుల అవసరాలను గుర్తించి నిధులు మంజూరు దిశగా ప్రభుత్వం వేగవంతంగా చర్యలు తీసుకుంటోందన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు మండలం పెద్దతండాలో రూ.కోటితో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామన్నారు. రూ.50 లక్షలు డీఎంఎఫ్ నిధులు.. మరో రూ.50 లక్షలు రాష్ట్ర వాటా నుంచి సమకూర్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గిరిజనుల సమావేశాలు, సామాజిక కార్యక్రమాలకు ఆధునిక సౌకర్యాలతో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామన్నారు. గిరిజన సంక్షేమంపై మాటల్లో కాదు.. మౌలిక వసతుల కల్పనలో కార్యాచరణతో ముందుకు వెళుతున్నామన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు.

# స్థానిక ఎన్నికల్లో కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ప్రజా సంక్షేమమే మన బలం.. సమష్టి కృషితోనే విజయం
- ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి
- కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి నాయకుడూ బాధ్యత తీసుకోవాలి
- పరస్పర గౌరవం, సమన్వయంతో ముందుకు సాగాలి
- ప్రజలతో మమేకమై స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి
- కోనసీమ జిల్లా కూటమి ఎమ్మెల్యేలు, ప్రధాన నాయకులతో సమావేశంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- కొందరు మండల పార్టీ అధ్యక్షుల పనితీరుపై మంత్రి ఆగ్రహం
- పద్ధతి మార్చుకుని బాధ్యతగా పనిచేయాలని హెచ్చరిక



విజయవాడ (చైతన్యరథం): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కూటమి పార్టీల నాయకులు సమష్టిగా పనిచేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. కూటమిప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి, వారి విశ్వాసాన్ని పొందాలని సూచించారు. విజయవాడలోని తన కార్యాలయంలో శనివారం డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ప్రధాన నాయకులతో మంత్రి సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత, కూటమి పార్టీల మధ్య సమన్వయం, ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరువ చేయాల్సిన అవసరంపై ఈసందర్భంగా నాయకులకు దిశానిర్దేశం చేశారు. కూటమి పార్టీల ఐక్యతను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసుకోవాలన్నారు. ఎన్నికల విజయానికి ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త కృషి అవసరమని, అందరినీ కలుపుకొని ముందుకు సాగాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలు, ప్రధాన నాయకులపై ఉందని పేర్కొన్నారు. పరస్పర గౌరవంతో వ్యవహరిస్తూ, ఒకరి అభిప్రాయాలను మరొకరు పరిగణనలోకి తీసుకుంటూ పనిచేయాలని సూచించారు. నాయకత్వ స్థాయిలో ఉన్న సమన్వయం గ్రామాలు, పట్టణాల స్థాయి వరకు ప్రతిబింబించినప్పుడే సమష్టి కృషికి ఆశించిన ఫలితం లభిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏ పథకాన్ని ఎందుకు అమలు చేస్తోంది, దాని ద్వారా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలుగుతోంది అనే అంశాలను స్పష్టంగా వివరించాలని సూచించారు.పథకాల పేర్లను చెప్పడంతోపాటు వాటి ఉద్దేశం, అర్హులకు అందే సహాయం, ప్రజల జీవితాల్లో వాటి ప్రాధాన్యాన్ని సులభంగా అర్థమయ్యేలా తెలియజేయాలన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రజల ముందుంచే ప్రతి సందర్భంలోనూ వాస్తవాలు, అందుబాటులో ఉన్న వివరాల ఆధారంగా మాట్లాడాలని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

### అందరూ బాధ్యత తీసుకోవాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే కూటమి అభ్యర్థుల విజయానికి అందరూ బాధ్యత తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. కూటమి తరఫున బరిలో నిలిచే ప్రతి అభ్యర్థి విజయాన్ని ఉమ్మడి లక్ష్యంగా భావించి సహకరించాలని కోరారు. పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేసుకుంటూ ఎన్నికల ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. ఎక్కడైనా సమన్వయానికి సంబంధించిన అంశాలు ఎదురైతే పరస్పరం చర్చించుకుని పరిష్కరించుకోవాలని, అందరి కృషిని సమన్వయపరిచే బాధ్యతను స్థానిక నాయకత్వం తీసుకోవాలన్నారు. ప్రజలకు అత్యంత దగ్గరగా ఉండే స్థానిక సంస్థలు బలంగా పనిచేస్తే గ్రామాలు, పట్టణాల అభివృద్ధి వేగవంతమవుతుందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, మురుగునీటి పారుదల, వీధిదీపాలు వంటి నిత్యజీవిత అవసరాల విషయంలో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి అవసరాలపై స్పందించే నాయకత్వం ప్రాధాన్యాన్ని వివరించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి లక్ష్యాలను స్థానిక స్థాయిలో ముందుకు తీసుకెళ్లేందుకు సమర్థమైన ప్రజాప్రతినిధులు అవసరమని తెలిపారు.

### సమష్టి బాధ్యతతో సిద్ధం కావాలి

ఈ సందర్భంగా కొందరు మండల పార్టీ అధ్యక్షుల పనితీరుపై అచ్చెన్నాయుడు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను ఆశించిన స్థాయిలో నిర్వర్తించడం లేదని పేర్కొంటూ, తక్షణమే తమ పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బాధ్యతల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు. మండల పార్టీ అధ్యక్షులు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలంగా పాల్గొనాలని, తమ పనితీరులో స్పష్టమైన మార్పు చూపించాలని ఆదేశించారు. కోనసీమ జిల్లాలో కూటమి పార్టీల నాయకులు ఒకే లక్ష్యంతో, సమష్టి బాధ్యతతో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని అచ్చెన్నాయుడు కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడం, స్థానిక అవసరాలను గుర్తించడం, కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయడం ప్రతి నాయకుడి కార్యాచరణలో ప్రధానాంశాలుగా ఉండాలని సూచించారు. ప్రజా సంక్షేమాన్ని ముందుంచి, అభివృద్ధి లక్ష్యాలను వివరిస్తూ, ప్రజల విశ్వాసంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో ఎంపీ సానా సతీష్, ముమ్మడివరం, కొత్తపేట, అమలాపురం, ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, బండారు సత్యానందరావు, అయితాబత్తుల ఆనందరావు, బీజేపీ జిల్లా ప్రెసిడెంట్ సత్యన్నారాయణ, టీడీపీ జిల్లా ప్రెసిడెంట్ సాయి, జిల్లా సెక్రటరీ పల్లం రాజు, రాజోలు టీడీపీ ఇంఛార్జి అమూల్య, గన్నవరం టీడీపీ ఇన్చార్జ్ ఆనంద సాగర్, బీజేపీ నేత చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలోనే పల్లెల్లో ప్రగతి

- రూ.330 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు
- బందరు గత వైభవాన్ని పునరుద్ధరించేలా పర్యాటక అభివృద్ధి
- మంత్రి కొల్లు రవీంద్ర ఉద్ఘాటన
- మచిలీపట్నం రూరల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మచిలీపట్నం (చైతన్యరథం): మచిలీపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధికి కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా నిత్యం కృషి చేస్తున్నానని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం రూరల్ మండలంలో శనివారం పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. వాడపాలెంలో రూ. 1.56 కోట్ల వ్యయంతో కమ్మవారి చెరువు నుండి వెంకట దుర్గాంబపురం వరకు 2.37కి.మీ రోడ్డు, నెలకుర్రు గ్రామంలో నెలకుర్రు నుండి మాజేరు వరకు రూ.65 లక్షల వ్యయంతో 1.76కి.మీ రోడ్డు, నెలకుర్రు నుండి పెదయాదర వరకు రూ. 1.60కోట్ల వ్యయంతో 1.80 కి.మీ బీటీ రోడ్డు, చిన్నాపురం గ్రామంలో చిన్నాపురం నుండి జిలగల దిండి వరకు రూ. 1.16కోట్ల వ్యయంతో 1.30కి.మీ రోడ్డు, బోగిరెడ్డిపల్లె నుండి పిల్లన్న సాగర్ వరకు రూ.48 లక్షల వ్యయంతో 870 మీటర్ల బీటీ రోడ్డు, రుద్రవరం గ్రామంలో ఆర్ గొల్లపాలెం నుండి రుద్రవరం వరకు రూ.61 లక్షల వ్యయంతో 1.09 కి.మీ బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు.

అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. మచిలీపట్నం నియోజకవర్గం ప్రగతి పథంలో ముందుకు వెళ్తోందన్నారు. అభివృద్ధి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మచిలీపట్నంలో తాగునీరు, సాగునీరు, డ్రైనేజీలు, కాలువలు, రోడ్ల అభివృద్ధి చేస్తున్నాం. ప్రాధాన్యతా క్రమంలో పనుల్ని పూర్తి చేసుకుంటున్నాం. మచిలీపట్నం రూరల్ మండలంలో రూ.330 కోట్ల నిధులు తీసుకొచ్చాం. రూ.164 కోట్ల వీబీ జీ రాం జీ నిధులు, సాస్కీ నిధులు, రూ.54 కోట్ల ఆర్ అండ్ బీ నిధులతో రోడ్లు నిర్మిస్తున్నాం. రూరల్ వాటర్ సప్లై పథకం ద్వారా తొలి దశలో రూ.80 కోట్లు తీసుకొచ్చాం. జల్ జీవన్ మిషన్ ద్వారా మరో రూ.10 కోట్ల వ్యయంతో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా కృషి చేస్తున్నాం. ప్రణాళికాబద్ధంగా గ్రామీణ ప్రాంతాల్లో రూ.330 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

### గ్రామీణ ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణాలు

అంగన్‌వాడీ భవనాలు,గ్రామీణ ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణాలు కూడా చేపడుతున్నాం. పెద్దపట్నం వెళ్లే దారిలో దశాబ్దాలుగా ప్రజలు కోరుకుంటున్న బ్రిడ్జి నిర్మాణాన్ని రూ. 20కోట్లతో ప్రారంభించాం. పోలాటి తిప్ప-గరాలదిబ్బ మధ్య రూ. 15కోట్ల వ్యయంతో గుండేరు,నడిమేరు మీద రెండు వంతెనలు నిర్మిస్తున్నాం. చిన్నాపురంలో రోడ్డు సదుపాయం కల్పించే లక్ష్యంతో రూ. 1.18కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రజలకు మేలు జరిగే అభివృద్ధి పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని మంత్రి తెలిపారు.

### త్వరలో బందరు పోర్టు ప్రారంభం

దశాబ్దాల బందరు ప్రజల కల అయినటువంటి బందరు పోర్టును త్వరలో ప్రారంభించుకోబోతున్నాం. ఈ ప్రాంతంలోని ప్రజలకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించేలా గోవా షిప్ యార్డు రూ.8000 కోట్లతో ఏర్పాటుకాబోంతోంది. వేలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో మరిన్ని పరిశ్రమలు కూడా ఈ ప్రాంతంలో ఏర్పాటు కానున్నాయి. పర్యాటకంగా కూడా ఈ ప్రాంతం అభివృద్ధికి అనేక అవకాశాలున్నాయి. మన సముద్ర తీరాన్ని ప్రపంచానికి తెలియజేసే లక్ష్యంతో గతంలో మసులా బీచ్ ఫెస్టివల్, తాజాగా 63అడుగుల గణపతి విగ్రహంఏర్పాటు చేసుకున్నాం. సముద్ర తీరంలో 750ఎకరాలను గుర్తించాం.ఫలితంగా గోల్ఫ్ సంస్థ,స్టూడియో ఏర్పాటుకు ఓసంస్థ వచ్చింది.బందరులో పర్యాటకాన్ని అభివృద్ధిచేయడం ద్వారా బందరు గత వైభవాన్నిపునరుద్దరిస్తానని మంత్రి ఉద్ఘాటించారు.

ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో మాటలు తప్ప అభివృద్ధి లేదు.కానీ కూటమి ప్రభుత్వాన్ని ఈ నియోజకవర్గంలో 50వేల ఓట్ల మెజార్టీతో గెలిపించినందుకు వారి అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నాం. యువతకు ఈ ప్రాంతలో ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా.. ఇక్కడి యువతను పారిశ్రామిక వేత్తలుగా మార్చాలనే లక్ష్యంతో పని చేస్తున్నాను. మరీ ముఖ్యంగా మహిళలను పారిశ్రామిక వేత్తలుగారాణించాలని ప్రయత్నిస్తున్నాం. ఇక్కడి మహిళలు, ఇక్కడి యువతను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

పట్టిసీమ ద్వారా తీసుకొచ్చిన నీటి కారణంగా కృష్ణా డెల్టా మొత్తం సస్యశ్యామలం అవుతోంది. ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోంది. ఇప్పటికే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రకాశం జిల్లాను సస్యశ్యామలం చేశాం. అనకాపల్లి జిల్లాకు పోలవరం ఎడమకాలువ ద్వారా సాగు నీరు అందిస్తే ఆప్రాంత ప్రజలంతా పండుగ చేసుకుంటున్నారు.రెండేళ్లలో రూ.330కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. రెండు దశాబ్దాల పోరాటం తర్వాత బందరు పోర్టు పూర్తవుతోంది.

బందరు పోర్టు నుండి హైదరాబాద్‌కు 12 లైన్ల రోడ్డు సదుపాయం కావాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోంది. ఆ రోడ్డు వస్తే హైదరాబాద్‌కు ప్రయాణం అంత్యంత సులభతరం అవుతుంది. బందరు-రేపల్లె మధ్య రైల్వే లైను త్వరలో పూర్తి కాబోంతోంది. ప్రజల కోసం రాష్ట్రం కోసం ఆలోచించే ప్రభుత్వం కాబట్టే అభివృద్ధిపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం. 216 నేషనల్ హైవేను పూర్తిచేసి రవాణా సదుపాయాలు పెంచాలని కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి చెప్పారు. గతంలో ఎన్నడూలేని విధంగా అందరికీ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నాం.కొత్తగా ఇళ్ల నిర్మాణాలు, పెన్షన్లు వంటివి అమలు చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లముందు ఎక్కడా మురుగునిలవడానికి వీల్లే కుండా డ్రైనేజీలు నిర్మిస్తున్నాం. పీహెచ్సీలు నిర్మిస్తున్నామని మంత్రి రవీంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పంతం గజేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యన్నారాయణ, రూరల్‌పార్టీ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# వైసీపీ నేత దౌర్జన్యం.. భూకబ్జా

- పూర్వీకుల భూమిపై కబ్జాదారుల కన్ను
- హద్దులు చెరిపేస్తూ 5 ఎకరాల భూమి ఆక్రమణ యత్నం
- చీటీల పేరుతో మోసం.. డబ్బులు అడిగితే చంపేస్తామని బెదిరింపులు
- న్యాయం కోసం టీడీపీ కేంద్ర కార్యాలయంలో బాధితుల వినతులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్, ఏపీ కల్చరల్ కమిషన్ చైర్ పర్సన్ పొడపాటి తేజస్వి



అమరావతి (చైతన్యరథం): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి పలు సమస్యలపై ప్రజలు తరలివచ్చారు. బాధితుల నుంచి కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఏపీ కల్చరల్ కమిషన్ చైర్ పర్సన్ పొడపాటి తేజస్వి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలం అలిమిలి గ్రామానికి చెందిన వెంకటరత్నం అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. తమ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 83/1, విస్తీర్ణం 0.14 ఎకరాల భూమి ఉందన్నారు. తమ తండ్రి దివంగత పెద రమణయ్య పేరున రజక వృత్తి నిమిత్తం ప్రభుత్వం గతంలో కేటాయించిన "చాకలి మాన్యపు" భూమిని ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేసుకుంటూ జీవిస్తున్నాం. ఈ భూమి వైసీపీ నేత యారమాపు మధుసూదనరెడ్డి, కట్టా సుబ్బమ్మ పొలాల మధ్యలో ఉంది. ఇటీవల సుబ్బమ్మ మరణించడంతో, ఆ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని యారమాపు మధుసూదనరెడ్డి తమ 14 సెంట్ల భూమిని కూడా దౌర్జన్యంగా ఆక్రమించి తన పొలంలో కలిపేసుకున్నారు. తన భూమి ఆక్రమణపై ప్రశ్నించినందుకు మధుసూదనరెడ్డి బూతులు తిడుతూ, "నీకు దిక్కున్న చోట చెప్పుకో" అంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అధికారుల చుట్టూ తిరిగినా ఇంతవరకు ఎలాంటి పరిష్కారం దక్కలేదు.

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం బండిపాలెం గ్రామానికి చెందిన బండి లక్ష్మి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తమకు 1.32 ఎకరాలు వ్యవసాయ భూమి ఉందన్నారు. తమ దివంగత మామ బండి వెంకటయ్య కాలం నుంచి తాము అనుభవిస్తున్న 1.30 ఎకరాల పొలాన్ని కొందరు వ్యక్తులు అక్రమంగా, దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. తమ పొలాన్ని తమకు వదిలేయాలని న్యాయబద్ధంగా ప్రశ్నించినందుకు సదరు వ్యక్తులు తమపై దాడులు చేసి, తీవ్రంగా కొట్టారు. అంతేకాకుండా పోలీసులకు గానీ, అధికారులకు గానీ ఫిర్యాదు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని నిత్యం భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం తుంగపాడు గ్రామానికి చెట్టెమ్మ విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తమకు పూర్వీకుల నాటి నుంచి అనుభవంలో ఉన్న 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉందన్నారు. తమ 5 ఎకరాల పొలానికి సంబంధించిన హద్దులను తగ్గిస్తూ, పక్క పొలం యజమానులు దౌర్జన్యంగా భూమిలోకి చొచ్చుకు వస్తున్నారు. సరైన అధికారిక పత్రాలు లేక పోయినా, పాత రిఫరెన్స్ నంబర్లు మార్చుతూ తమ పొలాన్ని క్రమంగా తగ్గించే కుట్ర చేస్తున్నారు. సర్వే రిపోర్ట్ ఇవ్వమని కోరినా స్థానిక వీఆర్వో, తహసీల్దార్ అధికారులు పట్టించుకోవడం లేదు. పోలీసుల వద్దకు వెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలేదు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన సత్తిబాబు విజ్ఞప్తి చేస్తూ.. 2024 ఏప్రిల్ నెలలో గ్రామానికి చెందిన తల్లీకొడుకులు ఇద్దరు.. తమ ఇంటికి వచ్చి, తమకు చీటీలు వేసుకునేందుకు ప్రభుత్వ అనుమతి ఉంది.. తమ దగ్గర చీటీలు వేయమని నమ్మబలికారన్నారు. రూ. 5,00,000 చీటీ (నెలకు రూ. 25,000 చొప్పున 20 నెలల ప్రారంభిస్తున్నామని చెప్పారు. అంత పెద్దమొత్తం తాను ఒక్కడినే కట్టలేనని చెప్పగా, కువైట్‌లో ఉంటున్న తమ వదిన కాకరపర్తి సత్యవేణితో ఫోన్‌లో మాట్లాడించి ఒప్పించి, ఇద్దరి పేర్ల మీద జాయింట్‌గా చీటీ వేయించారు. మే 2024 నుంచి క్రమం తప్పకుండా 16 వాయిదాల వరకు ఫోన్‌పే, నగదు రూపంలో వాయిదాలు చెల్లించాం. సెప్టెంబర్ 2025లో 17వ వాయిదాలో రూ.3,50,000 లకు చీటీ పాడుకున్నాం. అయితే ఆ సొమ్ము ఇవ్వకుండా నిర్వాహకులు నెలల తరబడి తిప్పుకున్నారు. డిసెంబర్ 2025లో కువైట్ నుంచి తమ వదిన సత్యవేణి స్వగ్రామానికి వచ్చిన తర్వాత వారి చుట్టూ తిరగగా, ఎట్టకేలకు 06-03-2026న రూ. 1,00,000 మాత్రమే ఫోన్‌పే ద్వారా చెల్లించి, మిగిలిన రూ. 2,50,000 ఇవ్వకుండా తాత్సారం చేశారు. మిగిలిన బాకీ సొమ్ము కోసం గట్టిగా నిలదీయగా, "మీకు దిక్కున్న చోట చెప్పుకోండి... ఎక్కువ మాట్లాడితే చంపేస్తాం" అంటూ దుర్భాషలాడి తీవ్ర ప్రాణహాని బెదిరింపులకు దిగారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

మార్కాపురం జిల్లా కనిగిరి మండలం జమ్ములమడక గ్రామానికి చెందిన మితికల గురవమ్మ విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో 2005వ సంవత్సరంలో ప్రభుత్వం జీవనోపాధి నిమిత్తం తమకు సర్వే నంబర్ 313/3లో 2.30 ఎకరాల భూమిని మంజూరు చేసిందన్నారు. సదరు భూమిని ఒక వ్యక్తి అక్రమంగా, దౌర్జన్యంగా కబ్జా చేసి అతడి ఆధీనంలో ఉంచుకున్నాడు. పేదరాలైన తనకు జీవనాధారమైన భూమిని లాక్కోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం పెద ఓగిరాల గ్రామానికి చెందిన షేక్ రఫీ, షేక్ మాబుసుభాని విజ్ఞప్తి చేస్తూ.. తమ ముత్తాత షేక్ గాలీబ్ సాహెబ్ స్వార్జితంగా సంపాదించిన వెదురుపావులూరు గ్రామంలోని సర్వే నెం. 76/1 లో గల సుమారు 3 ఎకరాల పల్లం భూమి వారసత్వంగా తమ అమ్మమ్మ అమీనా స్వాధీనంలో ఉండేదన్నారు. ఆ భూమిని తమ బంధువు ఒకరు కౌలుకు తీసుకొని, నకిలీ ఒప్పంద పత్రాలు సృష్టించి ఎటువంటి కౌలు చెల్లించకపోగా భూమి కబ్జా చేశాడు. అధికారులను తప్పుదోవ పట్టించి అడంగల్, ఆర్.ఓ.ఆర్ రికార్డులలో ఈ భూమిని అతడి భార్య పేరుపై అక్రమంగా నమోదు చేయించుకున్నాడు. తమ న్యాయమైన భూమిని తమకు ఇవ్వాలని కోరినందుకు తమ కుటుంబంపై పలుమార్లు భౌతిక దాడులుచేసి తీవ్రంగా వేధించారు. తాము పొలంలోకి అడుగుపెట్టకుండా అడ్డుకుంటూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వైఎస్ఆర్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం రేపల్లి గ్రామానికి చెందిన గజ్జల కాంతమ్మ విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం 277లో 16 సెంట్లు, సర్వే నెం 144లో 50 సెంట్లు, సర్వే నెం142లో 0.50 సెంట్ల భూమి తమ పూర్వీకులు, తండ్రి కాలం నుంచి అనేక సంవత్సరాలుగా తమ అనుభవంలో ఉందన్నారు. తమకు తెలియకుండా, ఎటువంటి సంతకాలు లేకుండానే కొందరు వ్యక్తులు రికార్డులను అక్రమంగా మార్చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న భూములకు సంబంధించి తప్పుడు పత్రాలు, నకిలీ రికార్డులు సృష్టించి మోసగించారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తిరుపతి జిల్లా దక్కిలి మండలం చాకలపల్లి గ్రామానికి చెందిన గెరిటి నారాయణ యాదవ్ విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నంబర్: 70 పీలో 21 ఎకరాల భూమి ఉందన్నారు. గతంలో ఈ సర్వే నంబర్ లోని భూమికి సంబంధించి గెరిటి పెంచలయ్య యాదవ్, సద్దుకూటి రమణయ్యల పేర్లతో ప్రభుత్వం జాయింట్ పట్టా మంజూరు చేసింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ప్రభుత్వ అధికారిక డైగ్లాట్ రికార్డులలో స్పష్టంగా నమోదై ఉన్నాయి. డైగ్లాట్ రికార్డులను ఆధారంగా చూపిస్తున్నప్పటికీ మండల రెవెన్యూ అధికారులు వాటిని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. పట్టాదారు పాస్ పుస్తకం జారీ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. ప్రస్తుతం ఈ భూమిని కొందరు ఆక్రమణదారులు దౌర్జన్యంగా తమ ఆధీనంలోకి తీసుకుని సాగు చేసుకుంటున్నారు. మండల స్థాయి రెవెన్యూ సిబ్బంది కొందరు ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతూ అన్యాయం చేస్తున్నారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్య పరిష్కరించాలని కోరారు.

పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన కొండా లక్ష్మమ్మ విజ్ఞప్తి చేస్తూ.. దుర్గి మండలం ఆత్మకూరు గ్రామం పరిధిలోని సర్వే నంబర్ 492/1 ఏలో 1.12 ఎకరాల విస్తీర్ణంలో భూమి ఉందన్నారు. తన అమాయకత్వాన్ని, వృద్ధాప్యాన్ని ఆసరాగా చేసుకుని ఒక వ్యక్తి తన భూమిని మోసపూరితంగా 1బీ/అడంగల్‌లో అతడి పేరు మీద నమోదు చేయించుకున్నారు. దీనిని సరిచేసి తనకు న్యాయం చేయాలని కోరారు.

ఏలూరు జిల్లా ముసునూరు మండల చెక్కపల్లి గ్రామానికి చెందిన నక్క వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేస్తూ.. తమ కుటుంబానికి చెందిన దివంగత నక్క వెంకమ్మ పేరిట రాయుడుపాలెం రెవెన్యూ పరిధిలో సుమారు 1.84ఎకరాల భూమి ఉందన్నారు. అయితే, స్థానికంగా ఉన్న కొందరు వ్యక్తులు తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. తగు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

## శ్రీసిటీ బాయిలర్ పేలుడు ఘటనలో...

# బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం

- ఒక్కొక్కరికీ రూ.50 లక్షల పరిహారం
- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

అమరావతి (చైతన్యరథం): తిరుపతి జిల్లా శ్రీసిటీ సెజ్ పరిధిలోని 'టాబ్లెట్ ఇండియా లిమిటెడ్ హెల్త్ కేర్ పరిశ్రమలో జరిగిన బాయిలర్ పేలుడు దుర్ఘటన పై రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల్లో కంపెనీ ఉద్యోగులు వాసు(38), చెన్నైకి చెందిన చిన్నమస్తాన్ (38), పశ్చిమ బెంగాల్‌కు చెందిన గౌరవ్ రే(36)లతో పాటు సమీపంలో పనిచేస్తున్న కూలీలు మోహన్ (19), తమిళనాడుకు చెందిన రమేష్(45) ఉన్నారని వివరించారు. అక్టోబర్ 2వ తేదీ సెలవు దినం కావడంతో పరిశ్రమ మూసి వేశారని, శనివారం ఉదయం 6:30గంటల సమ యంలో సెకండ్ క్లాస్‌క్వాలిఫైడ్ బాయిలర్ అటెండెం ట్ ద్వారా బాయిలర్‌ను లైట్-అప్ చేశారని పేర్కొ న్నారు. అనంతరం ఉదయం 8:30 గంటల ప్రాంతం లో ఒక్కసారిగా బాయిలర్ పేలిపోయిందని, ఈ ఘట నలో సదరు అటెండెంట్ కూడా తీవ్ర గాయాలపాలవ డంతో అతని పరిస్థితి తీవ్ర విషమంగా ఉందని.. ప్రస్తుతం అతను చికిత్స పొందుతున్నారని తెలిపారు.

ప్రాథమిక దర్యాప్తు వివరాలను పరిశీలిస్తే, బాయిలర్‌లో నీరు సరిపడా లేకపోవడమే ఈ భారీ పేలుడుకు ప్రధాన కారణమని అధికారులు అంచనా కు వచ్చారని మంత్రి వెల్లడించారు. ఈ పరిశ్రమలో ఏప్రిల్ 7వ తేదీన సేఫ్టీ ఆడిట్ జరిగిందని, అన్ని ప్రమాణాలు సక్రమంగా ఉన్నాయని సర్టిఫై చేసినప్ప టికీ, ఆపరేషన్ సమయంలో నీటి కొరత వల్లనే ఈ తీవ్ర ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోందన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తున్నామని, విధు ల్లో నిర్లక్ష్యం వహించిన బాయిలర్ ఇన్‌స్పెక్టర్లతోపాటు బాధ్యులైన ప్రతి ఒక్కరిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురి కుటుంబాల కు ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికీ రూ. 50లక్షల చొప్పున తక్షణ ఎక్స్‌గ్రేషియా అందజేస్తున్నామని మంత్రి ప్రకటించారు. అంత్యక్రియల తక్షణ ఖర్చుల



నిమిత్తం వెనువెంటనే రూ.1 లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. బాధితులను అన్ని విధాలా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, తాను స్వయంగా బాధితుల వద్దకు వెళ్లి పరామర్శించి, ప్రభుత్వ భరోసాను అందిస్తానని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలియజేశారు.

# డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి




- విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి
- మహిళల భద్రత, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి
- బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పిలుపు

పెనుకొండ (చైతన్యరథం): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత పిలుపునిచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం, విక్రయాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం సమీపంలో ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సొంత నిధులతో నిర్మించిన పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను మంత్రి సవిత శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆపరేషన్ త్రిశూల్-అవేర్‌నెస్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు హాజరయ్యారు.

డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి నిర్మూలించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువు, క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. యువతకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటోందని, స్థానికంగా పరిశ్రమలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులు తమను తాము తీర్చిదిద్దుకోవాలని అన్నారు.

### మహిళల రక్షణ బాధ్యత అందరిదీ

మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి సవిత అన్నారు. మహిళలను గౌరవించాలని, వారి రక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగాన్ని పరిమితం చేసుకోవాలని మంత్రి అన్నారు. అవసరమైన సందర్భాల్లో మాత్రమే ఫోన్లను ఉపయోగిస్తూ చదువు, క్రీడలు, క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 'జీరో డ్రగ్స్, మహిళలకు భద్రత, రోడ్డు భద్రత' లక్ష్యంగా ప్రజలు, యువత కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.



# కళాకారుల సంక్షేమం, సంస్కృతి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

- మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి
- రాజమహేంద్రవరంలో ఘనంగా 'నాట్యార్పణ' కూచిపూడి నృత్య ప్రదర్శన
- ముఖ్య అతిథిగా హాజరై తిలకించిన మంత్రి దుర్గేష్
- రాబోయే గోదావరి పుష్కరాల్లో కూచిపూడి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తామని స్పష్టీకరణ



రాజమహేంద్రవరం (చైతన్యరథం): రాష్ట్రంలో కూచిపూడి నృత్య కళాభివృద్ధికి, సంప్రదాయ కళల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో శనివారం జరిగిన 'నాట్యార్పణ' కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గురువు అజయ్ శ్రీనివాస్ చక్రవర్తి ఆధ్వర్యంలో కుమారి అపర్ణ క్రొవ్విడి ప్రదర్శించిన కూచిపూడి నాట్యరీతిని మంత్రి దుర్గేష్ తిలకించి, నృత్యకారిణిని మరియు గురువులను ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ...దేశంలో అనేక నృత్య రీతులున్నప్పటికీ, ఒక గ్రామం పేరుతో ప్రసిద్ధి చెంది ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతికెక్కిన ఘనత ఒక్క కూచిపూడికే దక్కిందని కొనియాడారు. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలోనూ మొదట కూచిపూడి నృత్య ప్రదర్శన ఉండేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని మన కళలకు మరింత వైభవం తెస్తామని, 12 రోజుల పాటు జరిగే ఈ మహా ఉత్సవాల్లో కూచిపూడి ప్రదర్శనలకు ప్రత్యేక అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. సృజనాత్మక, సాంస్కృతిక సమితి, నాటక, సాహిత్య,జానపద అకాడమీల ద్వారా అంతరించిపోతున్న జానపద కళలను కాపాడుతామన్నారు. కళాకారులందరి డేటా బ్యాంక్ ఏర్పాటు చేసి, వారికి ప్రత్యేకంగా గుర్తింపుకార్డులు అందజేస్తామని చెప్పారు. కళాకారుల పెన్షన్‌ను సాధారణ పెన్షన్లతో కాకుండా వారి సేవలను గౌరవించే విధంగా ప్రత్యేక విధానంలో అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల ఉగాది వేడుకల సందర్భంగా కళారత్న అవార్డు గ్రహీత కోరిక మేరకు నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయడాన్ని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం కళలను, కళాకారులను అత్యంత గౌరవిస్తోందని, ఉగాది కళారత్న పురస్కారాలతో పాటు గురజాడ, కందుకూరి, బోయి భీమన్న, గుర్రం జాషువా, గిడుగు రామ్మూర్తి తదితర మహానుభావుల పేరిట పురస్కారాలు అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్ తరాలకు వారి చరిత్ర తెలిసేలా వారి జయంతులను అధికారిక రాష్ట్ర పండుగలుగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నృత్యకారిణి అపర్ణ క్రొవ్విడి ప్రదర్శించిన నాట్యంలో ఆంగికం, వాచికం, ఆహార్యం, అభినయం అద్భుతంగా కలబోశాయని మంత్రి ప్రశంసించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో, ముఖ్యంగా రాజమహేంద్రవరంలో భామాకలాపం, నవ జనార్ధన పారిజాతం వంటి ప్రదర్శనలతో ఆమె విశేష కీర్తిని సంపాదించారని కొనియాడారు. రాజమహేంద్రవరంలో కళను ప్రదర్శిస్తేనే దానికి పరిపూర్ణత వస్తుందని అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో అపర్ణ ప్రదర్శనలకు ప్రభుత్వం తరఫున పూర్తి ప్రోత్సాహం అందిస్తామని హామీనిచ్చారు.

ఈ కార్యక్రమంలో భాగంగా నాట్య గురువులను మంత్రి దుర్గేష్ ఘనంగా సత్కరించి, నృత్యకారిణి అపర్ణకు జ్ఞాపికను ప్రదానం చేశారు.

చైతన్యరథం

## దివ్యాంగులకు అండగా ఉందాం..

# భవిష్యత్తుకు ధైర్యాన్నిద్దాం

**- మంత్రి నారాయణ పిలుపు**

**- రూ.30 లక్షల గెయిల్ సీఎస్ఆర్ నిధులతో సహాయ పరికరాల పంపిణీకి శ్రీకారం**




రాజమహేంద్రవరం (చైతన్యరథం): దివ్యాంగులకు అండగా నిలిచి వారి భవిష్యత్తుకు ధైర్యాన్ని అందించేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పిలుపునిచ్చారు. గెయిల్ సంస్థ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.30 లక్షలతో దివ్యాంగులకు సహాయ పరికరాలు అందించేందుకు ప్రత్యేక శిబిరాన్ని రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని వి. కన్వెన్షన్‌లో నిర్వహించారు. మంత్రి పి. నారాయణ, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు సంయుక్తంగా శిబిరాన్ని ప్రారంభించారు.

కార్యక్రమంలో భాగంగా దివ్యాంగుల నుంచి బ్యాటరీ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, వాకింగ్ స్టిక్స్ కోసం నమోదు ప్రక్రియ చేపట్టారు. లబ్ధిదారుల అవసరాలను పరిశీలించి, అర్హతకు అనుగుణంగా పరికరాలను అందజేస్తామని అధికారులు తెలిపారు.

మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ.. గెయిల్ సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.30 లక్షలతో దివ్యాంగులకు సహాయ పరికరాలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అవసరమైన వారికి ఉపయోగపడేలా సీఎస్ఆర్ నిధులను ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి గెయిల్ సంస్థ నుంచి సీఎస్ఆర్ నిధులు సమకూర్చడంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేసిన కృషిని అభినందించారు.

**ఆర్థిక ఇబ్బందులున్నా.. అభివృద్ధి ఆగదు**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నారాయణ తెలిపారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాజమహేంద్రవరం నగరంతో పాటు పుష్కరాలకు సంబంధించిన పరిసర మున్సిపాలిటీల్లో సుమారు రూ.2 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

2014–19 మధ్యకాలంలో రాజమహేంద్రవరం పుష్కరాల సందర్భంగా మున్సిపల్ శాఖ ద్వారా రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సుమారు రూ.1,000 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి గుర్తుచేశారు.

**సీఎస్ఆర్‌తో మరింత ప్రజా సేవ**

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థల సహకారం జోడిస్తే ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ ఉద్దేశంతో గెయిల్ సంస్థను సీఎస్ఆర్ నిధులు కోరగా రూ.30 లక్షలు కేటాయించిందన్నారు. ఈ నిధులతో నాలుగు రకాల సహాయ పరికరాలను అందించేందుకు నమోదు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. ప్రజలకు మేలు చేసే ప్రతి అవకాశాన్ని అన్వేషిస్తూ పనిచేస్తున్నామని చెప్పారు.

పుష్కరాల ఏర్పాట్లకు ప్రభుత్వం ఇప్పటికే సుమారు రూ.2 వేల కోట్ల వరకు నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. రాజమహేంద్రవరం పరిధిలో చేపట్టే పనులకు మరిన్ని నిధులు కేటాయించాలని మంత్రి నారాయణను కోరినట్లు తెలిపారు.

**ప్రజా సేవలో ఎమ్మెల్యే కృషి అభినందనీయం**

ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని అభినందించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు తనవంతు బాధ్యతగా ట్రస్ట్ ద్వారా కూడా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నగరంలో చక్కటి పార్కులు, ప్రజలకు ఉపయోగపడే సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో నిరంతరం పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి సీఎస్ఆర్ నిధులను సమీకరించి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించడం అభినందనీయమన్నారు. ప్రజలకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు సమష్టి కృషి అవసరమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గెయిల్ అధికారులు, గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ శివ్ కుమార్, డీజీఎం హెచ్ఆర్ డి.వి. ప్రభాకర్, జీఎం పోతయ్య, ఇతర అధికారులు నీలం ముఖర్జీ, శాంతి సాగర్, అధిక సంఖ్యలో దివ్యాంగులు, ఇతర ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## వివేకా హత్యకేసులో ఈడీ తలుపులు కొడుతున్నా...

# గొడ్డలి పార్టీ అధినేత ఎందుకు నోరు విప్పడు?

- **ఆధారాలన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే**
- **జగన్ జవాబు చెప్పాల్సిందే**
- **హంతకులు తప్పించుకోలేరు, చిప్పకూడు తప్పదు**
- **ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్**



అమరావతి (చైతన్యరథం): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య కేసు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు తలుపులు కొడుతున్నా గొడ్డలి పార్టీ అధినేత ఎందుకు నోరు విప్పటం లేదని ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ ప్రశ్నించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆధారాలన్నీ నేరుగా జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్నాయని రాకేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర స్థాయి నుంచి కేంద్ర స్థాయి వరకు ప్రతి దర్యాప్తు సంస్థ నివేదిక జగన్‌ను ప్రధాన సూత్రధారిగా ఎత్తిచూపుతోందన్నారు. వివేకాను అంతమొందించేందుకు చేతులు మారిన రూ.40 కోట్ల భారీ సుపారీ, హవాలా, మనీలాండరింగ్ మూలాలను వెలికితీసేందుకు ఈడీ నేరుగా రంగంలోకి దిగి ఎంపీ అవినాష్ రెడ్డి కుటుంబానికి సమన్లు జారీ చేసి తలుపు తడుతుంటే, తాడేపల్లి ప్యాలెస్ ఎందుకు కిమ్మనకుండా మౌనం పాటిస్తోందని నిలదీశారు. ప్రభుత్వంపై పేటీఎం బ్యాచ్‌తో రోజూ విషం చిమ్మించే జగన్ రెడ్డి, ఈడీ దూకుడుపై ఎందుకు కిక్కురుమనడం లేదని ప్రశ్నించారు.

**జగన్ జవాబివ్వాల్సిందే..**

సొంత బాబాయ్ రక్త చరిత్రపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాల్సిన నైతిక బాధ్యత ముమ్మాటికీ జగన్మోహన్ రెడ్డిదేనని దూండి రాకేష్ స్పష్టం చేశారు. వివేకానందరెడ్డి తెల్లవారుజామునే దారుణ హత్యకు గురైతే, ఉదయం నుంచే సొంత మీడియా ద్వారా "గుండెపోటు, రక్తపు వాంతులు" అంటూ కట్టుకథలు అల్లించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో జగన్ సమాధానం చెప్పాలన్నారు. తెల్లవారుజామునే హత్య సమాచారం తెలిసినప్పటికీ సాయంత్రం వరకు లోటస్ పాండ్ వదలకుండా ఎవరితో చీకటి మంతనాలు జరిపారో ప్రజలకు తెలియజేయాలన్నారు. ఘటనా స్థలంలో గొడ్డలి వేట్లతో రక్తపు మడుగులో ఉన్న మృతదేహాన్ని చూసి సీఐ శంకరయ్య వివరాలు సేకరిస్తుంటే, దానిని గుండెపోటుగా ధ్రువీకరించాలని ఎంపీ అవినాష్ రెడ్డి ఎవరి అండతో బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్య జరిగిన అర్ధరాత్రి వేళ ఓఎస్డీ, నవీన్ ఫోన్ల ద్వారా అవినాష్ రెడ్డితో నడిచిన అనుమానాస్పద సంభాషణల గుట్టును దర్యాప్తు సంస్థలు బయటకు తీయాలన్నారు.

**రోజుకో తప్పుడు కథనం..**

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాబాయ్ హత్యపై సీబీఐ విచారణ కావాలని కోర్టుల్లో గగ్గోలు పెట్టిన జగన్, అధికారంలోకి రాగానే అదే హైకోర్టు పిటిషన్‌ను ఎందుకు ఉపసంహరించుకున్నారని దూండి రాకేష్ ఎండగట్టారు. నిజాయితీగా పనిచేసిన ఐపీఎస్ అధికారి మహంతిని సెలవుపై పంపించి, కడపలో దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారి రామ్ సింగ్‌పై తప్పుడు కేసులు బనాయించి బాంబులు వేస్తామని బెదిరించిన రౌడీ మూకను కాపాడింది జగన్ ప్రభుత్వం కాదా అని మండిపడ్డారు. మొదట గుండెపోటు, తర్వాత టీడీపీపై నెపం, ఆపై అల్లుడు, ఆస్తి తగాదాలు, వివాహేతర సంబంధాలు, చివరకు సునీల్ యాదవ్ తల్లిపై వేధింపులంటూ రోజుకో సిగ్గుమాలిన కథనం అల్లి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు.

**జగన్ తప్పించుకోలేడు..**

వివేకా హత్య కేసుతో ముడిపడిన కీలక సాక్షులు కసనూరు శ్రీనివాసరెడ్డి, మృతదేహానికి కుట్లు వేసిన ఆసుపత్రి యజమాని ఈసీ గంగిరెడ్డి, హత్యను తనపై వేసుకుంటే శివశంకర్ రెడ్డి రూ.10 కోట్లు ఇస్తానన్నట్లు వాంగ్మూలం ఇచ్చిన కువైట్ గంగాధర్ రెడ్డి, హైదరాబాద్ నుంచి పులివెందులకు జగన్ దంపతులు వచ్చిన కారు నడిపిన డ్రైవర్ నారాయణ, వాచ్‌మెన్ రంగయ్యలు వరుసగా అనుమానాస్పద స్థితిలో ఎలా చనిపోయారో జగన్ నోరు విప్పాలని డిమాండ్ చేశారు. జైల్లో ఉన్న అప్రూవర్ దస్తగిరిని బెదిరించి, సాక్ష్యం మార్చితే రూ.20 కోట్లు ఇస్తామంటూ తాడేపల్లి ప్యాలెస్ అండతో డాక్టర్ చైతన్య రెడ్డి బేరసారాలు నడిపించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. "జగన్, అవినాష్ రెడ్డిల నుంచే నాకు ప్రాణహాని ఉంది, రక్షణ కల్పిస్తే అసలు నిజాలు బయటపెడతా" అని ఏ–2 సునీల్ యాదవ్ స్వయంగా చెపుతుంటే సమాధానం చెప్పే దమ్ము జగన్‌కు ఉందా అని నిలదీశారు. బాబాయ్ హత్య వల్ల రాజకీయంగా, ఆర్థికంగా పూర్తి లబ్ధి పొందింది ముమ్మాటికీ జగన్మోహన్ రెడ్డేనని, నేరం చేసిన వాడు ఎంతటి వాడైనా తప్పించుకోలేడని, గొడ్డలి పార్టీ ముఠా చిప్పకూడు తినడం ఖాయమని దూండి రాకేష్ హెచ్చరించారు.

# టెక్కలి ప్రగతికి మంత్రి అచ్చెన్న సంకల్పం

- మంత్రి ప్రత్యేక చొరవతో నరసింగపల్లికి రూ.3.92 కోట్ల విద్యుత్ సబ్‌స్టేషన్
- పల్లెల్లో వెలుగులు.. అభివృద్ధిలో కొత్త అడుగులు
- నియోజకవర్గాన్ని రాష్ట్రంలో తొలి స్థానంలో నిలపాలన్న లక్ష్యంతో అచ్చెన్నాయుడు కృషి
- 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి
- ఏడు గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరా.. అంతరాయాలను తగ్గించేలా ఏర్పాట్లు
- ప్రత్యేక, ప్రత్యామ్నాయ ఫీడర్లతో విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి ముందుచూపు



కోటబొమ్మాళి (చైతన్యరథం): టెక్కలి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలో తొలి స్థానంలో నిలపాలన్న బలమైన సంకల్పం.. పల్లె ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలన్న తపన.. స్థానిక అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను తీర్చిదిద్దే ముందుచూపు.. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషితో నరసింగపల్లిలో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఈ లక్ష్యాలకు కార్యరూపంగా నిలుస్తోంది. నియోజకవర్గ ప్రగతికి సారథ్యం వహిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఆయన మరో కీలక అడుగు వేశారు.

శ్రీకాకుళం జిల్లా టెక్కలి డివిజన్, కోటబొమ్మాళి సెక్షన్ పరిధిలోని నరసింగపల్లిలో రూ.3.92 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు రెండు రోజుల క్రితం శంకుస్థాపన చేశారు. మంత్రి ప్రత్యేక కృషితో మంజూరైన ఈ ప్రాజెక్టు పరిధిలోని ఏడు గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించనుంది. పల్లెల అభివృద్ధికి అత్యవసరమైన విద్యుత్ మౌలిక వసతులకు ప్రాధాన్యమిస్తూ, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో మంత్రి చొరవ స్పష్టంగా కనిపిస్తోంది.

గ్రామీణ జీవనానికి, వ్యవసాయ కార్యకలాపాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా ఎంతో కీలకం. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని నరసింగపల్లి ప్రాంతానికి సబ్‌స్టేషన్ మంజూరయ్యేలా అచ్చెన్నాయుడు చేసిన కృషి పల్లె ప్రగతిపై ఆయనకున్న శ్రద్ధకు నిదర్శనం. అభివృద్ధి ఫలాలు గ్రామస్థాయికి చేరాలన్న లక్ష్యానికి ఈ ప్రాజెక్టు బలమైన పునాది కానుంది. ఏడు గ్రామాల ప్రజలకు ఉపయోగపడే విద్యుత్ సదుపాయం కల్పించడం ద్వారా స్థానిక అవసరాలను అభివృద్ధి ప్రణాళికలో ముందుంచిన నాయకుడిగా ఆయన తన ప్రత్యేకతను చాటుతున్నారు.

నూతన సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్, 6.13 కిలోమీటర్ల 33 కేవీ లైన్, 1.92 కిలోమీటర్ల 11 కేవీ లైన్ ఏర్పాటు చేయనున్నారు. వీటితోపాటు ఒక ఎల్‌వీ వీసీబీ, మూడు ఫీడర్ వీసీబీలు, మూడు 11 కేవీ ఫీడర్లను సమకూర్చనున్నారు. ఈ ఏర్పాట్లు స్థానిక విద్యుత్ పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేసి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడనున్నాయి.

విద్యుత్ సరఫరాకు ప్రత్యామ్నాయ మార్గం కూడా ఉండేలా ప్రణాళిక రూపొందించారు. నరసన్నపేట సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేక 33 కేవీ ఫీడర్‌ను ఏర్పాటు చేయడంతోపాటు, టెక్కలి, కోటబొమ్మాళి ఫీడర్‌కు నిమ్మాడ 33/11 కేవీ సబ్‌స్టేషన్ వద్ద ట్యాప్ చేసి ప్రత్యామ్నాయ 33 కేవీ ఫీడర్‌ను నిర్మించనున్నారు. ఈ సదుపాయాలతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించేందుకు అవకాశం కలగనుంది. ప్రధాన సరఫరాతోపాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు కూడా ప్రాధాన్యం ఇవ్వడం ఈ ప్రాజెక్టులో కీలక అంశం.





టెక్కలి నియోజవర్గాలపరిధిలో గ్రామాల అభివృద్ధే పునాది అనే దిశగా అచ్చెన్నాయుడు చేస్తున్న కృషిలో నరసింగపల్లి సబ్‌స్టేషన్ ఒక ముఖ్యమైన ముందడుగు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలన్న ఆశయానికి, ప్రజల దైనందిన అవసరాలు తీర్చే మౌలిక వసతుల కల్పనకు ఈ శంకుస్థాపన అనుసంధానంగా నిలుస్తోంది. ఏడు గ్రామాలకు మెరుగైన విద్యుత్ సదుపాయం అందించే ఈ ప్రాజెక్టు, టెక్కలి నియోజకవర్గం ప్రగతిపట్ల అచ్చెన్నాయుడు నిబద్ధతకు, అభివృద్ధిని సాధించే ఆయన చొరవకు నిదర్శనం.

33/11 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో పరిసర ప్రాంతాల్లోని చిన్నతరహా పరిశ్రమలకు మరింత ప్రయోజనం చేకూరడంతోపాటు, విద్యుత్ సరఫరా నిరంతరాయంగా అందుతోంది. దీంతో స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడుతున్నాయి.

### గడువులోగా సబ్‌స్టేషన్ నిర్మాణం

మూడు నుంచి నాలుగు నెలల కాలవ్యవధిలో ఈ నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తికానుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. అనుకున్న గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసి, సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.

# పెనుకొండ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

- పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి సవిత
- రూ.20 కోట్లతో హెచ్ఏఎం నిధులతో రోడ్లు, డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్ పనులు
- సొంత నిధులతో రూ.5 లక్షలతో నిర్మించిన పార్కు ప్రారంభం
- మరో రెండు చోట్ల రూ.30 లక్షలతో సీసీ రోడ్లకు భూమిపూజ



పెనుకొండ (చైతన్యరథం): పెనుకొండ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్. సవిత చెప్పారు. పట్టణ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో పలు అభివృద్ధి పనులను మంత్రి స్థానిక ఎమ్మెల్యే ఎస్.సవిత ప్రారంభించడంతోపాటు, మరికొన్ని అభివృద్ధి పనులకు శనివారం మంత్రి భూమిపూజ చేశారు. పెనుకొండలోని చావిడి వద్ద ప్రజలు విశ్రాంతి తీసుకునేందుకు మంత్రి సవిత తన సొంత నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన పార్కును ప్రారంభించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు విశ్రాంతి సౌకర్యంకల్పించాలనే ఉద్దేశంతో ఈపార్కును ఏర్పాటు చేశారు. అనంతరం రామాలయం స్ట్రీట్ వద్ద రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మంత్రి భూమిపూజ చేశారు. అలాగే భోగసముద్రం చెరువు వద్ద రూ.10లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు.

### రూ.20 కోట్లతో పట్టణ అభివృద్ధి పనులు

అనంతరం మున్సిపల్ కార్యాలయం నందు హెచ్ఏఎం (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) నిధులతో పెనుకొండ పట్టణంలో రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి సవిత శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ నిధులతో పట్టణ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, సెంట్రల్ డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ పెనుకొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, పట్టణంలోని ప్రతి ప్రాంతానికి అభివృద్ధి ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



కురుపాం (చైతన్యరథం): దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, వారికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తోందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో శనివారం నాడు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శారీరక దివ్యాంగులకు ఉచితంగా మూడు చక్రాల స్కూటర్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దివ్యాంగులు స్వయం ఆధారితంగా జీవించేందుకు, విద్య, ఉపాధి, ఇతర అవసరాల కోసం సులభంగా రాకపోకలు సాగించేందుకు మూడు చక్రాల స్కూటర్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## బీసీ ద్రోహి జగన్మోహన్‌రెడ్డి : మండిపడ్డ ఎమ్మెల్యే కోళ్ల లతిత కుమారి

ఎల్.కోట (చైతన్యరథం): వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటి నుంచీ బీసీ వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పక్కా బీసీ ద్రోహిగా వ్యవహరిస్తున్నారని ఎస్. కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక ఎల్.కోట క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతిపక్ష నేత జగన్‌కు మతిభ్రమించి నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఆలోచించే విచక్షణ కూడా ఆయనకు లేదని విమర్శించారు. గత ఐదేళ్ల పాలనలో బీసీలకు చేసిన అన్యాయం చాలదన్నట్లుగా, నేడు మళ్లీ బీసీల గొంతు నొక్కేందుకు ఆయన కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీ వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా, విద్యా, ఉద్యోగ రంగాల్లో న్యాయం చేయాలనే చిత్తశుద్ధితో కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. గతంలోనూ చంద్రబాబు బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలు చేసి అన్ని వర్గాల వారికి పెద్దపీట వేసి అండగా నిలిచారని పేర్కొన్నారు.

## సబ్సిడీపై రూ.35కే కిలో ఉల్లి పంపిణీ చేసిన ఎమ్మెల్యే వెలగపూడి



విశాఖపట్నం (చైతన్యరథం): ఎంవిపి కాలనీ రైతు బజార్ నందు నేషనల్ కో-ఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ. 35కే కిలో ఉల్లిపాయలు ప్రత్యేక కౌంటర్‌ను విశాఖపట్నం తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ప్రజలకు తక్కువ ధరలో నిత్యావసర సరుకులు అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం NCCF ద్వారా ఈ సబ్సిడీ కౌంటర్‌లను ఏర్పాటు చేసింది. మార్కెట్‌లో కిలో ఉల్లిపాయలు రూ. 50 పైగా ఉన్న తరుణంలో, NCCF ద్వారా రూ. 35 కే అందించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి చర్య తీసుకుంటుందని, ధరల పెరుగుదలను అరికట్టడానికి రైతు బజార్‌లలో ఇలాంటి కౌంటర్లు చాలా అవసరమని, ఈ కౌంటర్ ద్వారా ఎంవిపి కాలనీ, సీతమ్మధార, వెంకోజిపాలెం పరిసర ప్రజలకు ఎంతో లాభం చేకూరుతుందని అన్నారు.

## రచయిత బెహరా వెంకట సుబ్బారావు కృషి అభినందనీయం : ఎంపీ కలిశెట్టి



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు శనివారం విజయనగరంలోని జీఎస్ఆర్ ఇంటర్నేషనల్‌లో తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సముద్రాల గురుప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన "మధ్యతరగతి మందహాసం" ఇంగ్లీష్ అనువాద పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ రచయిత, దివంగత బెహరా వెంకట సుబ్బారావు రచించిన ఈ పుస్తకానికి ఆంగ్ల అనువాద రూపమైన 'The Quiet Weight of Life గ్రంథాన్ని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ... వృత్తిరీత్యా పోస్టుమ్యాన్‌గా పనిచేస్తూనే సాహిత్యంపై అపారమైన మమకారంతో విశేష రచనా కృషి చేసిన బెహరా వెంకట సుబ్బారావు సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన రచనలను ఆంగ్లంలోకి అనువదించి మరింత విస్తృత పాఠకలోకానికి పరిచయం చేస్తున్న వారి కుమారుడు బెహరా సత్యనారాయణమూర్తిని ప్రత్యేకంగా అభినందించారు. సాహిత్యం భాషా సరిహద్దులను దాటి మానవ అనుభవాలను, జీవిత విలువలను అందరికీ చేరవేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు, ప్రాజెక్ట్ చైర్‌పర్సన్ గురాన అయ్యలు, విజయనగరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కాపుగంటి శ్రీనివాస్, ఇతర సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు శ్రేణులు సిద్ధంగా ఉండాలి : కిమిడి నాగార్జున

**●కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**



విజయనగరం (చైతన్యరథం): స్థానిక ఎన్నికలు సిద్ధంగా ఉండాలిని విజయనగరం జిల్లా టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. విజయనగరం జిల్లా టీడీపీ కమిటీ సమావేశం శనివారం పార్టీ కార్యాలయం (అశోక్ బంగ్లా)లో జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అధ్యక్షతన నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా వివరించాలని నాయకులకు సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను గ్రామస్థాయిలోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. అలాగే కూటమి భాగస్వామ్య పార్టీలతో సమన్వయంతో పనిచేస్తూ, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సమావేశంలో చర్చించారు. పార్టీ సంస్థాగత అంశాలు, స్థానిక రాజకీయ పరిస్థితులు, రానున్న ఎన్నికలకు సంబంధించిన కార్యాచరణపై నాయకులు చర్చించారు.

## కూటమి నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు చేరువ కావాలి

**●రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ మరియు గాజువాక నియోజకవర్గం పరిశీలకులు కిడారి శ్రావణ్ కుమార్**



గాజువాక (చైతన్యరథం): గాజువాక నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గాజువాక 97వ వార్డు అధ్యక్షులు అక్కిన లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్, గాజువాక నియోజకవర్గ పరిశీలకులు కిడారిశ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ఐక్యంగా పనిచేయాలని సూచించారు. వార్డులోని ప్రతి కుటుంబాన్ని నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగతంగా కలుసుకుని ప్రజల సమస్యలను తెలుసుకోవాలని, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. వార్డు పరిధిలోని వార్డు కమిటీ సభ్యులు, బూత్ ఇన్‌చార్జ్‌లు, బూత్ పరిశీలకులు, వార్డు పరిశీలకులు, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో పార్టీ కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహిస్తూ ప్రజలతో నిరంతరం మమేకం కావాలని తెలిపారు. ప్రతి బూత్‌కు సంబంధించిన పార్టీ కార్యకలాపాలు, ప్రజల సమస్యలు, స్థానిక పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి నాయకత్వానికి తెలియజేయాలని కిడారి శ్రావణ్ కుమార్ సూచించారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేసుకుని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. 97వ వార్డులో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కార్యకర్తలు పనిచేయాలని ఆయన సూచించారు.

## రైతు బజార్లలో సబ్సిడీ ఉల్లి కౌంటర్లను ప్రారంభించిన ప్రభుత్వ విప్ గణబాబు



విశాఖపట్నం (చైతన్యరథం): సామాన్య ప్రజలపై నిత్యావసర వస్తువుల ధరల భారాన్ని తగ్గించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) స్పష్టం చేశారు. గోపాలపట్నం, మర్రిపాలెం రైతు బజార్లలో ప్రభుత్వం ఎన్.సి.సి.ఎఫ్. సహకారంతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సబ్సిడీ ఉల్లి విక్రయ కౌంటర్లను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పంట దెబ్బతినడం, స్థానికంగా కర్నూలు తదితర ప్రాంతాల్లో పంట నష్టం వల్ల ఉల్లి కొరత ఏర్పడి ధరలు పెరిగాయని పేర్కొన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కిలో ఉల్లి ధర రూ. 65 నుంచి రూ. 70 వరకు, రైతు బజార్ సాధారణ స్టాళ్లలో రూ. 55 వరకు ఉండగా, ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వం ప్రత్యేక చొరవతో మహారాష్ట్ర నుంచి ఉల్లిని తెప్పించి సబ్సిడీపై కేవలం రూ. 35లకే అందిస్తోందని తెలిపారు. ప్రతి కుటుంబానికి ఆధార్ కార్డు ప్రాతిపదికన ప్రజా యాప్ ద్వారా నెలకు 2 కేజీల చొప్పున పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని వివరించారు.

**ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం:**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు "ఆదాయాలు పెరగాలి -ఖర్చులు తగ్గాలి" అనే విధానంతో ముఖ్యమంత్రి చంద్రబాబుపాలన సాగిస్తున్నారని ఆయన అన్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో 9 సార్లు కరెంట్ బిల్లులు పెంచితే, కూటమి ప్రభుత్వం ట్రూ-డౌన్ ఛార్జీల ద్వారా యూనిట్‌కు 13 పైసలు తగ్గించి ప్రజలకు ఆదా చేసిందని గుర్తు చేశారు.

## ప్రతి కుటుంబానికి రాయితీపై రెండు కేజీల ఉల్లి

**● విశాఖ మధురవాడ రైతు బజార్‌లో ప్రారంభించిన ఎమ్మెల్యే గంటా**



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ జిల్లా మధురవాడ రైతు బజారులో ప్రభుత్వం అందిస్తున్న రాయితీ ఉల్లి విక్రయాలను శనివారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రతి కుటుంబానికి కిలో రూ. 35 చొప్పున రెండు కేజీల ఉల్లిపాయలను రేషన్ కార్డ్ లేదా ఆధార్ కార్డుపై అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ధరల స్థిరీకరణకు కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. రైతు బజార్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, భీమిలి ఇన్ఛార్జి చిక్కాల విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## 34 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**●న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి బీసీలకు న్యాయం చేస్తాం**

**●మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి పూర్తిగా కట్టుబడి ఉన్నామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. జేఎన్ రోడ్డులోని వి. కన్వెన్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీవోలను ప్రతిపక్ష వైసీపీ న్యాయస్థానంలో సవాలు చేసిందన్నారు. బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే రిజర్వేషన్లను ఎందుకు సవాలు చేశారో ప్రజలకు వివరించాలని వైసీపీ నేతలను ప్రశ్నించారు. గతంలో బీసీలకు 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు అవసరమైన అన్ని న్యాయపరమైన చర్యలు తీసుకుంటోందన్నారు. ఎవరికీ అన్యాయం జరగకుండా చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేసి రిజర్వేషన్లను అమలు చేస్తామని స్పష్టం చేశారు.

**రూ.30 లక్షలతో దివ్యాంగులకు సహాయ పరికరాలు**

గెయిల్ సీఎస్ఆర్ నిధులతో సుమారు రూ.30 లక్షల విలువైన సహాయ పరికరాలను దివ్యాంగులకు ఉచితంగా అందించే కార్యక్రమాన్ని చేపట్టామని ఆదిరెడ్డి శ్రీనివాస్ ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటికే 800 మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. మొదట రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గానికే పరిమితం చేయాలని భావించినప్పటికీ, కొవ్వూరు, అనపర్తి తదితర ప్రాంతాల నుంచి కూడా దివ్యాంగులు వచ్చి సహాయం కోరుతున్న నేపథ్యంలో నియోజకవర్గాల పరిధితో సంబంధం లేకుండా అవసరమైన వారికి సహాయం అందించేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

**నగర సమస్యలకు శాశ్వత పరిష్కారం**

నగరంతో తనకు భావోద్వేగ అనుబంధం ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. నగరంలో పుట్టి పెరిగిన ప్రతి ఒక్కరికీ నగరం పట్ల గౌరవం, బాధ్యత ఉండాలన్నారు. దశాబ్దాలుగా ఉన్న సమస్యలను రాజకీయ విమర్శలకు మాత్రమే ఉపయోగించకుండా వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నగరాభివృద్ధిలో భాగంగా రివర్ ఫ్రంట్, అఖండ గోదావరి, మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అమృత్ 2.0 వంటి పలు ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని తెలిపారు. కంబాలచెరువు జంక్షన్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.25 కోట్లతో పనులు చేపడుతున్నామని చెప్పారు. నల్లచానల్ వద్ద అదనపు వెంటు నిర్మాణానికి టెండర్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

## బీసీల అభివృద్ధికి వైసీపీ ఆటంకం : మంతెన రామరాజు



ఉండి (చైతన్యరథం): ఏపీలోని వెనుకబడిన తరగతుల కులాల అభివృద్ధికి వైసీపీ ఆటంకంగా తయారైందని పశ్చిమగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు మంతెన రామరాజు విమర్శించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 34 శాతం రిజర్వేషన్ కొరకు కూటమి ప్రభుత్వం నిబద్ధతతో ముందుకు వెళుతుంటే రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము ధైర్యం లేని గొడ్డలి పార్టీ అధినేత ఆ పార్టీ నాయకులు కుట్ర రాజకీయాలు చేయడం హేయనియమన్నారు. బీసీలకు రాజకీయంగా కీలక పదవులను కట్టబెట్టిన టీడీపీ బీసీలకు మరింత ప్రాధాన్యత కల్పించాలని ఎన్డీఏ కూటమి ప్రభుత్వ 34 శాతం రిజర్వేషన్ల జీవోలపై గొడ్డలి పార్టీ హైకోర్టు ద్వారా బీసీల అభివృద్ధికి కుట్ర రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు సుప్రీంకోర్టు ద్వారా న్యాయబద్ధ పోరాటం చేయడానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. బీసీలకు మేలు చేసింది ఏ పార్టీయో బీసీలు అందరికీ తెలుసునని జగన్ మోహన్ రెడ్డికి బీసీలపై ప్రేమ ఉంటే బీసీ రిజర్వేషన్ చట్టానికి సహకరించాలని డిమాండ్ చేశారు.

## ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు : ఎమ్మెల్యే కూన రవికుమార్



ఆమదాలవలస (చైతన్యరథం): నియోజకవర్గంలో ఆమదాలవలస పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో కొత్తగా మంజూరైన 44 స్పౌస్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమదాలవలస శాసనసభ్యులు మరియు రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూనరవికుమార్ హాజరై లబ్ధిదారులకు పెన్షన్ డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ... అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు ఆధారంలేని కుటుంబాలకు పెన్షన్లు ఎంతో ఆర్థిక భరోసా కల్పిస్తాయని అన్నారు. కొత్తగా మంజూరైన 44 స్పౌస్ పెన్షన్లు లబ్ధిదారులకు అందించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. పెన్షన్ డబ్బులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.సుజాత, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని శేఖర్, జిల్లా అధికార ప్రతినిధి నందివాడ గోవిందరావు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఇది చేతల ప్రభుత్వం... అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించాం

**●రూ.9.43 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



గుంటూరు (చైతన్యరథం): 'గుంటూరు నగరంలో కేవలం మాటలు చెప్పడం కాదు, అభివృద్ధి అంటే ఏమిటో చేతల్లో పనులు చేసి చూపిస్తున్నాం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నగర అభివృద్ధి కోసం కూటమి బలపరచిన అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నా'నని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శనివారం స్థానిక శ్రీనగర్, మల్లికార్జున పేట, వసంతరాయపురం, ఆదిత్య నగర్, సాయినగర్, లాలాపేట పోలీస్ స్టేషన్ మెయిన్ లైన్ తోపాటు పాత గుంటూరులోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు రూ.9.43కోట్లతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ... నియోజకవర్గంలో నలుదిక్కులా అన్ని విధాలుగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో నందివెలుగు బ్రిడ్జి నిర్మాణానికి కనీసం తట్ట మట్టి కూడా వేయలేదని, తాము అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో 80 శాతం పనులు పూర్తి చేశామని చెప్పారు. నగరంలో నాలుగు వైపులా ఆర్వోబీల నిర్మాణానికి చేపట్టామని, ప్రజలకు ట్రాఫిక్ సమస్యల నుంచి విముక్తి చేయబోతున్నామని తెలిపారు. గుంటూరు నగరానికి ముంపు సమస్య శాశ్వత పరిష్కారం చేసేందుకు 30 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న మొండిగేటు అభివృద్ధికి రూ.8 కోట్లు కేటాయించామని చెప్పారు. వినోభానగర్ వద్ద రూ.3 కోట్లతో బ్రిడ్జి నిర్మించామని, ప్రతి వీధిలోనూ అవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. క్రీడలకు పెద్ద పీట వేస్తూ బీఆర్ స్టేడియం అభివృద్ధికి రూ.3 కోట్లు కేటాయించామని, రూ.14 కోట్లతో మల్టీపర్పస్ బిల్డింగ్ నిర్మాణం చేపట్టామని చెప్పారు. వీటితోపాటు ఆర్టీసీ కాలనీలో మూడు పార్కులతోపాటు మరికొన్ని ప్రదేశాల్లో వాకింగ్ ట్రాక్‌లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. పాత గుంటూరులో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తున్నామని, రూ.3 కోట్లతో పనులు చేపడుతున్నామని చెప్పారు.

## విజయవాడ ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

**● స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడలో నిర్వహించిన స్వచ్ఛథాన్‌కు మంచి స్పందన లభించినట్లు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘు రామరాజులతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు సారథ్యంలో 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' ఉద్యమం విజయవంతంగా సాగుతోందని చెప్పారు. విజయవాడలో శుక్రవారం స్వచ్ఛ దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించామని, స్వచ్ఛథాన్‌కు మంచి స్పందన లభించిందని తెలిపారు. 22 రాష్ట్రాల నుంచి పది వేల మందిపైగా మారథాన్‌లో పాల్గొన్నారన్నారు. విజయవాడ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఆనందం కలిగించిందని చెప్పారు. ఇంతమంది భాగస్వాములైనందుకు ధన్యవాదాలు తెలిపారు. స్వచ్ఛథాన్ సక్సెస్ అవడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా ప్రత్యేకంగా అభినందించారని సంతోషం వ్యక్తం చేశారు. విజయవాడ ఉత్సవ్‌ను కూడా ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు సాగుతున్నాయని చెప్పారు. ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో తాము, ప్రజాప్రతినిధులు సమిష్టిగా పని చేస్తున్నామన్నారు. రాష్ట్రపతి ముర్ము ఈ విజయవాడ ఉత్సవ్‌కు రాబోతున్నట్లు తెలిపారు. అనేక రాష్ట్రాల సీఎంలను ఆహ్వానించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ వెళ్లారన్నారు. దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్‌కు లక్షలాది మంది తరలి వచ్చి ఆనందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనేకమంది, అనేక సంస్థ లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చేయూతను అందిస్తున్నట్లు చెప్పారు. గతేడాది కంటే ఈసారి విభిన్నంగా, విశేషంగా ఉండేలా కళా బృందాలు ప్రదర్శనలు ఇవ్వనున్నాయన్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చే అతిథులు, రాష్ట్ర ప్రజలు దసరా వైభవం, విజయవాడ ఉత్సవ్ గురించే మాట్లాడుకోవాలన్నారు. గత ఏడాది మూడు వేలమందితో చేసిన కార్నివాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని, ఈ ఏడాది ఐదు వేల మంది కళాకారులతో కార్నివాల్ ఉండబోతుందని వివరించారు.

## ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం



కాకినాడ (చైతన్యరథం): ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు తెలిపారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన లబ్ధిదారులకు శుక్రవారం తన కార్యాలయంలో రూ.5.33 లక్షల విలువైన 7 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పమని ఎంపీ సానా సతీష్ బాబు అన్నారు.

## నా బిడ్డను కడసారి చూసేందుకు సాయం చేయండి

విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ జిల్లా రుషికొండ ఐటీ హిల్స్ కూడలి సమీపంలోని సముద్ర తీరంలో శుక్రవారం గల్లంతై మృతి చెందిన ముగ్గురు విద్యార్థుల్లో ఎస్.సూర్యప్రకాష్ మృతదేహం శనివారం వేకువజామున రామానాయుడు స్టూడియో ఎదురుగా లభ్యమైంది. కుమారుడి మరణవార్త తెలిసి విదేశాల్లో ఉన్న ఆయన తండ్రి భాస్కరరావు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తన బిడ్డను కడసారి చూసేందుకు, తీవ్ర విషాదంలో ఉన్న తన కుటుంబసభ్యులకు ఈ కష్టసమయంలో తోడుగా ఉండేందుకు తక్షణమే తనను భారతకు రప్పించేలా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పందించి.. తన పరిస్థితిని అర్థం చేసుకుని స్వదేశానికి తీసుకొచ్చేలా సాయం చేయాలని భాస్కరరావు వేడుకుంటున్నారు.

# రాష్ట్రానికి 3 లక్షల ఇళ్లు కేటాయింపు... కేంద్ర మంత్రి పెమ్మసాని

**●తెనాలి బుర్రిపాలెంలో 100, ఓబులనాయుడుపాలెంలో 70 ఇళ్లతో 3D హౌసింగ్ ప్రయోగాత్మక ప్రాజెక్ట్**



తెనాలి (చైతన్యరథం): గుంటూరు జిల్లాలోని రేపు రెండు కీలక కార్యక్రమాలు జరగనున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రధానంగా 3 లక్షల PMAY-G ఇళ్ల కేటాయింపు కార్యక్రమంతో పాటు, 3D హౌసింగ్ పైలట్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సోషియో ఎకనామిక్ ఇండికేటర్స్ ఆధారంగా రాష్ట్రానికి సుమారు 75 వేల ఇళ్లు వచ్చే అవకాశం ఉండగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సమన్వయంతో రాష్ట్రానికి 3 లక్షల ఇళ్లను తీసుకురాగలిగామని తెలిపారు. ఈ ఇళ్లకు సంబంధించిన అధికారిక కేటాయింపు ప్రక్రియను నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక సాంకేతికతతో గృహ నిర్మాణాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టేందుకు 3డీ హౌసింగ్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. బుర్రిపాలెంలో 100 ఇళ్లు, ఒబులనాయుడుపాలెంలో 70 ఇళ్లతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నామని పేర్కొన్నారు. 3డీ హౌసింగ్‌లో ప్రభుత్వ సహాయం, లబ్ధిదారుల భాగస్వామ్యం, నిర్మాణ సంస్థల సమన్వయంతో ఎండ్-టు-ఎండ్ హౌసింగ్ మోడల్‌ను అభివృద్ధి చేయడం తమ లక్ష్యమన్నారు. తక్కువ సమయంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడం, లేబర్ ఖర్చులు తగ్గించడం, మెటీరియల్ వేస్టేజ్‌ను తగ్గించడం వంటి అంశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు.

# కార్యకర్తల ఐక్యతే పార్టీకి కొండంత బలం:ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు



నరసరావుపేట (చైతన్యరథం): నియోజకవర్గ కేంద్రంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎన్నికల పరిశీలకులు కొమ్మినేని నారాయణ, పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ జాన్ సైదా, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయంగా సమావేశమై పార్టీ కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, నాయకులు-కార్యకర్తల మధ్య సమన్వయం తదితర కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా రానున్న మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా శ్రేణులను సమాయత్తం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో నేతలు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన జీవనాడి అని కొనియాడారు. నాయకులు, కార్యకర్తలు ఒకే తాటిపై నడిచి పరస్పర సమన్వయంతో పనిచేస్తే ఏ ఎన్నికల్లోనైనా తిరుగులేని విజయం సాధించవచ్చని స్పష్టం చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో నరసరావుపేట పురపాలక సంఘంపై పసుపు జెండా ఎగురవేయడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి వార్డులోనూ బూత్ స్థాయి కమిటీలను పటిష్టం చేసి, ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, పట్టణాభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకూ చేరవేయాలని సూచించారు. కార్యకర్తలకు పార్టీ నాయకత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# గుడివాడ పురపాలకలోకి 6 గ్రామ పంచాయతీల విలీన ప్రక్రియకు తొలి అడుగు

**●ఆర్డీఓ బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ మనోహార్, ఎమ్మెల్యే రాము ఆధ్వర్యంలో విలీనంపై సమావేశం**



గుడివాడ (చైతన్యరథం): గుడివాడ పురపాలక సంఘంలో ఆరు గ్రామపంచాయతీల విలీన ప్రక్రియకు తొలి అడుగు పడింది. విలీన ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గుడివాడ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ జీ. బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. సమావేశంలో గుడివాడ, పెదపారుపూడి మండల పరిషత్ అధికారులు, లింగవరం, వలివర్తిపాడు, మల్లయ్యపాలెం, బొమ్ములూరు, బిళ్లపాడు, భూషణగుళ్ల గ్రామాలకు చెందిన పంచాయతీ అధికారులు పాల్గొన్నారు. ఆరు గ్రామపంచాయతీలను గుడివాడ పురపాలక సంఘంలో విలీనం చేసే ప్రక్రియలో చేపట్టాల్సిన చర్యలు, రికార్డుల తయారీ, ఉద్యోగుల వివరాలు, మౌలిక వసతులు, పెండింగ్ అభివృద్ధి పనులపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. విలీన ప్రక్రియకు సంబంధించి గతంలో ఉన్న న్యాయపరమైన అంశాలు తొలగిపోవడంతో, గతంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సంబంధిత అధికారులు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఆర్డీఓ బాలసుబ్రమణ్యం సూచించారు. ప్రతి గ్రామపంచాయతీకి సంబంధించిన రికార్డులు, ఆస్తులు, ఉద్యోగులు, బకాయిలు, పెండింగ్ బిల్లులు, అభివృద్ధి పనుల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేసి, ఎటువంటి లోటుపాట్లు లేకుండా రికార్డులు సిద్ధం చేయాలని ఆదేశించారు. పంచాయతీ యూనిట్ ప్రాతిపదికన తీర్మానాలు, అవసరమైన పరిపాలనా ప్రక్రియ పూర్తి చేసి, సంబంధిత రెవెన్యూ గ్రామాలను పురపాలక సంఘంలో విలీనం చేసే ప్రక్రియ కొనసాగుతుందని ఆర్డీఓ బాలసుబ్రమణ్యం వివరించారు.

# విజయవాడ ఉత్సవ్ ప్రచారంలో భాగంగా అదరగొట్టిన ఫ్లాష్‌మాబ్‌లు

**●ప్రధాన కూడళ్లలో కళాకారుల నృత్య ప్రదర్శనలు.. ఉత్సాహంగా తిలకించిన నగరవాసులు**

**●ఫ్లాష్ మాబ్స్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నూర్ భాషా కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ పశ్చిమ సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పర్యాటక శాఖ సహకారంతో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ను విస్తృత ప్రచారం కల్పించేందుకు నగరంలోని ప్రధాన కూడళ్లలో నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని చిట్టినగర్ సెంటర్, భవానిపురం శివాలయం సెంటర్, కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్, కలరా హాస్పిటల్ సెంటర్ వద్ద ప్రత్యేకంగా ఫ్లాష్‌మాబ్ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.ప్రధాన కూడళ్లలో ఒక్కసారిగా సంగీతం ప్రారంభం కావడంతో యువ కళాకారులు ఉత్సాహభరితమైన నృత్య ప్రదర్శనలను ప్రారంభించారు. సమన్వయంతో కూడిన నృత్య కదలికలు, ఆకట్టుకునే కొరియోగ్రఫీతో కళాకారులు చేసిన ప్రదర్శనలు స్థానికులు, ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పలువురు ప్రజలు తమ మొబైల్ ఫోన్లలో ప్రదర్శనలను చిత్రీకరిస్తూ ఆసక్తిగా తిలకించారు.

# రూ.8.50 కోట్లతో గుంటూరు పశ్చిమలో అభివృద్ధి పనులు

**●శంకుస్థాపన కార్యక్రమం చేపట్టిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రూ. 8.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి శనివారం శంకుస్థాపన చేశారు. డివిజన్లలో రోడ్లు, సీసీ డ్రెయిన్లు, ఆర్‌సీసీ అవుట్‌ఫాల్ డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 21వ, 25వ, 43వ, 49వ డివిజన్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ డివిజన్లలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంతో పాటు కొత్తగా అవసరమైన సీసీ రోడ్లు, సీసీ డ్రెన్లు, అవుట్‌ఫాల్ డ్రెన్లు, కల్వర్టులు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి రూ. 8.50 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ నాలుగు డివిజన్లలో గత రెండేళ్ల కాలంలోనే ఇప్పటికే రూ. 53 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం చేపడుతున్న పనులతో కలిపి ఈ ప్రాంతాల్లో మొత్తం రూ. 70కోట్లకు చేరువలో అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే అనేక పనులు పూర్తయ్యాయని, మిగిలిన రోడ్లు, డ్రైనేజీ మరియు ఇతర మౌలిక వసతుల సమస్యల పరిష్కారంపై కూడా ప్రత్యేక దృష్టి సారించి త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. డివిజన్ అధ్యక్షులు, స్థానిక నాయకులు నిరంతరం ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకురావడం వల్లే అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేయగలుగుతున్నామని చెప్పారు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, కార్పొరేషన్ సిబ్బంది సమన్వయంతో అంచనాలు సిద్ధం చేసి పనులు ప్రారంభించడంలో సహకరించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# రైతు భూమికి రాజముద్రే రక్షణ : ఎమ్మెల్యే బోడే ప్రసాద్



పెనమలూరు (చైతన్యరథం): గ్రామంలో రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు స్వయంగా పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ... పెనమలూరు గ్రామంలో 853 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. రైతు భూమికి సంబంధించిన హక్కులు, వివరాలు అధికారికంగా నమోదై ఉండటం రైతులకు భరోసాను కల్పిస్తుందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు సంబంధించిన అధికారిక పట్టాదారు పాస్ పుస్తకాలపై వ్యక్తిగత ఫొటోలు ముద్రించి రైతుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని బోడే ప్రసాద్ పేర్కొన్నారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యక్తిగత ప్రచారాలకు తావులేకుండా,ప్రభుత్వ అధికారిక రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు. రీ-సర్వే ద్వారా భూమి వివరాలను స్పష్టంగా నమోదు చేసి,రెవెన్యూ రికార్డుల్లో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భూమి విస్తీర్ణం, హక్కుదారుల వివరాలు వంటి అంశాలు స్పష్టంగా నమోదవడం ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం తగ్గుతుందని తెలిపారు. భూముల కొనుగోలు, అమ్మకాల సమయంలో రీ-సర్వే ద్వారా రూపొందించిన రికార్డులు, పట్టాదారు పాస్ పుస్తకాలను రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం కొత్త యజమాని పేరుపై రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. రైతుల భూములకు ప్రభుత్వమే పూర్తి రక్షణ కల్పించేలా, భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ స్పష్టం చేశారు.

# ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యం.. వినుకొండలో మెగా జాబ్ మేళా

వినుకొండ (చైతన్యరథం): పల్నాడు జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా వినుకొండలో అక్టోబర్ 7న భారీ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ జాబ్ మేళాలో సుమారు 35 ప్రముఖ కంపెనీలు పాల్గొని 2,000కుపైగా ఉద్యోగ అవకాశాలను అందించనున్నాయని చెప్పారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి జాబ్ మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. వివిధ రంగాలకు చెందిన కంపెనీలు నేరుగా అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి అర్హత ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌ఎస్‌సీ నుంచి ఎంబీఏ వరకు.. అందరికీ అవకాశాలు ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు ఒకే వేదికపై పలు కంపెనీలను పరిచయం చేసి, వారి విద్యార్హతలు మరియు నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు పొందేలా జాబ్ మేళా ఉపయోగపడుతుందని జీ.వి. ఆంజనేయులు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# పాదాలకు మట్టి అంటకుండా రోడ్లు వేయిస్తా

## జువ్విగుంట పాలెం ప్రజలకు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అభయం



కావలి (చైతన్యరథం): 'పల్లె పండగ 3.0' కార్యక్రమంలో భాగంగా తాళ్లపాలెం పంచాయతీలో రూ. 1 కోటి వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. "కాలినడకన వెళ్లే మీ పాదాలకు మట్టి అంటకుండా రోడ్లు వేయిస్తా" అని జువ్విగుంట పాలెం ప్రజలకు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అభయమిచ్చారు. 2029 నాటికి గ్రామంలోని అన్ని సర్వీస్ రోడ్లు, సీసీ రోడ్లను పూర్తి చేసి ప్రజల ముఖాల్లో ఆనందం చూస్తానన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో తాళ్లపాలెం చెరువు అభివృద్ధికి రూ. 67 లక్షల నిధుల కేటాయింపు జరిగింది. అరుంధతి పాలెం, హరిజనవాడ నివాసితుల కోరిక మేరకు త్వరలోనే కొత్త బోరు, సీసీ రోడ్లు, స్మశాన వాటికకు స్థలం కేటాయింపు. రూ. 52 కోట్లతో కొండేపి డ్రెయిన్ పనులను త్వరలో ప్రారంభించి మీ కష్టాలను తీరుస్తానని హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి లోకేష్ సహకారంతో నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని వెల్లడించారు. కోటడవి నుండి జువ్విగుంటపాలెం వరకు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి భారీ బైక్ ర్యాలీతో, పూల వర్షంతో గ్రామస్తులు, కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికారు.



# సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి

## చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య

చీరాల (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న డీజిల్ ఆయిల్ సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య కోరారు. చీరాల మండలం బుర్రవారిపాలెం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో వేట వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన హైస్పీడ్ డీజిల్ ఆయిల్ సబ్సిడీ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. వాడరేవు గ్రామంలో 235 మందికి ఈ కార్డులు మంజూరు కాగా, ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా విచ్చేసి కార్డుల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఈ కార్డుల ద్వారా ప్రతి లీటరుకు తొమ్మిది రూపాయలు సబ్సిడీ ప్రభుత్వం ద్వారా లభిస్తుందన్నారు. గరిష్టంగా నెలకు 300లీటర్లకు ఆయిల్ సబ్సిడీ పొందవచ్చని తెలిపారు. వేట వృత్తిని ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సేవలో పథకం ద్వారా ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం వేట విరామ సమయంలో రూ.ఇరవై వేలు ఆర్థిక సహాయం సకాలంలో అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం సద్వినియోగం చేసుకుని వేట వృత్తిపై ఆధారపడిన కుటుంబాల వారు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. తీర ప్రాంత గ్రామాలను సమీకృత మత్స్య సంపద సముదాయంగా అభివృద్ధి చేయటమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారులు రెవిన్యూ అధికారులు కూటమి నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణ మంజూరు పత్రాల పంపిణీ

## పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు



ఒంగోలు (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలో అర్హులైన పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణ పథకానికి ప్రాధాన్యతనిస్తోందని ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రావు తెలిపారు. శనివారం ఒంగోలు నగరంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఒంగోలు నియోజకవర్గ పరిధిలోని మొత్తం 193 మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణ అనుమతి పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఒంగోలు నగర పరిధిలో 153 మంది లబ్ధిదారులకు ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షల చొప్పున ఆర్థిక సహాయంతో గృహ నిర్మాణాలు చేపట్టేందుకు మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కొత్తపట్నం మండల పరిధిలో 40 మంది లబ్ధిదారులకు ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.2.89 లక్షల చొప్పున మంజూరు చేసినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒంగోలు నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు మొత్తం 523 గృహాల నిర్మాణానికి సంబంధించి రూ.14.62 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఇంటి స్థలం ఉండి, సొంతంగా ఇల్లు నిర్మించుకోవాలనే ఆసక్తి ఉన్న అర్హులైన వారు గృహ నిర్మాణ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకొని, సంబంధిత అధికారులను సంప్రదించి అవసరమైన దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, గృహ నిర్మాణ కార్యక్రమాల అమలులో లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మార్కాపురం సుందరీకరణకు సహకరించండి : ఎమ్మెల్యే కందుల పిలుపు



మార్కాపురం (చైతన్యరథం): శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని శివారు ప్రాంతాలైన ఎస్టేట్ డ్రైవర్స్ కాలనీలలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. మార్కాపురం మున్సిపాలిటీకి హ్యామ్ నిధుల ద్వారా మంజూరైన 35 కోట్ల రూపాయలలో భాగంగా శుక్రవారం పట్టణంలోని శివారు ప్రాంతాలైన ఎస్టేట్ డ్రైవర్స్ కాలనీ తదితర ఏరియాలో సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణాన్ని సుందరీకరణలో భాగంగా సీసీ రోడ్లు మొదటగా పూర్తి చేసి అనంతరం సీసీ డ్రైన్లు కూడా ఏర్పాటు చేసి పట్టణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఇప్పటికే మార్కాపురం పట్టణాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించారని, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్ తీర్చిదిద్దుతున్నామని, మార్కాపురం పట్టణంలో త్వరలో ఇంటింటికి పైపులైన్ పూర్తి చేసి ప్రతి ఇంటికి త్రాగునీరు అందిస్తామని అన్నారు. గతంలో వైసీపీ పాలకులు ఈ ప్రాంతాన్ని భూ కబ్జాలకు నిలయంగా, అరాచకలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చారని మంచి సుపారి పాలన అందించే ప్రభుత్వానికి మద్దతు పలకాలని తద్వారా భవిష్యత్తులో మార్కాపురం ప్రాంతాన్ని అభివృద్ధి పదంలో అగ్రభాగాన నిలుపుతానని అన్నారు.



## జగన్ గంజాయి దందాతో రాష్ట్రం అధోగతి

# చంద్రబాబు పాలనలో హార్టీ కల్చర్‌తో అభివృద్ధి

చిత్తూరు (చైతన్యరథం): ఐదేళ్ల జగన్ మోహన్ రెడ్డి తన పదవీకాలంలో రాష్ట్రాన్ని గంజాయి హబ్‌గా, చీప్ లిక్కర్‌అడ్డాగా తయారు చేస్తే మదనపల్లిలో నారా చంద్రబాబునాయుడు రాయలసీమ ని ఒక హార్టీకల్చర్ హబ్‌గా తయారు చేయడానికి శంకుస్థాపన చేయడం గర్వకారణం అని అన్నారు. రాయలసీమను నాలెడ్జ్ హబ్ గాను, ఎలక్ట్రానిక్ హబ్ గాను, మెడికల్ హబ్ గాను, తయారుచేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన చేసి రాయలసీమను ఒక హార్టీకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నందుకు రాయలసీమ రైతాంగం గర్వంతో తలెత్తుకుంటోందన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఏ పండు కనిపించినా ఇది రాయలసీమ రైతుల పండించిన పండుగ చెప్పుకునే విధంగా రాయలసీమను తీర్చిదిద్దబోతున్నారని అన్నారు. లక్షలాదిమంది రైతాంగానికి అండగా నిలవబోతుందని అన్నారు. దాదాపుగా 14 లక్షల హెక్టార్లలో ఉద్యాన సాగు చేసి ప్రపంచాన్ని ఆంధ్ర రాష్ట్రం వైపు చూసే విధంగా చేయబోతున్నారని గర్వంగా చెప్పారు. అరటి నుండి అవకాడో వరకు. స్ట్రాబెరీ నుండి ఆపిల్ వరకు. కివీ నుండి ఖర్జూరం వరకు 20 రకాల పండ్లను తయారుచేసి ప్రపంచంలో రాయలసీమ రైతుల చాటబోతున్నారని అన్నారు. ఈ హార్టికల్చర్ హబ్‌కు సహకార అందించిన కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ కి రిలయన్స్ అధినేత అనంత అంబానీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, నారా లోకేష్‌కు, రాయలసీమ రైతాంగం పక్షాన ముఖ్యంగా చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ పక్షాన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ టీడీపీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి ధరణి ప్రకాష్, టీడీపీ నాయకుడు కార్తీక్, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పెనుకొండ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

## పెద్దకొనేటి నాయకుడి విగ్రహావిష్కరణలో మంత్రి సవిత వెల్లడి



పెనుకొండ (చైతన్యరథం): పెనుకొండ ఆర్చ్ వద్ద జియో మెగా పాల్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీజేవీపీఎస్ సహకారంతో ఏర్పాటు చేసిన రాజరాజశ్రీ రాయుదలవాయి పెద్దకొనేటి నాయకుడి విగ్రహాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, పెనుకొండ ప్రాంతానికి చివరి పరిపాలకుడిగా పెద్దకొనేటి నాయకుడు అందించిన సేవలు, ఆయన చరిత్ర, ప్రజలతో ఉన్న అనుబంధం చిరస్మరణీయమని అన్నారు. పెనుకొండ చారిత్రక వైభవంలో పెద్దకొనేటి నాయకుడి పాత్ర ప్రత్యేకమైనదని, ఆయన సేవలను భావితరాలకు పరిచయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చారిత్రక ప్రముఖుల స్ఫూర్తిని నేటి తరాలకు అందించేందుకు వారి విగ్రహాలను ఏర్పాటు చేయడం ఎంతో ముఖ్యమన్నారు. పెనుకొండకు ఉన్న చారిత్రక ప్రాధాన్యతను కాపాడుతూ, పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. పెద్దకొనేటి నాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన జియో మెగా పాల్యం ఫౌండేషన్ నిర్వాహకులను మంత్రి సవిత అభినందించారు. చారిత్రక వారసత్వాన్ని కాపాడేందుకు ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు దీజీవూా కమిటీ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# కరువు మండలంగా రాయదుర్గం

## ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రతిపాదన

రాయదుర్గం (చైతన్యరథం): మండలంలో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కరవు మండలంగా ప్రకటించేలా ప్రభుత్వానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సాల్‌రెడ్డిని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదేశించారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం వ్యవసాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.

రాయదుర్గం నియోజకవర్గంలోని పంటల పరిస్థితి, వర్షపాతం, కరువు స్థితిగతులపై అధికారులతో చర్చించారు. రాయదుర్గం మండలంలో జూన్ 1 నుంచి సెప్టెంబర్ చివరి వరకు సాధారణంగా 311.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఈ ఏడాది కేవలం 144.4 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసిందన్నారు. సాధారణ వర్షపాతంతో పోలిస్తే సుమారు 53 శాతం లోటు నమోదైందన్నారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 20 వరకు వర్షపు చినుకు కూడా పడకపోవడంతో పంటలపై తీవ్ర ప్రభావం పడిందని పేర్కొన్నారు. రాయదుర్గం మండలంలో నెలకొన్న వాస్తవ పరిస్థితులు, వర్షపాతం లోటు, పంటల పరిస్థితిని సమగ్రంగా వివరిస్తూ ప్రభుత్వానికి తాజా ప్రతిపాదనలు పంపాలని కోరారు. అవసరమైతే ఈ అంశాన్ని ఉన్నతస్థాయిలో తాను పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు రాయదుర్గం మండలంలోని వర్షపాతం, పంటల పరిస్థితి తదితర వివరాలతో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు తాజా ప్రతిపాదనలు పంపుతామని జాయింట్ డైరెక్టర్ సాల్‌రెడ్డి తెలిపారు.

# స్థానిక ఎన్నికల్లో సమష్టిగా పని చేయాలి

## కౌకుంట్లలో టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి పయ్యావుల పిలుపు




ఉరవకొండ (చైతన్యరథం): ఉరవకొండ మండలం కౌకుంట్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తోపాటు జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని సూచించారు. కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యకర్తలు ఎవరూ అవస్థావలను నమ్మకుండా ప్రజల్లో ఉంటూ పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామానికి రోడ్లు నిర్మించామని, హంద్రీనీవా కాలువ వెడల్పు పనులతో రాయలసీమలో ఎంతోమంది రైతులకు ప్రయోజనం కలిగిందని తెలిపారు. ప్రతి ఎకరాకు నీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

# సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కళ్యాణ్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు : జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత

ప్రొద్దుటూరు/కడప : ప్రొద్దుటూరులో ంరూ.30 వేల కోట్ల జల జీవన్ మిషన్ నిధులతో తాగునీటి కల్పన ప్రాజెక్టును ఈ నెల 5వ తేదీన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నామని జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ కార్యక్రమానికి కడప జిల్లాలో ఉన్న అన్ని నియోజక వర్గాల నుంచి లక్ష మందికిపైగా ప్రజలు తరలొస్తున్నారన్నారన్నారు. సీఎం,డిప్యూట సీఎం రాక నేపథ్యంలో భారీ సంఖ్యలో ప్రజలు తరలొస్తుండడడంతో పటిష్ట బందోబస్తు చేపడుతున్నామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రొద్దుటూరులో జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ సహా సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సీఎంచంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం విస్తృతంగా చేపడుతోందన్నారు. రాయలసీమలో పెద్ద ఎత్తున సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. రెండ్రోజుల కిందట రూ.లక్ష కోట్లతో హార్టీకల్చర్ హబ్ కు శ్రీకారం చుట్టామని మంత్రి సవిత గుర్తిచేశారు. పల్లెపండుగ 3.0 పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున రహదారులు నిర్మిస్తున్నామన్నారు. ప్రొద్దుటూరులో తాగునీటి కల్పనకు రూ.30 వేల కోట్ల జలజీవన్ మిషన్ నిధులు వెచ్చించనున్నామన్నారు. ఈ ప్రాజెక్టుకు ఈ నెల 5వ తేదీన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేయనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, పలువురు మంత్రులు పాల్గొనబోతున్నట్లు మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత నేతృత్వంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏర్పాట్లను మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి,కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, లక్షకు పైగా ప్రజల వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో మార్గమధ్యంలో తాగునీటి ట్యాంకులు, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. సభా ప్రాంగణంలో చల్లని గాలి వీచేలా కూలర్లు ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటనను విజయవంతం చేయాలని అధికారులకు మంత్రి సవిత సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.




# కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలి




ఉరవకొండ (చైతన్యరథం): నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం కౌకుంట్ల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జోనల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థులు వందకు వందశాతం విజయాన్ని సాధించేలా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలన్నారు. గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కూటమి ప్రభుత్వ విధానాలను, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, ప్రతి కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పూల నాగరాజు సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేసుకుని ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఆయన కోరారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రతి గ్రామంలో కూటమి అభ్యర్థులకు పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఎన్నికలకు సంబంధించి పార్టీ శ్రేణులు అనుసరించాల్సిన కార్యాచరణ, గ్రామస్థాయిలో సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఐక్యంగా ముందుకు సాగాలని నాయకులు, కార్యకర్తలకు పూల నాగరాజు పిలుపునిచ్చారు.




### 17న న్యూజెర్సీ వేదికగా

## ఆంధ్రా వర్సిటీ అలుమ్ని సమావేశాలు

అమెరికా: ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు అమెరికాలో అలుమ్ని సమావేశాలు నిర్వహించనున్నారు. ఆలుమ్ని అసోసియేషన్ నార్త్ అమెరికా, మరికొన్ని అసోసియేషన్స్ కలిసి నార్త్ అమెరికా న్యూజెర్సీలోని ఫోర్డ్స్‌లో ఉన్న రాయల్ ఆల్బర్ట్స్ ప్యాలెస్‌లో అక్టోబరు 17న శనివారం ఉదయం 9:00 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకూ ఈ శతాబ్ది ఉత్సవాలు జరుగుతాయని ఆంధ్ర యూనివర్సిటీ రీయూనియన్ బాధ్యులు ప్రకటించారు. చీఫ్ గెస్ట్‌గా ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.పి. రాజశేఖర్ హాజరవుతున్నారు. చారిత్రాత్మకమైన మైలురాయిని స్మరించుకోవడానికి ఉత్తర అమెరికా వ్యాప్తంగా ఉన్న ఏయూ పూర్వ విద్యార్థుల సహకారంతో ఏయూ అలూమ్ని న్యూజెర్సీ నిర్వహిస్తున్న ఆంధ్రా విశ్వవిద్యాలయ శతాబ్ది ఉత్సవాలలో పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. పూర్వ విద్యార్థులందరూ ఇందులో పాల్గొనాలని కోరుతున్నారు. తమతో పాటు చదువుకున్న స్నేహితులు కలుసుకోవడానికి, అప్పటి మధురమైన జ్ఞాపకాలు నెమరువేసుకోవడానికి ఈ ఈవెంట్ ఉపయోగపడుతుంది. చదువు బోధించిన ఉపాధ్యాయులు, మన స్నేహితులతో తిరిగి కనెక్ట్ అయ్యే అవకాశం కూడా దీని ద్వారా లభిస్తుంది. మరిన్ని వివరాల కోసం ప్రసాద్ తాత +1(314) 482-3465, కిశోర్ దుర్గా +1(609)240-3770, శ్రీని పరుచూరి +1(609)721-3336, సుబ్బారావు సన్నిధి +1(732)668-4325, వెంకట సత్య తాత +1(973)985-3409, మధు రాచకుల్ల +1(201)312-1305, రవి అన్నదానం +1(917)355-5503 సంప్రదించవచ్చు.

## 11న నార్త్ కరోలినాలో బతుకమ్మ వేడుకలు

అమెరికా: నార్త్ కరోలినా వేదికగా తెలంగాణ సంప్రదాయాలను ప్రతిబింబించేలా 'తెలంగాణ అమెరికా తెలుగు సంఘం'(టీటీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 11న ఆదివారం బతుకమ్మ సంబరాలు అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. నార్త్ కరోలినాలోని మాథ్యూస్ ప్రాంతంలో ఉన్న ఐడల్ వైల్డ్ రోడ్ చిరునామాలోని ప్రాంగణం ఈ వేడుకకు వేదికగా మధ్యాహ్నం 3:00 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. "మా బతుకమ్మ.. మా తెలంగాణ గౌరమ్మ" నినాదంతో ప్రవాస తెలుగు కమ్యూనిటీని ఒక తాటిపైకి తీసుకువచ్చేలా ఈ వేడుకలను ఏర్పాటు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదయాలు, ఆచార వ్యవహారాలను భావితరాలకు చాటిచెప్పే ఈ ప్రత్యేక కార్యక్రమంలో తెలుగు ప్రజలు అందరూ పెద్దఎత్తున పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ వేడుకలకు వచ్చే వారికి ఎలాంటి ప్రవేశ రుసుము లేదని, ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సంబరాలలో భాగంగా తెలంగా ణ సంస్కృతి ఉట్టిపడేలా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ ఆడనున్నారు. ప్రత్యేక అతిథులు బెస్ట్ బతుకమ్మ అవార్డ్స్ అందజేయనున్నారు.




### నిర్వాహక కార్యవర్గ వివరాలు

ఈ వేడుకలను విజయవంతం చేయడానికి టీటీఏ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి మలిపెద్ది, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ గణేష్ వీరమనేని, జనరల్ సెక్రటరీ శివ రెడ్డి కొల్లా, ట్రెజరర్ సహోధర్ పెద్దిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కవితా రెడ్డి తది తరుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. వీరితో పాటు జాయింట్ సెక్రటరీ నిశాంత్, హెల్త్ అండ్ వెల్‌నెస్ అడ్వైజర్ శ్రీకాంత్ గాలి, బోర్డు ఆఫ్ డైరెక్టర్లు అభిలాష్ ముదిరెడ్డి, నరేంద్ర దేవరపల్లి, ఉమెన్స్ ఫోరమ్ అడ్వైజర్ పల్లవి రెడ్డి రామిడి తదితరులు ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తున్నారు. కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి అందరూ వచ్చి మన సంప్రదాయాన్ని ఘనంగా జరుపుకోవాలని నిర్వాహకులు కోరారు.

## 18న వాషింగ్టన్ డీసీ చాప్టర్ ఆధ్వర్యంలో మెగా బతుకమ్మ, దసరా సంబరాలు




అమెరికా: గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ వాషింగ్టన్ డీసీ చాప్టర్ మెగా బతుకమ్మ, దసరా సంబరాలు ఘనంగా నిర్వహించేందుకు రెడీ అవుతోంది. ఈ నెల 18వ తేదీన మధ్యాహ్నం 12:00 గంటల నుంచి రాత్రి 7:00 గంటల వరకూ ఈ సంబరాలు జరగ నున్నాయి. ఈ వేడుకలు ఇండిపెండెన్స్ హైస్కూల్, లెర్నింగ్ సీఐఆర్, ఆష్‌బర్న్ వీఏలో జరుగుతాయి. ఇక ఈ సంబరాలకు ఎంట్రీ ఉచితం, లంచ్ కూడా ఫ్రీ గానే ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సంబరాల్లో పాల్గొనాలని అనుకునే వారు Register @WWW. gtadcbathu kamma.comను ఫాలో కావచ్చు.

# ఖతార్‌లో గాంధీ జయంతి వేడుకలు

◆తెలుగు సంఘాల ఐక్య ఆధ్వర్యంలో నిర్వహణ ◆ తెలుగు కుటుంబాలకు మెడికల్ క్యాంప్ ◆ 170 మందికి పైగా ఉచిత వైద్యసేవలు



దోహా, ఖతార్: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ ప్రజా సమితి, ఆంధ్ర కళా వేదిక, తెలుగు డయాస్పోరా ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ సహకారంతో ఖతార్‌లోని తెలుగు కుటుంబాల కోసం ఉచిత కమ్యూనిటీ మెడికల్ హెల్త్ అవేర్‌నెస్ క్యాంప్ నిర్వహించారు. తెలుగు సమాజ ఆరోగ్యం, వ్యాధులపై అవగాహన, ముందస్తు గుర్తింపు, ఆరోగ్యకరమైన జీవన శైలిపై అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా నిర్వహించిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 170 మంది తెలుగు కుటుంబసభ్యులు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. భారత రాయబార కార్యాలయానికి చెందిన డాక్టర్ వైభవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మూడు తెలుగు సంఘాలు కలిసి కమ్యూనిటీ ఆరోగ్యం కోసం చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను అందరూ కలిసి నిర్వహించడం ద్వారా మరింత మంది కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. మహాత్మా గాంధీ చూపిన సేవ, మానవతా విలువలు, సమాజం పట్ల బాధ్యతను స్ఫూర్తిగా తీసుకుని కార్యక్రమాలను నిర్వహించడం గాంధీ జయంతికి అర్థవంతమైన నివాళి అని పేర్కొన్నారు. ఇండియన్ కల్చరల్ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ శాంత కార్యక్రమానికి హాజరై నిర్వాహకులను అభినందించారు. ఇటువంటి ప్రజోపయోగ కార్యక్రమాలకు ఇండియన్ కల్చరల్ సెంటర్ సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం మూడు తెలుగు సంఘాల ప్రతినిధులు కలిసి శ్రీశాంత, డాక్టర్ వైభవ్‌ను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా సమితి అధ్యక్షుడు గద్దె శ్రీనివాస్‌రావు, ఆంధ్ర కళా వేదిక అధ్యక్షుడు గొట్టిపాటి రమణయ్య మాట్లాడుతూ ఉచిత మెడికల్ క్యాంప్ విజయవంతం కావడంపై ఆనందం వ్యక్తం చేశారు. తెలుగు డయాస్పోరా ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీశాంతను యలమంచిలి మాట్లాడుతూ తెలుగు సంఘాల ఐక్యతకు ఈ కార్యక్రమం ఒక చక్కటి నిదర్శనమని అన్నారు. సమాజానికి అవసరమైన సమయంలో వివిధ సంస్థలు ఒకే లక్ష్యంతో కలిసి పనిచేయడం సంతోషకరమని, ఈ ఐక్యతను కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి భారత రాయబార కార్యాలయ అధికారులు, ఇండియన్ కమ్యూనిటీ బెనెవోలెంట్ ఫోరమ్, ఇండియన్ కల్చరల్ సెంటర్, ఇండియన్ స్పోర్ట్స్ కమ్యూనిటీ ప్రతినిధులు, వివిధ తెలుగు సంఘాల నాయకులు, కమ్యూనిటీ పెద్దలు హాజరై నిర్వాహకులను అభినందించారు.











### వాషింగ్టన్ తెలుగు సమితి ఆధ్వర్యంలో

## సియాటిల్‌లో గాంధీజీకి ఘన నివాళి

అమెరికా: సియాటిల్ ప్రాంతంలోని భారతీయ-అమెరికన్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి, అంతర్జాతీయ అహింసా దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించుకున్నారు. వాషింగ్టన్ తెలుగు సమితి తరపున సియాటిల్‌లోని భారత కాన్సులేట్ జనరల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. శాంతి, అహింస, ఐక్యత, సేవాభావం అనే విలువలతో కమ్యూనిటీని ఒక తాటిపైకి తీసుకురావడంలో కాన్సులేట్ అందిస్తున్న మద్దతు ఎంతో కీలకమని పేర్కొన్నారు. వాషింగ్టన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అమెరికన్ అసోసియేషన్స్, వాషింగ్టన్ తెలుగు సమితి, ఇండియా కమ్యూనిటీ అండ్ కల్చరల్ సెంటర్, అనేక ఇతర భారతీయ-అమెరికన్ సంస్థలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో కృషి చేసిన లావణ్యరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ వేడుకలో పాల్గొన్న అన్ని భారతీయ సంఘాలు, కమ్యూనిటీ నాయకులు, వాలంటీర్లు, కుటుంబసభ్యులకు నిర్వాహకులు అభినందనలు తెలిపారు. శాంతి, సత్యం, అహింస, కరుణ, సేవాభావం గురించి మహాత్మా గాంధీ అందించిన సందేశం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని వక్తలు పేర్కొన్నారు. ఒక కమ్యూనిటీగా ఈ విలువలను మనం ముందుకు తీసుకెళ్తూ మన పిల్లలకు, భావితరాలకు అందించాలని ఆకాంక్షించారు.

### తానా పాఠశాల వేదికగా

## జాతిపితకి నివాళి

అమెరికా: అమెరికా రాజధాని పరిధిలో తానా పాఠశాల ఆధ్వర్యంలో భారత జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని స్వర్గీయ లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ప్రవాస భారతీయులు నివాళులర్పించారు. శతాబ్దాల బానిస సంకెళ్లు తెంచి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వంతో పాటు జన జాగృతి కోసం, జాతి చైతన్యానికి జీవితాన్ని అంకితం చేసిన మహనీయులను గుర్తు చేసుకు న్నారు. మన మాతృభాషను కాపాడుకోవటం మనందరి విధి అని సమన్వయకర్త భానుప్రకాష్ మాగులూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయులు పాల్గొన్నారు.






# చినాబ్ బ్రిడ్జిపై వందేభారత్ రికార్డు

## గంటకు వంద కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లిన రైలు



జమ్మూకశ్మీర్‌లోని చినాబ్ నదిపై నిర్మించిన, ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన బ్రిడ్జిపై వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పరుగులు పెట్టింది. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో బ్రిడ్జిని దాటింది. శ్రీమాత వైష్ణోదేవి కత్రా–బనిహాల్ సెక్షన్‌లో నిర్మించిన ఈ బ్రిడ్జిపై గురువారం వందే భారత్ రైలును నార్దర్న్ రైల్వే విజయవంతంగా పరీక్షించింది. దీంతో ఉదంపూర్, శ్రీనగర్, బారాముల్లా లింక్ (యూఎస్‌బీఆర్‌ఎల్) ప్రాజెక్టులో మైలురాయిని సాధించినట్లయింది. శ్రీమాత వైష్ణోదేవి కత్రా బనిహాల్ సెక్షన్‌లో రైలు వేగం గంటకు ఇంతకుముందు 75 కిలోమీటర్లు ఉండగా దానిని 111 కిలోమీటర్లకు పెంచామని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఉచిత్ సింఘాల్ తెలిపారు. దేశంలోనే మొదటి కేబుల్ బ్రిడ్జి, ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన చినాబ్ బ్రిడ్జిని దాటడం ద్వారా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్ 26401/26404) రికార్డు సాధించిందని సింఘాల్ చెప్పారు. కాగా.. యూఎస్‌బీఆర్‌ఎల్ ప్రాజెక్టులో 111 కిలోమీటర్ల కత్రా, బనిహాల్ సెక్షన్ చాలా కీలకమైనది. కశ్మీర్ లోయ, దేశంలోని మిగతా ప్రాంతాల మధ్య నిరంతర రైలు కనెక్టివిటీని అందించేందుకు ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. శ్రీమాత వైష్ణోదేవి కత్రా బనిహాల్ సెక్షన్‌లో రైలు వేగాన్ని గంటకు 100 కిలోమీటర్లకు పెంచారు. నిరుడు ఆగస్టులో రైల్వే శాఖ అధికారులు ఆ మార్గాన్ని పరిశీలించి రైలు గరిష్ట వేగాన్ని 100 కిలోమీటర్లుగా నిర్ధారించారు. ఆ మేరకు అనుమతి ఇవ్వాలంటూ రైల్వే అధికారులు ఇచ్చిన రిపోర్టు ఆధారంగా కేంద్రం ఆమోదం తెలిపింది. అంతకుముందు ఈ సెక్షన్‌లోనూ రైళ్లు గరిష్టంగా గంటకు 75 కిలోమీటర్ల వేగంతో వెళ్లడానికి అనుమతించారు. ఇప్పుడు వేగ పరిమితిని గంటకు 100 కిలోమీటర్లకు పెంచడంతో ప్రయాణికులు తక్కువ సమయంలోనే తమ గమ్యస్థానానికి చేరేందుకు వీలవుతుంది. కాగా రియాసీ, అంజి ఖాద్ రైల్వే బ్రిడ్జి వద్ద చినాబ్ నదిపై ఆ కేబుల్ బ్రిడ్జిని నిర్మించారు. ఇక ఈ సెక్షన్‌లో 33 సొరంగాలు ఉన్నాయి. నిరుడు జూన్ 6న కత్రా శ్రీనగర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను శ్రీమాత వైష్ణోదేవి కత్రా నుంచి ప్రధాని నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించారు.





# ఆయన తెగువ, చొరవ వైమానిక రంగానికి గొప్పవరం

## కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ప్రశంసలు

ఢిల్లీలో జరుగుతున్న 94వ వైమానిక దళ దినోత్సవం సందర్భంగా భారత వైమానిక దళ చీఫ్.. ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, క్యాప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇటీవల దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో కో–పైలట్ జరిపిన ఉగ్రదాడిలో తీవ్రంగా గాయపడినప్పటికీ, పైలట్ స్మిత్ మచ్చర్ చూపిన శారీరక, మానసిక ధైర్యం ఏవియేషన్ రంగానికి ఓ గొప్ప పాఠమని ఏపీ సింగ్ పేర్కొన్నారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో

# ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మరో యువతి హల్‌చల్



## నిరసనకారులను తరలిస్తున్న బస్సును అడ్డుకుని సంచలనం



ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో ఓ యువతి చేసిన ప్రయత్నం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అదుపులోకి తీసుకున్న నిరసనకారులను తరలిస్తున్న పోలీసు బస్సుకు యువతి ఎదురుగా నిలబడి, ముందుకు వెళ్లకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించింది. నిరసనకారులను విడుదల చేసే వరకూ బస్సును కదలనివ్వబోనన్నట్లుగా ఆమె అక్కడే నిలబడిన దృశ్యాలు వీడియోల్లో కనిపించాయి. ఈ ఘటనతో సోషల్ మీడియాలో ఆమెను ముంబై నిరసనల్లో పోలీసు వాహనాన్ని అడ్డుకుని వైరల్ అయిన మోడల్ రియా అహిర్‌తో పోలుస్తూ పలువురు పోస్టులు చేశారు. సీఈసీ రాజీనామా.. ఎస్ఐఆర్ ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ శుక్రవారం జంతర్‌మంతర్ వద్ద నిరసనలు జరిగాయి. ఈ సందర్భంగా ఢిల్లీ పోలీసులు 500 మందికి పైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నట్లు నివేదికలు వెల్లడించాయి. వారిలో ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్, మాజీ ఢిల్లీ సీఎం అతిషి, ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరా తదితరులు ఉన్నారు. ఇదే సమయంలో బస్సును అడ్డుకున్న యువతి వీడియో వైరల్ కావడంతో నెటిజన్లలో భిన్న స్పందనలు వ్యక్తమయ్యాయి. కొందరు ఆమె చర్యను నిరసనలో భాగంగా పేర్కొనగా, మరికొందరు దీనిని ప్రచారం కోసం చేసిన ప్రయత్నంగా అభివర్ణించారు.

# సత్యాగ్రహ నూతన డిజిటల్ వేదిక ప్రారంభం

దేశంలో వివిధ సమస్యలపై ఒంటరిగా పోరాడుతున్న ప్రజల గొంతుకలను ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శనివారం 'సత్యాగ్రహ అనే నూతన డిజిటల్ వేదికను ప్రారంభించారు. మహాత్మా గాంధీ 157వ జయంతి ముగిసిన మరుసటి రోజే, ఆయన అహింసాత్మక పోరాట సిద్ధాంతం స్ఫూర్తితో రూపొందించిన ఈ ప్లాట్‌ఫారమ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.





# అది నకిలీ గాయం

## పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి సంచలన ఆరోపణలు

తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి 2021లో తగిలిన గాయం నకిలీదంటూ పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి సంచలన ఆరోపణలు చేశారు. "ఆమె గాయానికి సంబంధించిన ఎక్స్‌రే రిపోర్ట్స్ నా దగ్గర ఉన్నాయి. ఆ రిపోర్ట్‌లో 'ఫ్రాక్చర్ లేదు' అని స్పష్టంగా ఉంది" అని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం నందిగ్రామ్‌లో బీజేపీ అభ్యర్థి హసిరాణి తరపున ప్రచారం చేస్తున్న సమయంలో సువేందు అధికారి ఈ వ్యాఖ్యలు చేశారు.

2021 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమత గాయపడిన ఘటనను ఆయన గుర్తుచేశారు. కార్ డోర్‌లో కాలు ఇరుక్కుపోయి ఆమెకు స్వల్ప గాయమైందని అన్నారు. అయితే ఆ చిన్న గాయాన్ని మమత పెద్దది చేసి చూపించారని ఆరోపించారు. 2021, మార్చి 10న నందిగ్రామ్‌లో ఎన్నికల ప్రచారం చేస్తూ మమతా బెనర్జీ గాయపడ్డారు. తోపులాట కారణంగా తన కాలు కారు తలుపులో ఇరుక్కుపోయిందని ఆమె తెలిపారు. అనంతరం మమతను అధికారులు ఎస్ఎస్‌కేఎమ్ అనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు.. ఆమెకు తీవ్రగాయాలయ్యాయని అప్పట్లో వెల్లడించారు. తరువాత డిశ్చార్జ్ అయిన మమతా బెనర్జీ వీల్‌చైర్‌లోనే ఎన్నికల ప్రచారం కొనసాగించారు. కాగా ఎస్ఎస్‌కేఎమ్ ఆసుపత్రికి వెళ్లి మమత గాయాల రిపోర్ట్ చూశానని, అందులో డాక్టర్లు 'ఫ్రాక్చర్ లేదు' అని రాశారని సీఎం సువేందు అధికారి ప్రస్తుతం ఆరోపిస్తున్నారు.

# స్టాలిన్‌వి అనాగరిక వ్యాఖ్యలు



తమిళనాడు ధారాపురం ఉప ఎన్నికల ప్రచారం వేళ అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే మధ్య మాటల యుద్ధం ముదిరింది. టీవీకే అభ్యర్థి సత్యభామపై డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధ్యక్షుడు విజయ్ తీవ్రంగా ఖండించారు. స్టాలిన్ వ్యాఖ్యలు అసభ్యకరంగా, అవమానకరంగా ఉన్నాయని విజయ్ విమర్శించారు. ధారాపురం ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న స్టాలిన్.. టీవీకే అభ్యర్థి సత్యభామపై విమర్శలు చేశారు. ఆమె గతంలో అన్నాడీఎంకే తరపున ధారాపురం నుంచి గెలిచి, ఆ తర్వాత

## విరుచుకుపడిన సీఎం విజయ్

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి టీవీకేలో చేరడాన్ని స్టాలిన్ తప్పుపట్టారు. ఈ క్రమంలో సత్యభామను 'సూట్‌కేస్ భామ', 'సోమర్‌సాల్ట్ భామ' అంటూ ఎద్దేవా చేశారు. ఆమె శరీరాకృతిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై టీవీకే నేతలు తీవ్రంగా మండిపడ్డారు. స్టాలిన్ వ్యాఖ్యలపై విజయ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. మహిళలను కించపరిచేలా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదని విజయ్ పేర్కొన్నారు. ధారాపురం ఉప ఎన్నికల ప్రచార సభలో స్టాలిన్ అనాగరిక వ్యాఖ్యలు చేశారని విజయ్ ఆరోపించారు. సత్యభామను ఎగతాళి చేస్తూ, ఆమె పట్ల అవమానకరంగా మాట్లాడారని విమర్శించారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం డీఎంకే నేతలకు బాగా అలవాటైందని ఆరోపించారు. తమిళనాడు ప్రజలు, ముఖ్యంగా ధారాపురం ఓటర్లు ఎన్నికల్లో డీఎంకేకు తగిన సమాధానం చెబుతారని అన్నారు.



# కో-పైలెట్‌పై గతంలోనే నిషేధం!

## ఫ్లైదుబాయ్ ఘటనలో కీలక విషయాలు




ఫ్లైదుబాయ్ విమానంలో జరిగిన హింసాత్మక ఘటనకు సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. విమానంలో భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై దాడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కో-పైలట్ హమామ్ అల్ హమామీ.. విమానాలు నడపకుండా ఒమన్ ప్రభుత్వం గతంలోనే నిషేధం విధించినట్లు నివేదికలు వెలువడుతున్నాయి. తీవ్రవాద భావజాలం కలిగి ఉన్నాడన్న కారణంగా అతడిపై ఈ చర్యలు తీసుకున్నట్టు సమాచారం. ఇక అలామామీ.. ఫ్లైదుబాయ్ విమానాన్ని ఇజ్రాయెల్‌లో కూల్చి వేయాలనే ఉద్దేశంతోనే ఈ దాడి చేసినట్టు కూడా నివేదికలు పేర్కొన్నాయి. ఒమన్ దేశస్థుడైన హమామ్ అల్ హమామీ.. 2024లో ఆ దేశ జాతీయ విమానయాన సంస్థ అయిన ఒమన్ ఎయిర్‌లో కో-పైలట్ ట్రైనీగా పనిచేశాడు. ఆ సమయంలో అతడి ప్రవర్తనపై పలుమార్లు ఫిర్యాదులు రావడంతో భద్రతా అధికారులు అతడు విమానాలు నడపకుండా నిషేధం విధించినట్టు సదరు కథనాలు పేర్కొన్నాయి. అయితే, సంస్థలోని అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో అతడిని కొనసాగించినట్టు తెలుస్తోంది. కాగా.. అతడు కొంతకాలం సిరియాలో కూడా ఉన్నట్టు సమాచారం. ఆ సమయంలోనే తీవ్రవాద భావజాలానికి ఆకర్షితుడై ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, అతడు ఏదైనా తీవ్రవాద సంస్థతో ప్రత్యక్షంగా సంబంధం కలిగి ఉన్నాడా? అనే విషయం ఇప్పటివరకు నిర్ధరణ కాలేదు. ఒమన్‌లో విమానాలు నడపకుండా నిషేధఉన్నప్పటికీ.. అల్హమామీ ఇతర దేశాల్లోని విమానయాన సంస్థల్లో పనిచేసినట్లు తెలుస్తోంది. అతడి పేరుతో ఉన్న లింక్‌ఇన్ ప్రొఫైల్ ప్రకారం.. ఒమన్ ఎయిర్‌లో సుమారు ఏడేళ్లు పనిచేసిన అలామామీ.. 2025 ఫిబ్రవరిలో ఆసంస్థను వీడాడు. అదే ఏడాది జూన్‌లో మొరాకో జాతీయ విమానయాన సంస్థ రాయల్ ఎయిర్ మారోక్‌లో చేరాడు. 2026 జనవరిలో అక్కడ ఉద్యోగం మానేసి.. ఫ్లైదుబాయ్‌లో చేరినట్లు తెలిసింది. అయితే.. ఈ ప్రమాదం జరిగిన అనంతరం ఆ లింక్డ్ ఇన్ ఖాతా డిలీట్ అవడం గమనార్హం. అలామామీకి చెందినవిగా భావిస్తున్న సోషల్ మీడియా ఖాతాల్లోనూ కొన్ని అనుమానాస్పద అంశాలు ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. బోయింగ్ 737 మ్యాక్స్ కాక్ పిట్ నుంచి తీసిన వీడియోలు, ఇజ్రాయెల్ విమానాలకు సంబంధించిన దృశ్యాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఇవన్నీ చూస్తుంటే అతడు ఉద్దేశపూర్వకంగానే దాడి చేసినట్టు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

### క్రాష్ యాక్స్‌తోనే దాడి: యూఏఈ

ఇదిలా ఉండగా.. కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై క్రాష్ యాక్స్‌తోనే కోపైలట్ దాడికి పాల్పడ్డాడని యూఏఈ ప్రాసిక్యూటర్ జనరల్ ధ్రువీకరించారు. కాక్‌పిట్‌లో యాక్స్‌తో దాడి చేసి, విమానాన్ని తన నియంత్రణలోకి తీసుకోవాలని నిందితుడు యత్నించినట్టు చెప్పారు. ఘటన జరిగిన తీరు, కుట్రకోణాలను నిర్ధరించే దిశగా దర్యాప్తు జరుగుతోందని వెల్లడించారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో తలుపులు జామ్ అయినప్పుడు.. అత్యవసర మార్గం ఏర్పాటు చేసేందుకు ఈ క్రాష్ యాక్సును వాణిజ్య విమానాల్లోని కాక్‌పిట్‌లో ఉంచడం సాధారణమే.

# మస్క్.. షాక్ బ్రేకప్!

## కష్టమే.. కానీ కొన్ని పరిస్థితులు ఇలానే ఉంటాయి: శివోన్





టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ వ్యక్తిగత బంధం మరోసారి వార్తల్లో నిలిచింది. ప్రస్తుత భాగస్వామి శివోన్ జిలిస్ నుంచి ఆయన విడిపోయారు. ఎలాంటి కారణం చెప్పకుండా, బ్రేకప్ గురించి ముందుగా ఎలాంటి చర్చలేకుండా మస్క్ తనతో బంధాన్ని ముగించారని శివోన్ పేర్కొన్నారు. ఈమేరకు ఆమె సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ చర్చనీయాంశమైంది. "ముందుగా ఎలాంటి చర్చ లేకుండా వారం రోజుల్లోనే ప్రేమలోనుంచి బయటకు వచ్చేయడం ఎంతో కష్టం. కానీ కొన్ని పరిస్థితులు ఇలాగే ఉంటాయి. ఎంతో బాధగా ఉంది. జు (ఎలాన్ మస్క్‌ను ఉద్దేశిస్తూ) అంటే నాకు చాలా ఇష్టం. ఎన్నో జన్మలకు సరిపడా జ్ఞానాన్ని నేర్పించి, నా జీవితానికి ఒక అర్థాన్నిచ్చారు. ఎలాన్ సంతోషాన్ని నేను ఎల్లప్పుడూ కోరుకుంటాను. ఈ ప్రపంచానికి ఆయన ఒక వరం. బయట ఎన్నో ఒత్తిళ్లు ఎదుర్కొన్నా.. ఇంట్లో ఆయన ప్రశాంతంగా ఉండేలా నేను, మా పిల్లలు చూసుకున్నాం. ఈ బంధం నుంచి దూరంగా కావడం నాకు లోటే. మేం మంచి స్నేహితులుగా ఉండి, పిల్లలకు తోడుగా ఉంటామని ఆశిస్తున్నాను" అంటూ శివోన్ తమ బ్రేకప్ గురించి వెల్లడించారు.

యేల్ యూనివర్సిటీలో విద్యనభ్యసించిన శివోన్ జిలిస్.. ఓపెన్ ఏఐలో పనిచేసిన సమయంలో మస్క్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. తర్వాత వీరు సహజీవనం కొనసాగించారు. 2017లో మస్క్ ఆధ్వర్యంలోని న్యూరాలింక్ ప్రాజెక్టులో ఆమె చేరారు. ఆ ప్రాజెక్టు కింద మానవ మెదడులో ఎలక్ట్రానిక్ చిప్పును అమర్చే ప్రయోగాలు చేస్తున్నారు. ఆ సంస్థలో ఆమెది డైరెక్టర్ హోదా.

కెనడాలో పెరిగిన శివోను భారతీయ మూలాలున్నాయి. ఆమె తల్లి పంజాబీ. మస్క్-శివోనుకు నలుగురు సంతానం. 2021 నవంబర్‌లో ఐవీఎఫ్ ద్వారా ఆమె కవల పిల్లలకు జన్మనిచ్చారు. తర్వాత మరో ఇద్దరు పిల్లలు జన్మించారు. వారిలో ఒక కుమారుడి పేరులో శేఖర్ పదం ఉంటుంది. భారతీయ అమెరికన్ శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ గౌరవార్థం ఈ పేరు పెట్టినట్లు గతంలో ఓ సందర్భంలో మస్క్ వెల్లడించారు.

# ఏఐ విలువలపై హిందూ సాధువుతో చర్చలు

## ఆంత్రోపిక్ ఆహ్వానించిందన్న సర్వప్రియానంద



కృత్రిమ మేధ మోడళ్లు అదుపుతప్పి ప్రవర్తిస్తున్నాయని, ఈసాంకేతికత వల్ల మానవాళికి ముప్పు పొంచి ఉందని ఆందోళనలు వ్యక్తమవుతోన్న తరుణంలో ఆసక్తికర పరిణామంచోటుచేసుకుంది. ఏఐ విలువలపై చర్చించేందుకు ఆంత్రోపిక్ సంస్థ ఒక హిందూ సాధువును అమెరికాకు ఆహ్వానిం చింది. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ఆ సాధువు చెప్పడంతో ఇది వెలుగులోకి వచ్చింది. ఆధ్యాత్మిక విలువలను తమ క్లాడ్ ఏఐ మోడల్స్ అర్థం చేసుకోవడానికి వీలుగా తత్వవేత్తలు, పండితులతో ఆంత్రోపిక్ చర్చలు జరుపుతోందని ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఆన్‌లైన్ ఇంటర్వ్యూ కోసం కొంతకాలం క్రితం ఆంత్రోపిక్ తనను సంప్రదించిందని ఆధ్యా త్మిక గురువుస్వామి సర్వప్రియానంద వెల్లడించారు. ఆతర్వాత ఓ చర్చా కార్యక్రమం కోసం తనను ఆ సంస్థ అమెరికాకు ఆహ్వానించినట్లు తెలిపారు. తనతోపాటు వివిధ మతాలకు చెందిన తత్వవేత్తలు, మానసిక నిపుణులు కూడా ఆ చర్చల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఏఐ మోడల్ క్లాడ్‌కు నైతిక విలువలపై శిక్షణ, ఏఐ ఎథిక్స్‌కు సంబంధించిన ప్రశ్నలపైనా వారంతా చర్చించినట్టు సమాచారం. ఇలాంటి చర్చల ద్వారా భవిష్యత్తులో ఏఐ మానవాళికి హాని చేయకుండా తీర్చిదిద్దేందుకు టెక్ సంస్థలు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. సమావేశానికి సంబంధించి ఆంత్రోపిక్ సంస్థతో నాన్ డిస్‌క్లోజర్ అగ్రిమెంట్ ఉందని స్వామి సర్వప్రియానంద తెలిపారు. అందుకే ఆ సమావేశం వివరాలను బయటకు వెల్లడించలేనన్నారు. అద్వైత వేదాంత బోధనలను డిజిటల్ యుగానికి తగినట్లుగా అంతర్జాతీయ వేదికలపై వివరించే సర్వప్రియానంద..'ఇంటర్నెట్ యుగం వివేకానంద' గా పేరొందారు.



# హర్మూజ్‌లో ట్యాంకర్లపై క్షిపణి దాడులు

### ఐదుగురు భారత నావికులు సురక్షితం

హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈజలసంధిలో కువైట్ జెండాతో వెళ్తున్న 'కజిమా-3' చమురు ట్యాంకర్‌పై క్షిపణిదాడి జరిగినట్లు ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. టోగోలోని లోమే ఓడరేవుకు వెళ్తుండగా ఈ ఘటన జరిగిందని పేర్కొంది.అందులోని సిబ్బందిలో ఐదుగురు భారత నావికులు ఉండగా.. వారిని కాపాడినట్లు తెలిపింది. అయితే, నౌకపై ఎవరు దాడి చేశారనేది ఇంకా తెలియరాలేదు. మరోవైపు హర్మూజ్ సమీపంలోని రెండు చమురు ట్యాంకర్లపై క్షిపణి దాడులు జరిగాయని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ఏజెన్సీ వెల్లడించింది. నౌకలు ఒమనకు తూర్పువైపున ప్రయాణిస్తుండగా.. ఈ ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపింది. వాటిలో మంటలు ఎగసిపడగా.. సిబ్బంది అప్రమత్తతతో ప్రమాదం తప్పిందని పేర్కొంది. ఈ దాడులకు ఎవరూ బాధ్యత వహించలేదు.

# కీవ్ బ్రిడ్జిలపై రష్యా దాడులు



ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా రాజధాని కీవ్‌లోని కీలకమైన బ్రిడ్జిలను రష్యా టార్గెట్ చేసింది. నగరంలోని నార్తర్న్ బ్రిడ్జిపై రష్యా దాడి చేసినట్టు కీవ్ మేయర్ విటాలీ క్లిచ్‌కో తెలిపారు. దాడిలో బ్రిడ్జిపై ఉన్న ఓవర్‌హెడ్ వైర్లు, రోడ్డు, ట్రాలీ బస్సు ధ్వంసమైనట్టు వెల్లడించారు. కీవ్‌లోని కీలక ప్రాంతాలను రష్యా లక్ష్యంగా చేసుకుంటోందని క్లిచ్‌కో పేర్కొన్నారు. ఇటీవల రష్యా వరుసగా డ్రోన్లతో దాడులు చేస్తోంది. గురువారం కీవ్‌లోని సదరన్ బ్రిడ్జిపైనా దాడి జరిగిన విషయం తెలిసిందే. తాజాగా నార్తర్న్ బ్రిడ్జిను కూడా లక్ష్యంగా చేసుకోవడంతో నగరంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను అనుసంధానించే రెండు కీలక వంతెనలు దాడులకు గురయ్యాయి. తాజా దాడులతో కీవ్ నగరం తీవ్రంగా దెబ్బతింటోందని క్లిచ్‌కో వ్యాఖ్యానించారు.

# ఓహియో హిందూ ఆలయంపై దాడి



అమెరికాలోని ఓహియో రాష్ట్రంలో హిందూ ఆలయంపై ఇటుకలతో దాడి జరిగింది. రిచ్‌మండ్ హైట్స్‌లోని శ్రీ స్వామినారాయణ్ వడ్తాల్ ధామ్ హిందూ మందిర్‌పై దాడి జరిగినట్లు హిందూ అమెరికన్ ఫౌండేషన్ వెల్లడించింది. దుండగులు ఇటుకలతో ఆలయంపై దాడి చేయడంతో కిటికీలు దెబ్బతిన్నాయని ఫౌండేషన్ తెలిపింది.ఆలయంలో పూజారులు, భక్తులు ఉన్న సమయంలోనే ఈ ఘటన జరిగినట్లు పేర్కొంది. ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఆలయం సమీపంలోని నిఘా కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆలయ నిర్వాహకులతో తాము సంప్రదింపులు జరుపుతున్నామని హిందూ అమెరికన్ ఫౌండేషన్ వెల్లడించింది. అమెరికాలో భారతీయ సంతతికి చెందిన ప్రజలపై ఇటీవల దాడుల ఘటనలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో ఈ ఘటన ప్రాధాన్యం సంతరించుకుంది.

# అమన్ పట్టు.. పసిడి గెలుపు

## భారత స్వర్ణాల పరుగులో అమన్ మరో అడుగు

ఆసియా క్రీడల్లో భారత్‌కు శనివారం పసిడిపంట పండింది. ఆర్చరీ, గోల్ఫ్, క్రికెట్‌లో స్వర్ణాలు సాధించిన భారత్.. తాజాగా రెజ్లింగ్‌లోనూ బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. పురుషుల 57 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో భారత రెజ్లర్ అమన్ సెహ్రావత్ అదరగొట్టాడు. ఉత్తర కొరియాకు చెందిన ప్రపంచ చాంపియన్ చాంగ్ సాంగ్ హాన్‌ను 11-7 తేడాతో ఓడించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఫైనల్ పోరు ఆరంభం నుంచే ఉత్కంఠగా సాగింది. ప్రత్యర్థి బలాన్ని అంచనా వేసిన అమన్.. తనదైన శైలిలో దూకుడుగా ఆడాడు. ప్రత్యర్థి కాళ్లను లక్ష్యంగా చేసుకుంటూ వరుసగా పాయింట్లు సాధించాడు. తొలి దశలోనే ఆధిక్యంలోకి వెళ్లిన అతడు.. పోరు సాగుతున్న కొద్దీ ఆధిపత్యాన్ని కొనసాగించాడు. ఓ దశలో అమన్ 6-1తో ముందంజలో నిలిచాడు. అయితే ప్రపంచ చాంపియన్ హాన్ చోంగ్ సాంగ్ అంత తేలిగ్గా లొంగలేదు. వరుస దాడులతో స్కోరును 7-5కు, ఆ తర్వాత 7-6కు తీసుకొచ్చాడు. దీంతో ఫైనల్ పోరు చివరి క్షణాల్లో మరింత ఉత్కంఠగా మారింది. అమన్‌కు ముఖానికి గాయం కావడంతో పాటు నోటినుంచి రక్తం వచ్చినా.. అతడు వెనక్కి



తగ్గలేదు. ప్రత్యర్థి దాడులను సమర్థంగా అడ్డుకుంటూ సరైన అవకాశం కోసం ఎదురుచూశాడు. పోరు ముగియడానికి సుమారు 30 సెకన్ల ముందు అమన్ కీలకమైన దాడికి దిగాడు. ప్రత్యర్థిని నేలకూల్చి రెండు పాయింట్లు సాధించడంతో స్కోరు 10-7కు చేరింది. హాన్ చోంగ్ సాంగ్ ఆ నిర్ణయంపై ఛాలెంజ్ చేసినా.. అది అతడికి అనుకూలంగా రాలేదు. దీంతో మరో పాయింట్ అమన్ ఖాతాలో చేరింది. చివరి క్షణాలను జాగ్రత్తగా ఎదుర్కొన్న భారత రెజ్లర్ 11-7 విజయాన్ని ఖరారు చేశాడు. ఈ విజయంతో అమన్ గత ఆసియా క్రీడల్లో సాధించిన కాంస్య పతకాన్ని స్వర్ణంగా మెరుగుపరుచుకున్నాడు. అంతేకాదు.. అంతర్జాతీయ వేదికపై మరోసారి తన సత్తాను చాటాడు. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన అమన్.. ఇప్పుడు ఆసియా క్రీడల్లో పసిడి పతకంతో తన ఖాతాను మరింత ఘనంగా మార్చుకున్నాడు. అమన్ సెహ్రావత్ స్వర్ణంతో ఆసియా క్రీడల్లో భారత్ బంగారు పతకాల సంఖ్య 20కి చేరింది. మొత్తంగా 20 స్వర్ణాలు, 26 రజతాలు సహా 82 పతకాలతో భారత్ పతకాల పట్టికలో ఐదో స్థానంలో కొనసాగుతోంది. 167 స్వర్ణాలతో చైనా అగ్రస్థానంలో ఉండగా.. జపాన్, దక్షిణ కొరియా, ఉజ్బెకిస్థాన్ భారత్ కంటే ముందున్నాయి. శనివారం వరుసగా స్వర్ణాలు సాధిస్తున్న భారత్‌కు అమన్ విజయం మరో మధురమైన జ్ఞాపకంగా నిలిచింది.

# పాక్‌పై పసిడి పంచ్!

- ఫైనల్లో పాకిస్థాన్‌పై 19 పరుగుల విజయం
- హసన్ నవాజ్ పోరాడినా.. భారత్‌దే గెలుపు

ఆసియా క్రీడల్లో భారత్ ఖాతాలో మరో స్వర్ణం చేరింది. పురుషుల క్రికెట్‌లో శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోని టీమ్‌ఇండియా పసిడి పతకం సాధించింది. ఫైనల్లో పాకిస్థాన్‌ను 19 పరుగుల తేడాతో ఓడించి స్వర్ణాన్ని నిలబెట్టుకుంది. టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. 20 ఓవర్లలో 6 వికెట్లకు 211 పరుగులు చేసింది. ఆరంభంలో వికెట్లు కోల్పోయినా అభిషేక్ శర్మ, తిలక్ వర్మ ఇన్నింగ్స్‌ను






నిలబెట్టారు. అభిషేక్ 28 బంతుల్లో 61 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడగా.. తిలక్ వర్మ 22 బంతుల్లో అజేయంగా 51 పరుగులు చేశాడు. చివర్లో శివమ్ దూబే 15 బంతుల్లో 27 పరుగులతో రాణించడంతో భారత్ స్కోరు 200 దాటింది.

మందకొడి పిచ్‌పై పాకిస్థాన్ ఎక్కువగా స్పిన్నర్లను ఉపయోగించింది. తొలి దశలో భారత బ్యాటర్లను కట్టడి చేసినా.. చివరి ఐదు ఓవర్లలో భారత్ 74 పరుగులు రాబట్టడంతో పాక్ బౌలర్ల వ్యూహం దెబ్బతింది. 212 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. 39 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. అయితే హసన్ నవాజ్ అద్భుతంగా పోరాడాడు. 51 బంతుల్లో 96 పరుగులు చేసి భారత బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. సైమ్ అయూబ్ 29, మజ్ సదాఖత్ 23 పరుగులతో అతడికి సహకరించారు. ఒక దశలో పాకిస్థాన్ విజయంపై ఆశలు రేకెత్తించినా.. కీలక సమయంలో భారత బౌలర్లు వికెట్లు తీస్తూ మ్యాచ్‌ను తమవైపు తిప్పుకున్నారు. అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, శివమ్ దూబే చెరో రెండు వికెట్లు పడగొట్టారు. చివరి వరకు పోరాడిన పాకిస్థాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 192 పరుగులకే పరిమితమైంది. దీంతో భారత్ 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో ఆసియా క్రీడల్లో భారత్ పురుషుల క్రికెట్ స్వర్ణాన్ని మరోసారి నిలబెట్టుకుంది. పాకిస్థాన్ రజతం సాధించగా.. బంగ్లాదేశ్‌ను ఓడించిన శ్రీలంక కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. పురుషుల క్రికెట్ స్వర్ణంతో ఆసియా క్రీడల్లో భారత్ పతకాల సంఖ్య 82కి చేరింది.

# హాకీలో గోల్డెన్ డబుల్

### మలేసియాపై 5-1 తేడాతో భారత్ ఘన విజయం

ఆసియా క్రీడల్లో భారత్ ఖాతాలో మరో స్వర్ణం చేరింది. పురుషుల హాకీ జట్టు పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. మలేసియాతో జరిగిన ఫైనల్లో 5-1 తేడాతో ఘన విజయం సాధించి వరుసగా రెండోసారి ఆసియా క్రీడల హాకీ స్వర్ణాన్ని నిలబెట్టుకుంది. ఈ విజయంతో భారత్ 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత కూడా సాధించింది. ఫైనల్ ఆరంభం నుంచే ఇరు జట్లూ హోరాహోరీగా తలపడ్డాయి. 11వ నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి భారత్‌కు 1-0 ఆధిక్యం అందించాడు. అయితే 14వ నిమిషంలో మలేసియా గోల్ చేయడంతో స్కోరు సమమైంది. అనంతరం భారత్ మళ్లీ దూకుడు పెంచింది. జుగ్‌రాజ్ సింగ్ గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లిన భారత్.. రెండో అర్ధభాగంలో మరింత దూకుడుగా ఆడింది. హార్దిక్ సింగ్, శిలానంద్ లక్రా గోల్స్ చేయగా.. చివర్లో హర్మన్‌ప్రీత్ మరో గోల్‌తో భారత్ ఆధిక్యాన్ని 5-1కి చేర్చాడు. ఆ తర్వాత మలేసియాకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా భారత ఆటగాళ్లు ఆధిపత్యం ప్రదర్శించారు. కీలక సమయాల్లో డిఫెన్స్ పటిష్ఠంగా వ్యవహరించడంతో ప్రత్యర్థి గోల్స్ సాధించలేకపోయింది. దీంతో భారత్ 5-1తో ఘన విజయాన్ని అందుకుంది. ఈ స్వర్ణం భారత హాకీ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచింది. ఆసియా క్రీడల చరిత్రలో తొలిసారిగా ఒకే ఎడిషన్‌లో భారత పురుషుల, మహిళల హాకీ జట్లు రెండూ స్వర్ణ పతకాలు సాధించాయి. అంతేకాదు.. పురుషుల జట్టు వరుసగా రెండోసారి ఆసియా క్రీడల చాంపియన్‌గా నిలిచింది. ఆసియా క్రీడల్లో భారత బృందం ప్రయాణం ముగింపు దశకు చేరుకున్న వేళ.. హాకీ జట్టు స్వర్ణంతో మరో ఘనతను ఖాతాలో వేసుకుంది.

**అంతిమ్‌కు రజతం.. దీపక్‌కు కాంస్యం**

మహిళల 53 కేజీల విభాగంలో రెజ్లర్ అంతిమ్ పంఘాల్ ఫైనల్లో ఓడిపోయింది. దీంతో రజతంతో సరిపెట్టుకుంది. ఇక 97 కేజీల పురుషుల రెజ్లింగ్‌లో దీపక్ పునియాకు కాంస్యం దక్కింది.

**చైనానే టాప్.. కానీ**

ఆసియా క్రీడల్లో అత్యధిక పతకాలు సాధించిన దేశంగా చైనా నిలిచింది. 167 స్వర్ణాలు, 89 రజతాలు, 83 కాంస్యాలు ఉన్నాయి. మొత్తం 339 పతకాలను సాధించింది. గత ఎడిషన్‌తో పోలిస్తే చైనా పతకాలు తగ్గాయి. 201 స్వర్ణాలు, 111 రజతాలు, 71 కాంస్యాలతో 383 పతకాలను అప్పుడు చైనా సొంతం చేసుకుంది. ఇక ఈసారి ఆతిథ్య జపాన్ గతంకంటే చాలా మెరుగ్గా పతకాలను సాధించడం గమనార్హం. 2022లో 188 సాధించగా.. ఈసారి 265 పతకాలకు చేరుకుంది. కొరియాకి కూడా 190 నుంచి 149కి తగ్గిపోయాయి. భారత్ గత ఎడిషన్లో 107 రాగా.. ఈసారి 85 పతకాలు మాత్రమే వచ్చాయి.



# 'ఆ నీచులను వదిలిపెట్టను'



సామాజిక మాధ్యమాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను ఉపయోగించి అసభ్యకర రీతిలో వీడియోలను క్రియేట్ చేయడంపై అగ్రకథానాయకుడు ఎన్టీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవర సినిమాలోని 'చుట్టమల్లే' పాట వీడియోను ఏఐతో మార్ఫింగ్ చేయడంపై మండిపడ్డారు. మహిళలను పూజించే దేశంలో వారి గౌరవాన్ని దిగజార్చారంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. వారిని వదిలిపెట్టబోనని, బాధ్యులపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. "ఇది అత్యంత అసహ్యకరమైన చర్య. మహిళలను తల్లులుగా, దేవతలుగా పూజించే నేల మనది. 'మాతృదేవోభవ' అనే నినాదం మన సంస్కృతిలో భాగమైన చోట.. కొందరు వ్యక్తులు అత్యంత దిగజారి ప్రవర్తిస్తున్నారు. ఒక మహిళను అవమానించేలా ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ ఇలాంటి నీచమైన కంటెంట్‌ను సృష్టించడం సిగ్గుచేటు. 'చుట్టమల్లే' పాట మార్ఫింగ్ వీడియో వెనుక ఉన్న నీచులు ఎవరినీ వదిలిపెట్టను" అని ఎన్టీఆర్ హెచ్చరించారు.

ఇక ఇలాంటి అసభ్యరమైన కంటెంట్‌ను ఎవరూ చూడొద్దని ఎన్టీఆర్ విజ్ఞప్తి చేశారు. "ఈరోజు వేరొక మహిళకు ఇలాంటి అవమానం జరిగింది. రేపు మీ ఇంట్లో మీ తల్లి. భార్య, కుమార్తెకూ ఇదే పరిస్థితి ఎదురవ్వొచ్చు. ఏఐ దుర్వినియోగాన్ని అరికట్టడానికి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడానికి కేంద్రంతో పాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కఠినమైన నిబంధనలు తీసుకురావాలని కోరుతున్నాను" అని ఎన్టీఆర్ పేర్కొన్నారు.

# యదార్థ ప్రేమకథగా 'మొహబ్బత్'



సంతోష్ రాజా, శ్రేయాస్ సేన్ జోడీగా నటిస్తున్న తాజా చిత్రం 'మొహబ్బత్'. రాయలసీమ నేపథ్యంలో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న మ్యూజికల్ ఎమోషనల్ లవ్‌స్టోరీకి మ్యాక్ దర్శకుడు. ఏబీఎస్ ప్రొడక్షన్స్ పతాకంపై అఫ్రోజ్ షేక్ నిర్మించారు. తాజాగా సినిమా టీజర్‌ను ప్రముఖ హీరో నవదీప్, దర్శకుడు కరుణకుమార్ హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. నవదీప్ మాట్లాడుతూ.. నిర్మాత అఫ్రోజ్ అమెరికాలో ఉద్యోగం చేస్తూనే సినిమా నిర్మాణంలోకి రావడం అభినందనీయమన్నారు. టీజర్‌లోని విజువల్స్ ఆకట్టుకున్నాయని, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. నటుడు అజయ్ ఘోష్ మాట్లాడుతూ.. ఇది 'ప్రేమిస్తే' తరహాలో సాగే విభిన్నమైన భావోద్వేగ ప్రేమకథ అన్నారు. సునీల్ కశ్యప్ సంగీతం చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చెప్పారు.

నిర్మాత అఫ్రోజ్ షేక్ మాట్లాడుతూ.. మంచి సినిమా అందించాలనే ఉద్దేశంతో ఎక్కడా రాజీపడకుండా చిత్రాన్ని నిర్మించామని, కథపై పూర్తి నమ్మకం ఉందన్నారు. దర్శకుడు మ్యాక్ మాట్లాడుతూ.. ప్రేక్షకులకు కొత్త అనుభూతినిచ్చేలా సినిమాను రూపొందించామని, ఇందులో అజయ్ ఘోష్ పాత్ర ప్రత్యేకంగా నిలుస్తుందని తెలిపారు. హీరో సంతోష్ మాట్లాడుతూ.. కడపలో జరిగిన యదార్థ ఘటన ఆధారంగా చిత్రాన్ని తెరకెక్కించామని, సినిమాటోగ్రఫీ, సంగీతం ప్రధాన బలాలుగా నిలుస్తాయని చెప్పారు. హీరోయిన్ శ్రేయాస్ సేన్ కూడా సినిమా విజయంపై విశ్వాసం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు సునీల్ కశ్యప్ చిత్రంలోని పాటలు ప్రేక్షకులను అలరిస్తాయని తెలిపారు. త్వరలోనే 'మొహబ్బత్' ప్రేక్షకుల ముందుకు రానుంది.

# యూ ఆర్ రియల్ హీరో..




యూ ఆర్ రియల్ హీరో.. అంటూ భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై సినీ హీరోలు అభినందనలు కురిపిస్తున్నారు. అగ్రకథానాయకుడు చిరంజీవి స్పందిస్తూ.. తన ప్రాణాలు ఫణంపెట్టి ప్రయాణికులను కాపాడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై ప్రశంసలు కురిపించారు. ఆ విపత్కర పరిస్థితుల్లో ఆయన హనుమాన్ చాలీసా పఠించారని తెలిసి మనసు చలించిపోయిందని వ్యాఖ్యానించారు. "తన ప్రాణాలు ప్రమాదంలో ఉన్నా.. తోటి వారి ప్రాణాలను కాపాడాలనే సంకల్పంతో అసమాన ధైర్యం ప్రదర్శించిన స్మిత్ మచ్చర్‌కు హృదయపూర్వక అభినందనలు. దాడికి గురై, తీవ్రంగా గాయపడిన స్థితిలోనూ సమయస్ఫూర్తితో స్పందించి, ఒక్కడై పోరాడిన నీ సాహసం ప్రతి భారతీయుడికీ గర్వకారణం. ఆ క్లిష్ట సమయంలో హనుమాన్ చాలీసా పఠిస్తూ మనోధైర్యాన్ని కూడగట్టుకున్నారని తెలిసి మనసు చలించింది. ఆంజనేయస్వామి అనుగ్రహం నీపై ఎప్పుడూ ఉండాలని, నువ్వు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని చిరంజీవి తన పోస్టులో రాసుకొచ్చారు. కెప్టెన్ స్మిత్ ధైర్యసాహసాలపై సోషల్ మీడియాలో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. "భవిష్యత్తులో స్మిత్ మచ్చర్ నడిపే విమానంలో ప్రయాణం చేసే అవకాశం రావాలి. అలా వస్తే నేనెంతో అదృష్టవంతుడిని" అని బాలీవుడ్ అగ్రకథానాయకుడు సల్మాన్ ఖాన్ ట్వీట్ చేస్తూ.. ఆయన గొప్ప పని చేశారని కొనియాడారు. "ఆకాశంలో అసలైన హీరో. విమానంలో అలాంటి కఠినమైన సమయంలో స్మిత్ మచ్చర్ చూపిన అసాధారణ ధైర్యానికి, సమయస్ఫూర్తికి హృదయపూర్వక అభినందనలు. రక్తమోడుతున్నా.. కాక్‌పిట్ డోర్ తెరిచి, పెను విషాదాన్ని నివారించారు. 174 మంది ప్రాణాలను కాపాడారు. ఆయన నిజమైన వీరుడు, భారత్ గర్వించదగ్గ పుత్రుడు. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. "కెప్టెన్ మీరు ఎదుర్కొన్న పరిస్థితుల్లో మానవత్వంతో, ధైర్యంగా వేసిన ముందడుగు నిజంగా అద్భుతం. త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా" అని విజయ్ దేవరకొండ, "స్మిత్ మచ్చర్ మీరు నిజమైన హీరో" అని ఆర్ మాధవన్, "కెప్టెన్.. కర్తవ్య నిబద్ధతకు, అచంచలమైన ధైర్యానికి, అసాధారణ మేధస్సుకు మీరు ప్రతీకగా నిలుస్తారు" అంటూ రవికిషన్.. ఇలా సినీ ప్రముఖులు తన అభినందనలు, ప్రశంసలను సోషల్ మీడియాలో హోరెత్తిస్తున్నారు.

# సల్మాన్ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్!



బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ నటిస్తున్న యుద్ధ నేపథ్య చిత్రం 'మాతృభూమి: మే వార్ రెస్ట్ ఇన్ పీస్' విడుదలకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. అపూర్వ లఖియా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో చిత్రాంగద సింగ్ కథానాయిక. షూటింగ్ పూర్తయి చాలాకాలం గడిచినా విడుదలపై స్పష్టత లేకపోవడంతో అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజాగా సినిమాకు సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ లభించినట్టు బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తొలుత 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్' పేరుతో రూపొందిన చిత్రం.. భారత్-చైనా సరిహద్దులోని గాల్వాన్ లోయ ఘర్షణల నేపథ్యంలో తెరకెక్కినట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే ఇరు దేశాల సంబంధాలకు సంబంధించిన అంశాలను దృష్టిలో ఉంచుకుని సినిమా టైటిల్‌తోపాటు కథనంలోనూ మార్పులు చేయాలని సూచనలు వచ్చినట్టు ప్రచారంజరిగింది. దీంతో చిత్రబృందం కొన్ని మార్పులు చేసి 'మాతృభూమి: మే వార్ రెస్ట్ ఇన్ పీస్'గా పేరు మార్చినట్లు సమాచారం. తాజాగా 'బాలీవుడ్ హంగామా' కథనం ప్రకారం.. చిత్రబృందం సమర్పించిన కొత్త వెర్షన్‌పై మంత్రిత్వశాఖ అధికారులు సంతృప్తి వ్యక్తంచేసి ఎన్‌ఓసీ జారీ చేసినట్లు తెలుస్తోంది. కొత్తవెర్షన్‌లో భారత్-చైనా సంబంధాలను సానుకూల దృక్పథంలో చూపించినట్లు సమాచారం. అయితే థియేటర్లలో విడుదలకావాలంటే ఇంకా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) నుంచి సర్టిఫికెట్ పొందాల్సి ఉంది. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాతే విడుదల తేదీపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. సల్మాన్ ఖాన్ నటిస్తున్న చిత్రంపై తాజా పరిణామం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.

# 'గాంధీ' పాత్రలో ప్రతీక్..

'స్కామ్ 1992' వెబ్‌సిరీస్‌తో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న దర్శకుడు హన్సల్ మెహతా తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'గాంధీ'. మహాత్మా గాంధీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందుతున్న సినిమా నుంచి గాంధీ జయంతి సందర్భంగా మేకర్స్ ఫస్ట్‌లుక్‌తోపాటు తెరవెనుక చిత్రాలను విడుదల చేశారు. ఇందులో మహాత్మా గాంధీ పాత్రలో 'స్కామ్ 1992' ఫేమ్ ప్రతీక్ గాంధీ నటిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు హన్సల్ మెహతా సోషల్ మీడియాలో గాంధీజీని స్మరించుకుంటూ భావోద్వేగ పూరిత పోస్ట్ పెట్టారు. ఎక్కడికి వెళ్తున్నాడో కూడా స్పష్టంగా తెలియని ఒక సాధారణ యువకుడైన మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ.. అనూహ్యంగా ప్రపంచం గుర్తించిన మహోన్నత వ్యక్తిగా ఎదిగారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా నేడు ఆయన జీవిత ప్రయాణాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని, ఆయన అనుసరించిన అహింసా మార్గాన్ని గౌరవించాలని పిలుపునిచ్చారు. 1869 అక్టోబర్ 2న జన్మించిన మహాత్మా గాంధీ 1948 జనవరి 30న కన్నుమూశారు. ప్రముఖ రచయిత రామచంద్ర గుహ రచించిన పుస్తకాల ఆధారంగా ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ తెరకెక్కుతోంది. గాంధీజీ వ్యక్తిగత జీవితం, ఆయన ఆలోచనలు, ప్రయాణాన్ని తెరపై ఆవిష్కరించేం దుకు హన్సల్ మెహతా సిద్ధమవుతున్నారు. తాజాగా విడుదలైన ఫస్ట్‌లుక్, బీటీఎస్ చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి.



## 'రాకా'లో లేను.. ఛాన్స్ ఇప్పించండి



అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రాకా'లో తాను నటిస్తున్నట్టు వస్తున్న వార్తలను ప్రముఖనటి ఐశ్వర్య లక్ష్మి ఖండించారు. ఈ సినిమాలో ఆమె నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారంటూ కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ ఊహాగానాలపై స్పందించిన ఆమె.. తన క్యాస్టింగ్ గురించి వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు. "లేదు.. నేను ఈ సినిమాలో భాగం కాదు. దయచేసి ఎవరైనా నన్ను ఈ సినిమాలో తీసుకోండి" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. దీంతో 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి నటిస్తున్నారనే ప్రచారానికి తెరపడింది. అల్లు అర్జున్, అట్లీ కలయికలో వస్తున్న తొలి చిత్రం కావడంతో 'రాకా'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తుండగా.. మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్, రష్మిక మందన్న తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా నటీనటుల ఎంపికపై ఇప్పటికే పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.